తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 10

# అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు

(తాళ్లపాక చినతిరుమలాచార్య విరచితములు)

పరిష్కర్త

**విద్వాన్ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు**

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

**1998**

ప్రథమ ముద్రణ : 1962
ద్వితీయ ముద్రణ : 1998

© తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

ప్రతులు : 2,000

వెల : రు. 13-00

ప్రచురణ :
శ్రీ M.K.R. వినాయక్, I.A.S.
కార్యనిర్వాహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

ముద్రణ :
త్రివేణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్
14/264, ఈడేపల్లి
మచిలీపట్నం - 1
ఆంధ్రప్రదేశ్

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు. ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి. వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు.

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి.

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది. తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు.

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనల కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి.

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు.

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనల కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి.

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి. ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు. పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి. తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది.

ప్రథమతః తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A.,Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము.

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం.

**M.K.R. వినాయక్**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి ప్రపత్తి, దేహాత్మైక విచారాదులను తెలిపే ఆధ్యాత్మసంకీర్తనలు; జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు. సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు. శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు. శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు.

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు. తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి.

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు. అన్నమయ్య గ్రాంథిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు. జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు.

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు. వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు.

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి.

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది. మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది.

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి. మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి.

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన అవశ్యకత ఏర్పడింది.

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింపబడుచున్నాయి. పరిష్కర్తవే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి. తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి. సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది.

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది.

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి.

ఈ సంపుటాల ముద్రణకు అధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.కె.ఆర్.వినాయక్ I.A.S. గారికి కృతజ్ఞతాంజలి.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదిగొండ ప్రభాకరరావు M.A.,Ph.D గారికి (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు.

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం. లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి.తి.దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి. సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు.

డా॥ మేడసాని మోహన్ M.A., Ph.D
డైరెక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

తేది : 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి. వివిధ దశలలో 5, 6, 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి. వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

శ్రీ

# పీఠిక

విద్యాజయమును కాంక్షించి యొకరి నొకరు మించవలె నని కొందఱు, రాజాశ్రయమున మహాభోగము లంది కమనీయకవితాస్రవంతులను జాలువార్చినవారు కొందఱు, రాజులను సైతము ఛీ ధిక్ అని ధిక్కరించి భగవత్ప్రీతిగా రచన కావించిన పారమార్థికతత్పరులు కొందఱుగా కవులు మహాకవులు నెందఱో యవతరించి యంతరించినారు. భాగ్యవశమున నట్టివారిలోఁ గొందఱు మాత్రమే మనకు నేఁడు తెలియ వచ్చుచున్నారు. ఆ తెలియవచ్చినవారు సైతము ఏదో కొద్దిమంది మహాపురుషుల ధర్మమా యని వారి ప్రయత్నమువలన తెలియ వచ్చినవారు. వారిలో తుదికోవకుఁ జెందినవారు శ్రీతాళ్లపాకవారు. అస్మద్గురుదేవులు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1949 సం॥ లో అన్నమాచార్య చరిత్రమును తిరుమల-తిరుపతి దేవస్థానమువారి యాజమాన్యమున ప్రకటించి తాళ్లపాకవారి కవితామాహాత్మ్యమును ప్రప్రథమముగా లోకమునకుఁ దెలిపిరి. ఏఁటేట తిరుపతిలో జరగుచున్న యీ అన్నమాచార్యోత్సవములకు పునాది వేసినవారు కూడ వారే.

## అన్నమయ్య జననము

నందవరీక బ్రాహ్మణుడు, ఋగ్వేది, ఆశ్వలాయనసూత్రుడు, భారద్వాజగోత్రుడు నైన నారాయణసూరికి, ఆతనిపత్ని లక్కమాంబకు, (శ్రీవైష్ణవ కులపతియు, పన్నిద్దరాళ్వార్లలో ముఖ్యులు నైన నమ్మాళ్వార్లు వైశాఖ విశాఖను జన్మించినట్లు) శ్రీవేంకటేశ్వరస్వామి వరప్రసాదమున 14-4-1424 సం॥ క్రోధి వైశాఖ విశాఖా నక్షత్రమున-చక్కని గ్రహములు ఉచ్చమున మూఁడలర అన్నమయ్య జన్మించినాడు.

## అన్నమయ్య బాల్యము

పుట్టిన నాటనుండి తిరుమలప్పని నామోచ్చారణ తలిదండ్రులు చేయనిదే యీ పసిబిడ్డడు తల్లిపాలు నైతము త్రాగెడివాడు కాడు. తొట్లలో నుంచి ఎంత పాటుపడి జోల పాడినప్పటికి నిద్రింపక వెంకటపతిపేరు వివరించి పాట పాడిన వెంటనే పోరు మాని నిద్రించువాడు. కొండలప్ప దైన తిరువెంకటప్పకు మ్రొక్కు మనగనే నమస్కరించువాడు. చిన్నబిడ్డ దయ్యును శేషశైలేంద్రునిమీది చింతతో నుండెడివాడు. క్రమేణ వయసు పెరుగుచుండెను. తలిదండ్రు లీతవిని అన్నయ్య, అన్నప్ప, అన్నమాచార్య, అన్న అని పిలుచుచుండిరి.

## అన్నమయ తిరుమల యాత్ర

వయసు పెరుగుకొలది నితనికి శ్రీవేంకటేశ్వరునిపై భక్తి పెరుగ జొచ్చినది. తలిదండ్రులు, అన్న వదినలు నింటిలోని పనులు చేయు మని అన్నమయ్యను నిర్బంధింపసాగిరి. ఈతనికి గిట్టక 'శ్రీహరీ హరీ' యనుచు, 'ఎన్నటి చుట్టంబు ఎన్నటి బంధువుడ నేను వారికి యీ వెట్టి నా కేల-తల్లియు దండ్రియు దైవము గురువు ఎల్ల సంపదలు నైన శేషాద్రినాథుని గొలిచి మనియెద' నని 'గోవింద గోవింద గోవింద' యనుచు జను పరుషలవెంట తిరుమలకు బయలుదేరెను. ఎనిమిదవ యేటనుండియే అన్నమయ కీర్తనలు రచించెడివాడు. "ఆడిన మాటెల్ల నమృతకావ్యముగ - పాడినపాటెల్లఁ బరమగానముగ - తన కవిత్వమునకుఁ దన గానమునకుఁ - గనుఁగొని సకల లోకములు గీర్తింప - వెంకటపతిమీఁద వింత వింతలుగ-సంకీర్తనంబులు సవరించు' చుండెడివాడు. తిరుమల చేరువనే సాలగ్రామపర్వతముకడ అలమేల్మంగా స్తుతిపరముగా వేంకటేశ్వరుని ముద్రతో శతకము నొకదానిని రచించినాడు. ఆనాటి అన్నమయకవిత్వమునకు మచ్చున కొకటి :

ఉ. పల్లవపాణి విశ్వగురుభామిని యిట్టిప్రపంచ మంతకుఁ
దల్లి సమస్తజీవులనిదానమ శ్రీయలమేలుమంగ ! నీ
చల్లనిచూపు చిల్కు వెదచల్లఁగఁ బుణ్యుల మైతి మంద్రు భూ
మెల్లను నీ వధూమణి ననేకవిధంబుల వెంకటేశ్వరా !

తిరుమల చేరినాడు. అందలి దివ్యస్థలముల నెల్ల దర్శించినాడు. తన పంచకొంగుకడ కట్టుకొన్నది ఒక కాసు కానుక పెట్టినాడు. క్రీ. శ. 1432 సంవత్సరము ఏకాదశిని స్వామిని దర్శించినాడు. ఆనా డతడు స్వామిపై నొక శతకము చెప్పెను. అది నేడు కానరాదు. తిరిగి ద్వాదశి నాడు స్వామిదర్శనమునకు వెళ్ళి తన మహిమ తెలియజేసి ఒక శతకమును చెప్పెను. అదియు నేడు కానరాదు. ఘనవిష్ణు డను యతికడ ముద్రాధారణము, పంచసంస్కృతులు పొందినాడు. తిరిగి స్వగ్రామ మైన తాళ్లపాక చేరినాడు.

## అన్నమాచార్యుల వివాహము - గురువు

పదునాఱేండ్లప్రాయమున తిరుమలమ్మను, అక్కలమ్మను అన్నమయ్య వివాహ మాడెను. పరమేశు డైన అహోబల నరసింహస్వామి ప్రత్యక్ష మై, తానే త్రిదండమును, నారసింహచక్రాది మంత్రములు దయ చేయగా గొని హరి హయగ్రీవుని ప్రత్యక్షము జేసికొని, సర్వతంత్ర స్వతంత్రు డైనట్టి వేదాంతదేశికుల సంప్రదాయమున వర్తించు శఠకోప మునియొద్ద నితఁడు సకల వేదాంతపఠనము చేసెను.

## అన్నమయ్య కవిత్వము

ఇప్పటికే అన్నమయ్య కొన్ని కీర్తనలు, కొన్ని శతకములు రచించినా డని తెలియవచ్చినది. గురూపదేశము పొందినది మొదలు హరిపూజ, హరిసేవ, హరికీర్తనము, హరిధ్యానము ఎల్లప్పుడు చేయ నారంభించినాడు. అప్పుడే-గీర్వాణభాషలోని వాల్మీకి రామాయణమును అనురాగముతో చదివి జీర్ణించుకొని, పాటలుగా రచించి, తనచే రచితము లైన పాటలను ఒకటివెంట ఒకటి పాడి చూపగా, విన్నవారెల్ల నువ్విళ్లూరి వీనుల పండువు కాగా-తుంబురుడో, నారదుడో లేక యీవిధముగా తిరుగు గంధర్వుడో లేక ఈ అన్నమయ మనుజుడో అని కొనియాడిరి. ఈ వార్త విని టంగుటూరు నేలువాడు, రాచమూకలో పరాక్రమశాలి, నాళీక శాత్రవాన్వయుడు, అజేయుడు అయిన సాళ్వ నరసరాయలు అన్న

మయ్యను ఆశ్రయించి, కృష్ణుని సహాయమువలన అర్జునుడు భూచక్ర మేలినట్లు మీ సహాయమువలన నే నీ భూచక్ర మేలుదు ననిన, అతని అందలం బెక్కి, అతడు భృత్యప్రాయు డై కొలిచి రాగా టంగుటూరు చేరి కేశవమూర్తికి నమస్కరించి తనకై నిర్మించిననగరిలో ప్రవేశించినాడు. ఏకార్యము చేయవలసి వచ్చినను అన్నమయ్య ఉత్తరువు లేనిదే సాళ్వ రాయలు చేసెడివాడు కాదు. అన్నమయ్యను హితునిగా, గురునిగా, ఎల్లబంధువులుగ భావించెడివాడు. పెనుగొండలో నుండగా అన్నమా చార్యుల నటకు రావించి, శ్రీహరిపై మీరు రచించిన సంకీర్తనములు వినవలయు నని కోరగా, అన్నమయ్య తన కీర్తనలలో మేలైనవానిని రసవంతము లైనవానిని, రసము లుట్టిపడగా రాగవర్ణములతో పాడ నారంభించెను. అప్పుడు, సమీపమునందలి సంకీర్తనపరులను బిలిచి, బాగుగా వినిపించవలయు నని రాజు కోరగా వారును 'తిపిరిదండె, గాన దండె, వాద్యదండెలు తానసంతానంబు చూప, స్థాయిషడ్జము పంచమము జేసి - తాయములు కడు వింత డాలుగాఁ జూప - తేనెలపై తేట తిన్నని చెలఁకు - పానకముల నేరుపఱచిన మేలు - చక్కెరలో తీపు చల్లఁ దెమ్మె రలు - చిక్కని కపురంబు జీవరత్నములు - కల యమృతంబు మీఁగడ మీఁదిచవులు - చిలుకుచుఁ గవు లెల్లఁ జేమొత్తి మ్రొక్క - వెంకటపతికిఁ గావించిన మంచి - సంకీర్తనముల రసంబు లుట్టఁగను - సింగార మొక కుప్పఁ జేసినరీతి - రంగైన రాగవర్ణములతో పాడెను. రాజును ప్రజ లును సంతోషించిరి. అన్నమయ్యను సాళ్వరాయఁడు సన్మానించెను. అనుదినము అన్నమయ్యకీర్తనలను వినుచుండెను.

## అన్నమయ్య మహిమము

ఒకనాడు రాయలు కోరగా అన్నమయ్య అలంకరించుకొని పల్లకి నెక్కి సంకీర్తనపరులు సేవింపగా, శంఖధ్వానముతో వృషాస్థానముచెంత పల్లకి దిగి వెంట నుండు వైష్ణవుని నల్లన చేయూద లోని కరిగి, ప్రేమతో తన రాకకై ఎదురుచూచుచున్న రాజును సమీపించి, నెయ్యము

తియ్యము ఎసగ సొలవక, శ్రీనివాసో రక్షతు అని దీవించి చే తిరు మణి నిచ్చె. ఇచ్చటయు నెదురుగా జను దెంచి చేకొనుచు సాగి మ్రొక్కి 'చెలులార వేంకటశిఖరినాయకుని-కలికికిఁ గడకంటఁ గనుపట్టు నెఱుపు-చెలువ మేగతి నుండే జెప్పరే' అన్న పదమును పలుమరు పాడించి-పాడించి, విని విని, చొక్కి తలయూచి, ఇది కవిత్వం బని మెచ్చెను. ఆనాటి సభలో కవులు, విద్వాంసులు, గాయకులు, భూమిధవులు, సామంతులు నుండిరి. అన్నమాచార్యుల మహత్త్వము నంతటిని వీనులార వినియు, కన్నార కనియు, సాళ్వ నరసింగరాయడు గర్వాంధు డై పదరక వెంకటపతిమీద నుడువు పదములరీతి నాపై నొక్క పదము చెప్పు మనెను. అన్నమయ్య రెండు చేతులతో చెవులు మూసికొనుచు హరి హరీ అనుచు 'హరి ముకుందుని గొనియాడు నా జిహ్వ నినుఁ గొనియాడంగ నేర' దనెను. వెంటనే రాయ లుగ్రు డై మూరురాయరగండ సంకెల వేయించి యతనిని చెఱయం దుంచెను. అన్నమయ్య వెంకటపతిపై కీర్తనలు పాడగనే సంకెలలు పటాపంచ లై వదలిపోయినవి. రా జీవిషయము విని మహోగ్రు డై తిరిగి సంకెలలు వేయించి పరీక్షించెను. తిరిగి సంకెలలు వీడ్వడినవి. రాజు భయపడి అన్నమయ్యకు మ్రొక్కి 'అపరాధి అపరాధి కృప జూడు' మని వేడెను. పూజించెను. పల్లకిలో నుంచి తన మూపున పల్లకికొమ్ము నిడుకొని ఊరేగించి గౌరవించెను. అన్నమాచార్యు లనుగ్రహించి 'నరహరిసంకీర్తనము సేయు వారిఁ - బరసమానులు గాగ బరికింప వలదు. కృతయుగమున, త్రేతాయుగమున, ద్వాపరయుగమున నేమేమి నరులకు జలజోదరు డిచ్చునో యన్నియును జలజోదరుడు నిజసంకీర్తనమున కలియుగమున నిచ్చును గావున నీవు ప్రతి లేనిభక్తి వెంకటపతిమీద, అదే రీతి భక్తి అతని దాసుల మీద వదలకు' మనెను. లోక మంతయు నీ విషయము విని అన్నమయ్యను పొగడ జొచ్చెను. అచటనుండి తిరుమల జేరి స్వామిని దర్శించి, శృంగారమంజరి రచించి స్వామికి వినిపింపగా స్వామి 'ఆడుచుఁ బతకమా కన్నులజోల - పాడఁగ నాఁ డెల్లఁ బసిబిడ్డ నైతి - నాకృష్ణ

మాచార్యు నధ్యాత్మవినుతి - రాక గొన్నాళ్లు విరక్తుండ నైతి – జగతి నీ శృంగారసంకీర్తనముల - కగపడి మంచి ప్రాయపువాఁడ నయితి' నన్నాడు. అన్నమయ్యయు ప్రతివత్సరము జరుగు బ్రహ్మోత్సవములు సేవించుచుండెను.

### అన్నమయ్య – పురందరదాసు

గద్యపద్యముల డెబ్బదిరెండుమంది యాద్యులచే గొనియాడించు కొన్న రసికుడు, శ్రీపండరంగవిట్ఠలుడే సంధ్యలకు నీళ్లీయగా జేకొన్న పురందరదాసులవారు పరమభాగవతు డై, నందవరకులాగ్రణి యై, వైష్ణవోత్తము డై, మురహరిసంకీర్తనపరు డై యతని సంకీర్తనల పేరు కొన్నమాత్రమున, తలచినమాత్రమున భూత బేతాళ పిశాచములు పాటి పోవ శుభంబులు కలిగించువా డని అన్నమయ్య ప్రసిద్ధిని పొందినది విని యు కనియు మనసున భయమును పొంది యతనిని సమీపించి సాక్షాత్తు శ్రీవిష్ణునిగా కీర్తింపగా అన్నమయ్యయు పురందరదాసుల వారిని సాక్షాత్తు పండరంగవిట్ఠలునిగా కీర్తించెను.

అన్నమయ్య రచనలు:— అన్నమాచార్యచరిత్ర ననుసరించి.

(1) యోగమార్గమున కొన్ని, వైరాగ్యరచనతో కొన్ని, శృంగారరచన రీతి కొన్ని రాగతాళసహితముగా ముప్పదిరెండువేల సంకీర్తనములను రచించెను.

(2) ద్విపదరూపముగా రామాయణము రచించెను. (నేడు కానరాదు)

(3) దేవభాషలో వేంకటాద్రిమహాత్మ్యము నంతటిని రచించెను. అది నేడు ప్రకటిత మైనది కావచ్చును.

(4) శృంగారమంజరి రచించెను. (ప్రకటితము)

(5) శతకములు పంద్రెండు రచించెను. (ఒక శతకము గలదు. ప్రకటితము)

(6) ఇతరభాషలలోను కొన్ని ప్రబంధములను రచించెను. తెలియరాలేదు. అష్టమహిషీకల్యాణరీతిని అన్నమయ్యరచనలు పదములు మాత్రమే.

(7) సంకీర్తనలక్షణకారుని రీతిని దేవభాషలో సంకీర్తనలక్షణము రచించినట్లు కలదు. నే డిది కానరాదు.

అన్నమయ్యభార్య తిమ్మక్క సుభద్రాకల్యాణము రచించినది. (ప్రకటితము)

## అన్నమయ్య సంతతి

అన్నమయ్యకు తిమ్మక్కవలన నరసింహకవి జన్మించెను. నరసింహకవి 'పాడను వర్ణపద్ధతి జెప్పను, నీడు జోడు లే దని సభలో వాదించి జయించినవాఁ' డని అష్టమహిషీకల్యాణమున గలదు. ఇతఁడే కవికర్ణరసాయనమును రచించిన సంకుసాల నరసింహకవి.

తిరుమలమ్మ కుమారుఁ డైన నరసింగన్న తనతల్లిమరణానంతరము అక్కలమ్మ తనకు సవతితల్లి యగుట, ఆమెకు నీతనికి గిట్టకపోవుట కారణములుగా తాతగారి లైన సుంకేసుల (కడపజిల్లా పులివెందుల తాలూకా) చేరియుండును ! లేదా సాళ్వనరసరాయలకు అన్నమయ్యకు గిట్టనిదినములలో సుంకేసుల చేరి యుండవచ్చును. అచటనుండి యతఁ డహోబలము చేరి తమ మతగురువులప్రోత్సాహముతో శ్రీరంగము చేరిన ట్లున్నాఁడు ! ఈకారణములచే నతఁడు తాను రచించిన కవికర్ణరసాయనమున తన తల్లిదండ్రులను పేర్కొన లేదేమో !

సుంకేసులలోని నరసింహస్వామి కృపాకటాక్షమున కలిగినవాఁ డగుటచేతనే యతనికి అన్నమాచార్యులు తండ్రి, తాత, ముత్తాతల పేర్లలో నొక దానిని పెట్టక నరసింహుఁ డని యతనికి పేరు పెట్టిన ట్లున్నాఁడు.

కవికర్ణరసాయనపు తాళపత్రప్రతులలో దేనియందుఁ గాని యవతారికలోను నాశ్వాసాంతగద్యలలోను సుంకేసుల యని కాని సంకుసాల యని కాని లేదు. అది యా తరువాత నెప్పుడు చేరినదో !

నరసింహకవికి నాంచారమ్మయందు నారాయణుడు, అనంతమ్మయందు అప్పలాచార్యులు, అన్నమయ్య యనువారు జన్మించిరి. వారిని గూర్చి వివరములు తెలియ రాలేదు.

అక్కలమ్మవలన తిరుమలాచార్యులు, నరసమ్మ, తిరుమలమ్మ కలిగిరి.

## తిరుమలాచార్యుల రచనలు

తిరుమలాచార్యులు 'ఆంధ్రవేదాంతము' (భగవద్గీత తెలుగు వచనము), ద్విపదరూపమున హరివంశము, చక్రవాళమంజరి, రేఫఱకార నిర్ణయము అనువానిని రచించె నని అష్టమహిషీకల్యాణమున గలదు.

అష్టమహిషీకల్యాణమున పేర్కొనక నేడు లభ్యము లగునవి పెదతిరుమలయ్య రచనలు:-శృంగారసంకీర్తనలు; అధ్యాత్మసంకీర్తనలు, * వైరాగ్యవచన మాలికాగీతాలు ; శృంగార దండకము ; శృంగారవృత్త పద్యాలశతకము ; వెంకటేశ్వరోదాహరణము ; నీతి సీసపద్యశతకము ; సుదర్శనరగడట. అష్టమహిషీకల్యాణమున పేర్కొన్న చక్రవాళమంజరి; రేఫఱకారనిర్ణయము ; ఆంధ్రవేదాంతము (భగవద్గీతవచనము) లభ్యము లైనవి. హరివంశము మాత్రము కాన రాదు. 'సంకీర్తనలక్షణము' నకు వ్యాఖ్య రచించె నని చినతిరుమలయ్య పేర్కొనెను కాని అది కూడ నేడు కాన రాదు. కాలగర్భమున నెక్కడ అణగి యున్నదో! ఈతనికి 'శ్రీమద్వేదమార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజసిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి ; శరణాగతవజ్రపంజర' బిరుదులు గలవు.

పెదతిరుమలాచార్యులకు తిరుమలాంబయందు అష్టభాషాచక్రవర్తి యైన చినతిరుమలయ్య, అన్ని విద్యలయందు అన్నమయ్యను బోలు

* తంజావూరులో లభించిన మరికొన్ని వచనములను కూడఁ జేర్చి వీనినే శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు "వెంకటేశ్వర వచనములు" అను పేరుతో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారి యాజమాన్యమునఁ బ్రకటించిరి. వైరాగ్యవచనమాలికా గీతములు Thallapaka Minor Works అను సంపుటమునఁ బ్రకటింపఁబడినవి.

అన్నమాచార్యుఁడు, సంగీతసత్త్వవిత్వాధికుఁడు తిరువెంగళాహ్వాయుఁడు, ఉషాకల్యాణ, పరమయోగివిలాస, అష్టమహిషీకల్యాణాదుల రచించి స్వామి కంకిత మిచ్చి వారిచే మకరకుండలములు గొన్నవాఁడు, దినమునకు వేయిద్విపదలు రచించువాఁడు నయిన తిరువేంగళనాథుఁడు, విద్యావిశారదుఁడు, లోకవిదితుఁడు కోనేటి వెంకటనాథుఁడును కలిగిరి–అని అష్టమహిషీకల్యాణమున గలదు.

వీరిలో చినతిరుమలాచార్యుడు – సంకీర్తనలక్షణము, అష్టభాషాదండకము, శృంగారసంకీర్తనలు, అధ్యాత్మసంకీర్తనలు అనువానిని రచించెను. ఈ చినతిరుమలయ్య రచించిన అధ్యాత్మ, శృంగారసంకీర్తనలే యిపు డీ సంపుటమున ప్రకటింపఁ బడుచున్నవి.

అన్నమాచార్యుల అధ్యాత్మ, శృంగారసంకీర్తనల మొదటి రేకులలో పదునాఱవ యేటనుండి యతఁడు సంకీర్తనలు రచింప నారంభించినట్లు చెక్కఁబడి యున్నది. ఈతఁ డేనాఁటినుండి రచింప నారంభించినాఁడో యీ రేకులలో స్పష్టముగా పేర్కొనబడ లేదు. కాని యీ మొదటి కీర్తన చూడుఁడు.

వరాళి

[1] రామా రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరతశత్రుఘ్నులతోడ జయ మందు దశరథరాఘవా॥పల్లవి॥
శిరసు కూఁకటులరాఘవా చిన్నారిపొన్నారి రాఘవా
గరిమ నావయసున తాటకిఁ జంపిన కౌసల్యనందన రాఘవా
అరిది యజ్ఞము గాచి రాఘవా యట్టె హరునివిల్లు విరిచినరాఘవా
సిరులతో జనకునియింట జానకిఁ జెలఁగి పెండ్లాడినరాఘవా

* * *    * * *    * * *

* * *    * * *    * * *

(చిన. అధ్యా. సంఖ్య 1.)

---

1 ఈ సంకీర్తన అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనల 5 సంపుటమున 217 వదిగా నున్నది. వ్రాయసగాని పొరపాటో లేక బుద్ధిపూర్వకముగనే చెక్కినారో ;

'నావయసున తాటకిఁ జంపిన కౌసల్యనందన రాఘవా' యని యుండుటచే శ్రీరాముఁడు తాటకిఁ జంపినవయసున నీతఁడును కీర్తనల రచించినాఁ డనుకొన వచ్చును. అయిన రాముఁడు తాటకిఁ జంపిన దెపుడు? అనుటకు వాల్మీకిరామాయణమున-

ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః
న యుద్ధయోగ్యతా మస్య పశ్యామి సహ రాక్షసైః ॥

(బాల. 20 సర్గ 2 శ్లో.)

అని కలదు. ఆసందర్భమున తద్వ్యాఖ్యాత లైన గోవిందరాజ పండితుఁడు 'ఊనాః అసంపూర్ణాః షోడశవర్షాః యస్య సః తథోక్తః ద్వాదశవర్ష యితి యావత్. బాలో ద్వాదశవర్షోయం అకృతాస్త్ర శ్చ రాఘవః ఇతి విశిష్య వక్ష్యమాణత్వాత్. పరిపూర్ణషోడశ వర్షో హి యుద్ధ క్షమో భవతి. ద్వాదశవర్షో బాలః కథం యుద్ధాయ ప్రభవతీతి భావః.' గోవిందరాజీయము బాలకాండ 120 వ పుట. కుంభకోణమువారి ప్రతి.

ఇంకను

" బాలో ద్వాదశవర్షోఽ య మకృతాస్త్ర శ్చ రాఘవః
కామం తు మమ యత్సైన్యం మయా సహ గమిష్యతి "

(యుద్ధ. 38 - సర్గ 6 శ్లో.)

ఆ సందర్భమున వ్యాఖ్యానించుచు 'ద్వాదశ వర్షః ద్వాదశ వర్షవయస్కః. కేచిత్తు ఇదం రావణబిభీషయోక్తం వస్తుత ఊనషోడశ వర్ష ఇత్యుక్త మిత్యూచుః'. గోవిందరాజీయము అరణ్యకాండ. 127 వ పుట. కుంభకోణమువారిప్రతి. దీనిని బట్టి గోవిందరాజ పండితుని యభిప్రాయము ప్రకారము పంద్రెండు గాని పదునాఱుకు తక్కువ గాని వత్సరము లుండు నని తోఁచుచున్నది. ఈ గోవిందరాజ పండితుఁడు గూడ 16 వ శతాబ్దివాఁడు. (చూ. శ్రీ యం. కృష్ణమాచార్యులవారి సంస్కృత వాఙ్మయ చరిత్ర. పుట 22. ఆంగ్లగ్రంథము)

చినతిరుమలయ్యకు సుమారు మూడువందల సంవత్సరములకుఁ బూర్వుఁడు రంగనాథరామాయణ కర్త యైన అచ్చవెల్లి రంగనాథుఁడు తన రంగనాథరామాయణమున :

రాముఁడు ముగ్ధుండు ; రాముఁడు నిసువు ;
రాముఁ డెఱుంగఁడు రణకౌశలంబు ;
పదియును నైదేండ్ల ప్రాయంబువాఁడు ;
కదలెడు చిప్పకూఁకటి గలవాఁడు ;

(రంగనాథరామాయణము ఆంధ్రవిశ్వవిద్యాలయప్రతి పుట. 23.)

అన్నమయ్య కూడ 'ప్రవిమల ద్విపదప్రబంధ రూపమున నవముగా రామాయణము' రచించెను. చినతిరుమలయ్యయు పదునైదు వత్సరములు గడచి పదునాఱవ సంవత్సరము వచ్చినపిదపనే కీర్తనలు రచించినాఁ డని మనము విశ్వసింప వచ్చును.

తలిదండ్రులను పేర్కొనక యితఁడు తాతగారినే భక్తి శ్రద్ధలతో కీర్తించినాఁడు. ఆయనను ఎంతో గొప్పగా పేర్కొన్నాఁడు. అన్నమయ్య అప్పఁడైన శ్రీవేంకటేశుని వరప్రసాది యనియు-ఆదినారాయణుని తన మనమున నిలిపినవాఁ డనియు - సనకసనందనాదులంతటివాఁ డనియు - హరిపై పెక్కుసంకీర్తనలు విన్నపించినవాఁ డనియు - వేదముల యర్థమెల్ల తెలిసికొని తెలిపినవాఁ డనియు - రామానుజాచార్య మతమున నిలిచినవాఁ డనియు - శ్రీవేంకటేశుని తమకు విందువలె దయచేసినవాఁ డనియు వర్ణించినాఁడు.

సాళంగనాఁట

అప్పని వరప్రసాది అన్నమయ్యా
అప్పసము మాకె కలఁ డన్నమయ్యా ॥ పల్లవి ॥

అంతటికి నేలి కైన ఆదినారాయణుఁ దన
యంతరంగాన నిలిపీ నన్నమయ్యా
సంతసానఁ జెలువొందె సనకసనందనాదు
లంతటివాఁడు తాళ్లపాకన్నమయ్యా ॥ అప్ప ॥

బిరుదు పెక్కెములుగాఁ బెక్కు సంకీర్తనములు
హరిమీఁద విన్నవించె నన్నమయ్యా
విరివి గలిగినట్టి వేదముల యర్థ మెల్లా
అరసి తెలిపినాఁడు అన్నమయ్యా ॥ అప్ప ॥

అంద మైనరామానుజాచార్యమతమున
అందుకొని నిలిచినాఁ డన్నమయ్యా
విందువలె మాకును శ్రీవెంకటనాథుని నిచ్చె
అందరిలోఁ దాళ్లపాక అన్నమయ్యా. ॥ అప్ప ॥

(చిన - తిరు - అధ్యా. సంఖ్య. 23.)

చినతిరుమలయ్యకు ముప్పదేండ్ల ప్రాయమున తల్లి చనిపోయిన ట్లున్నది. ఉపనయనము కూడ నతనికి అన్నమయ్యయే చేసె నట! తనకు తండ్రి, గురువు అన్నియు తాతగా రైన అన్నమాచార్యులే యని యితఁడు తెలిపినాఁడు. అల్లరి చిల్లరి చేష్టలకు లోను కాఁబోవుసమయమున అన్నమయ్య యతనికి మార్గదర్శి యైన ట్లున్నాఁడు. ఆవిషయముల నన్నిటిని కీర్తనగా రచించినాఁడు. చూడుఁడు :

లలిత

తాళపాకన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమె శ్రీహరిఁ గనే వెర వానతిచ్చితివి ॥ పల్లవి ॥

గురుఁడవు నీవె సుమ్మీ కుమతి నైననాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమబంధుఁడ వైనా పరికింప నీవె సుమ్మీ
వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ॥ తాళపాక ॥

తల్లి వైన నీవె సుమ్మీ తగినవిషయాలలో
పల్లదానఁ బడకుండా బ్రతికించితి
అల్లుకొని తోడునీడ వైనా నీవె సుమ్మీ
చిల్లరమాయలలోనఁ జెడకుండాఁ జేసితి ॥ తాళపాక ॥

దాతవు నీవె సుమ్మీ తగు శ్రీవెంకటనాథు
నాతలఁపులో నిలిపి నమ్మఁ జేసితి
యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవె
ఆతల నీతల నన్ను నాదుకొని కాచితి. ॥ తాళపాక ॥

(చినతిరుమలయ్య అధ్యాత్మ 39 సంఖ్య.)

'వెంకటేశుఁడే సర్వమును' అని అన్నమయ్య యితనికి ఉప దేశించె నట.

రామక్రియ

నీవు గలిగినఁ జాలు నిక్కము అన్నిఁ గలవు
ఆవల మాయాచార్యుఁ డానతిచ్చెనయ్యా ॥ పల్లవి ॥

యేలోకమున నున్న యెడయనిసొమ్ము నీవె
తాలిమి యెందుఁ బోనిధనము నీవె
కాలముకడా తరగని ధాన్యము నీ వని
ఆలించి మాగురుఁ డిట్టె ఆనతిచ్చెనయ్యా ॥ నీవు ॥

యెందెందుం దిరిగిన యేలికవు నీవె
నిందలేనియట్టి తోడునీడవు నీవె
ముందువెనకల నిల్లు ముంగిలియు నీవె యని
అందముగ దేశికుఁడె ఆనతిచ్చెనయ్యా ॥ నీవు ॥

యెన్నఁడుఁ గలఁగనట్టి హితుఁడవు నీవె
పన్నినట్టె వుండె నిచ్చపంటా నీవె
నన్నుఁ గాచే శ్రీవెంకటనాథుఁడ వని తాళ్లపా
కన్నమయ్యగారె నాకు నానతిచ్చిరయ్యా. ॥ నీవు ॥

(చినతిరుమలయ్య ఆధ్యా - సంకీర్తన సంఖ్య 46.)

అన్నమయ్యకు పూర్వులు నందవరీకులు. వీరు చౌడేశ్వరీ ఉపాసకులు. చౌడేశ్వరి తామసప్రధానదైవము. నాటి ఆచారము ననుసరించి దేవికి బలి వగైరాలు ఆనాడు సమర్పించెడివా రేమో ! ఈనాడు వారు తత్ప్రిత్యామ్నాయమార్గముల ననుసరించుచున్నా రట. మిగత వివరములకు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని డి. నెం. 539 మాచ పాపనమంత్రి విరచిత నందవరపు చరిత్ర చూచునది. పచ్చితామసు లయిన తమ్ము పరమసాత్వికులను జేసె ననియు, తమ కులమున మొదట శ్రీవైష్ణవమును స్వీకరించినవాఁ డనియు, సంకీర్తనపద్ధతి నుపదేశించినాఁ డనియు, శ్రీవెంకటేశునిఁ దమకు ప్రసాదించినాఁ డనియు, నితఁడు సెలవిచ్చినాఁడు. చూడుఁడు:

దేసాళం

ఎట్టిహితోపదేశకుఁ డెటువంటిదయాళువు
అట్టె తాళ్లపాకన్నమాచార్యులు ॥ పల్లవి ॥

పచ్చితామసుల మమ్ముఁ బరమసాత్వికులఁగా
యిచ్చటనె నేసినాఁడు యెంత చిత్రము
యిచ్చగించి మాకులాన నెన్నఁడు లేనివైష్ణవ
మచ్చముగాఁ గృప సేసె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥

ముదిరినపాపకర్మములు సేసినట్టి మమ్ము
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంత సోద్యము
కదిసి యేజన్మానఁ గాననిసంకీర్తన
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥

గడుసుఁదనపు మమ్ముఁ గడు వివేకులఁ జేసి
యిడుమ లెల్లాఁ బాపె నే మరుదు
నడుమనె యెన్నఁడుఁ గానని శ్రీవెంకటనాథు
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు. ॥ ఎట్టి ॥

(చినతిరుమలయ్య - అధ్యా - సంఖ్య 52.)

చినతిరుమలయ్యయు తాతగారివలె నద్వైతులను వాద, జల్ప, వితండ, ఛలవాదులను, గర్హించినాఁడు. చినతిరుమలయ్య కీర్తన యిది:

లలిత

సకలపురాణములు చాటి నినుఁ బొగడఁగా
తకమకలుగా నల్పార్థము చెప్పఁ దగునా ॥ పల్లవి ॥

నిను నిర్గుణుఁ డనేటి నీచజాతులయందె
యెనయు దుర్గుణము దా నెంతో
కనకంబు నిను మనుచు కారునాయంబులను
యెన లేనిదుర్వాదుల నే మనఁగఁ గలము ॥ సకల ॥

నీవె తా మనుకొనేటి నిందితాత్ములు దాము
కావించు ద్రోహంబు కదమా
దావతులఁ దనుఁ గన్నతల్లి గొడ్డని పల్కు
దేవతానిందలకుఁ దెలుపఁగ వశమా ॥ సకల ॥

అమరుసర్గము మిథ్య యను శూన్యభాషులకు
తమితోడ భ్రమ యేల తరగు
తమగురువు శాస్త్రంబు తామె కల్లనఁగాను
క్రమబుద్ధి శ్రీవెంకటనాథ యిత్తువా. ॥ సకల ॥

(చినతిరుమలయ్య - అధ్యా - సంఖ్య 58.)

తండ్రి తాతలవలె నీతఁడు కూడ సుప్రభాతమును కీర్తనల రూపమున సంకీర్తన చేసినాఁడు. ఈతని తండ్రి యగు పెదతిరుమలాచార్యులు ద్విపదరూపమున ప్రత్యేకముగా సుప్రభాతమును రచించినాఁడు. (ఇది ముద్రితము. చూ. శ్రీ వెంకటేశ్వర వచనములు, శ్రీవెంకటేశ్వర ప్రభాత స్తవము. పరిష్కర్త: శ్రీ. వే. ప్రభాకరశాస్త్రిగారు) అన్నమయ్య కీర్తనలు చెల్లాచెదరుగా నున్నవి. తాళ్లపాకవారి సుప్రభాతము క్రీ.శ. 1480? నుండి స్వామిసన్నిధిని గానము చేయబడుచున్నట్లుగాఁ దెలియుచున్నది.

భూపాళం

గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమా నీకు ॥ పల్లవి ॥

కమలజ చల్లనికౌఁగిటఁ దగిలి
సమరతిఁ బాయఁగఁ జాలవూ
కమలభవాదులు కడు నుతియింపఁగ
విమలపుశయనము విడువఁగ లేవు ॥ గోవిందా ॥

భూసతితోడుత పొందులు మరిగి
పేసర విడె నీవేడుకలా
వాసవముఖ్యులు వాకిట నుండఁగ
పాసి వుండ నని పవళించేవూ ॥ గోవిందా ॥

సీలామనసిజలీలలఁ దగిలి
నాలితోఁడ మానఁగ లేవూ
వేలాయను శ్రీవెంకటనాథుఁడ
పాలించి దాసుల బ్రదికించఁగమూ. ॥ గోవిందా ॥

(చినతిరుమలయ్య - అధ్యా - సంఖ్య 57.)

సతీ సుతులు, బంధువులు, ధనధాన్యములు, కామక్రోధములు, పంచేంద్రియములు, ఇల్లుముంగిళ్లు నివి యన్నియు మోహమును పెంచు ననియు వీని కన్నిటికిని నతీతుఁ డగునట్లు ఆచార్యులు తనకు శ్రీవెంకటేశు పాదము పట్టి యిచ్చి రనియు నందుచే తాను తరించితి ననియు నితఁడు సంకీర్తనము రచించినాఁడు.

గుజ్జరి

చలమె చెల్లించుకొన్న సతులాల
సులభమా మీతో పొందు సుతులాల ॥ పల్లవి ॥

వ్రతి నైన యతి నైన వలలమాటలఁ బెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల
హితపరుల వలెనె యింత నంత నెలయించి
తతి గొందురుగా ధనధాన్యములాల ॥ చలమె ॥

పెద్ద నైన పిన్న నైన పెలుచుఁదనమె రేఁచి
కొద్ది మీరించిన కామక్రోధములాల(?)
అద్దో యెంత విరక్తు నైనా విషయాలకె
దిద్దితిరిగా పంచేంద్రియములాల ॥ చలమె ॥

ముని నైన ఋషి నైన మోహమె పెంచి మరపి
మొనసితిరిగా యిల్లు ముంగిళ్లాల
ఘనుఁ డైన శ్రీవెంకటనాథుపాదములు
చనవునఁ జూపితి రాచార్యులాలా. ॥ చలమె ॥

(చినతిరు - అధ్యా - 28 సంకీర్తన.)
చూ. (అన్న - అధ్యా. 5 సం. 121 కీర్తన.)

గురుభక్తి గలిగి యుండవలయు ననియు, ఏకేశ్వరోపాసకులుగా నుండవలయు ననియు నితఁడు తండ్రితాతలవలె కీర్తనల రచించినాఁడు. వెంకటేశ్వరుఁడు కల్పవృక్షమువంటివాఁ డని 'చిత్తమా-జీవుఁడా' అను సంబోధనల మూలముగా తెలియఁ జేసినాడు.

ఏవో ఆపదలు రాఁగా జను లెల్లరు శాంతులు సేయ మొదలిడిన ట్లున్నారు. ఇందు జన్మశాంతి-గృహశాంతి - సర్వగ్రహశాంతి - నక్షత్ర శాంతి-కాలశాంతి వీనిని చేయుటకన్నను శ్రీహరికీర్తనలను సంకీర్తనము చేయుటయే శ్రేష్ఠ మని పేర్కొన్నాఁడు.

మలహరి

సంకె లేక తలచిన జాణలకు
  సంకీర్తనమె పో సర్వశాంతి   ॥ పల్లవి ॥
భవహర మగుశ్రీపతినామమె
  జవకట్టి తలంచితే జన్మశాంతి
  తవిలి హరిపూజ తాఁ జేయుటె
  కువలయమున నిదిగో గృహశాంతి   ॥ సంకె ॥
అంది ధ్రువవరదుఁడ యనినదె
  కందు వైన సర్వగ్రహశాంతి
  యిందురవినయనుని నెరుఁగుటె
  చంద మైన దిదివో నక్షత్రశాంతి   ॥ సంకె ॥
భావించి యనంతునిఁ బలుకుటె
  కావించిన దిదివో కాలశాంతి
  శ్రీ వెంకటనాథునిఁ జేరుటె
  దేవమానవులకును దేహశాంతి.   ॥ సంకె ॥

(చిన-అధ్యా-సంఖ్య 20.)

అన్నమాచార్యులు రచించిన అధ్యాత్మసంకీర్తనములలో తన వలననే శ్రీవెంకటేశుఁడు కీర్తిని పొందినాఁ డని రచించినాఁడు.

బౌళిరామక్రియ

నే నొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్ర మేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు ॥ పల్లవి ॥

అతిమూఢులలోన నగ్రేసరుఁడ నేను
ప్రతి లేనిఘనగర్వపర్వతమను
తతిఁ బంచేంద్రియముల ధనవంతుఁడను నేను
వెతకి నావంటివాని విడువఁగఁ జెల్లునా ॥ నేనొ ॥

మహిలో సంసారపు సామ్రాజ్య మేలేవాఁడ నేను
ఇహమునఁ గర్మవహి కెక్కితి నేను
బహుయోనికూపసంపదఁ దేలేవాఁడ నేను
వహింపక నావంటివానిఁ దే నోపేవా ॥ నేనొ ॥

భావించి నావంటినీచుఁ బట్టి కాచినప్పుడుగా
యేవంక నీకీర్తి గడు నెంతురు భువి
నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు
శ్రీవెంకటేశుఁడ యింత చేరెఁ జుమ్మీ మేలు. ॥ నేనొ ॥

(అన్న. అధ్యా 8 సంపు. 48 సంకీర్తన.)

తాతగారి కీర్తనలను పలువారములు చదివి చదివి జీర్ణించుకొన్న చినతిరుమలాచార్యులు కూడ అటువంటి కీర్తననే రచించినాఁడు.

దేసాళం

ఏలికె వై న న్నొకని నేలఁగాను నీ
లీలావిభూతి కొకలేశము దక్కవా ॥ పల్లవి ॥

పని పూని నాయొకనిపాపము మానుపఁగా నీ
ఘనసంకల్పమునకుఁ గడమా
చెనకి నేనె పూజ సేయఁగా మెచ్చే నంటె
కనుకొనే వం దేమి కండ గట్టుకొంటివో ॥ ఏలి ॥

దేవుఁడ వై నామనసు దెరిచి రక్షించఁగాను
గోవింద నీమాయ కేమి గొఱతా
వోవల నాలోని భక్తి చూచి కాచే నంటివా
కావలసి నీ వెంత గాదెఁ బోసుకొంటివో. ॥ ఏలి ॥

అలరి నాహృదయమునందుఁ గానుపించితేను
వెలయ నీమహిమకు వెలితా
కలిమితో నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యిలమీఁద నీకు నిప్పు డెంత కీర్తి గూడెనో. ॥ ఏలి ॥
(చిన-అధ్యా-34 సంకీర్తన.)

అన్నమయ్య 'నే నొక్కఁడ లేకుండితే నీకృపకుఁ బాత్ర మేది, పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు-నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు' నని యనుట గాని, చినతిరుమలయ్య "ఇలమీఁద నీకు నిప్పు డెంత కీర్తి గూడెనో" అనుట గాని అహంకారముతో ననుట కాదనియు, స్వామి యెడ గలచనవుతో మనవి చేసి రనియు భావింపవలసియున్నది. వీరిరువురు శ్రీ వెంకటేశుని లీలావిభూతులను కీర్తనలమూలమున ప్రచారము చేయుటచే శ్రీవెంకటేశుని కీర్తి నలుదిక్కుల వ్యాపించుచున్నందెనట :

నీ వింద్రుఁడ వనియు, చంద్రుఁడ వనియు రాజులను దీవించుచుండిన ఆనాఁటి కవులను, తమబంధువులను చినతిరుమలయ్య గర్హించినాఁడు. దీనిని జూడఁగా చినతిరుమలయ్యయు రాజులమూలమున నేవో కొన్ని బాధలను పొందిన ట్లున్నాఁడు. ఆరాజు, ఆబాధలు తెలియ రాలేదు.

రామక్రియ

మాయలో మునుఁగ నేల మమత లేల
చేయూరా దేవుఁ డీపాటి సేయ నోపఁడా ॥ పల్లవి ॥

అట్టె దేహసమ్మంధ మాసపడేజీవులాల
పట్టి హరిసమ్మంధాన బ్రదుక రాదా
నెట్టన సర్వాంతరాత్మై నిలుచున్న దేవుఁ డిట్టె
చుట్టాలపక్కాలపాటి శుభ మియ్య నోపఁడా ॥ మాయలో ॥

మోసపోక ధనధాన్యములు గూర్చే దేహులాల
 వేసరక విష్ణుభక్తి వెదక రాదా
 రాసి కెక్క యిందరిని రక్షించేదేవుఁడె
 కాసువీసములపాటి కావ నోపఁడా ॥ మాయలో ॥
వెలయ రాజులను దీవించేప్రాణులాల
 కల శ్రీవెంకటనాథుఁ గానఁగ రాదా
 వలె నని యిందరికి వరా లిచ్చేదేవుఁ డేమి
 కొలువు నిలువుపాటిగుణ మియ్య నోపఁడా. ॥ మాయలో ॥

(చిన-అధ్యా-42 సంకీర్తన.)

దేసాళం

ఎఱుక గలిగితేను యీతఁడె దిక్కు
 మఱి నిమిష మీతని మాని వుండఁ దగునా ॥ పల్లవి ॥
యెవ్వరిసొమ్ము గుడిచి యెవ్వరిగుత్తాలవెంట
 కొవ్వు దీరఁ బారాడి కొలిచేది
 యివ్వలఁ బుట్టించి పెంచి యేలినదేవుఁ డుండఁగా
 అవ్వలివ్వలివారిని ఆసపడఁ దగునా ॥ ఎఱుక ॥
తా నెవ్వరికిఁ బుట్టి తలఁకక వూరివారి
 నానందాన అయ్య లమ్మ లనుకొనేది
 పానిపట్టి సర్వవిధబంధుఁడు విష్ణుఁ డుండఁగా
 మానిసిచుట్టరికాలు మరుగఁగఁ జెల్లునా ॥ ఎఱుక ॥
యెందువంకనో యీదేహి యేమిటినో పొగడుచు
 విందువలె నెవ్వరిని వెత్తిఁ జేసేది
 కందు వైన శ్రీవెంకటనాథుఁడు గావఁగా
 సందుసుడి కోరికల సటఁబడఁ జెల్లునా. ॥ ఎఱుక ॥

(చినతిరు-అధ్యా-55 కీర్తన.)

కాలము కర్మము, పాపము పగ, కులము గుణము నివి యన్నియు భగవత్ప్రాప్తికి నడ్డు రా వని అన్నమయ్య యెన్నియో కీర్తనలు రచించినాఁడు. చినతిరుమలయ్యయు అట్టి కీర్తనమే రచించినాఁడు.

దేసాళం

వట్టి విచారము లేల వగపు లేల
నెట్టన శ్రీహరిఁ జేర నేరవలెఁ గాక ॥ పల్లవి ॥

కాల మేమి సేసీని కర్మ మేమి సేసీని
యేలిన శ్రీరమణుఁడె యెద నుండఁగా
ఆలించిన ధ్రువునిని అజామిళునిని
కాల మేమి సేసె నయ్యా కర్మ మేమి సేసెను. ॥ వట్టి ॥

పాప మేమి సేసీని పగ యేమి సేసీని
కాపాడె దేవుఁడె దగ్గర నుండఁగా
యేపున ఘంటాకర్ణుని యెలమిఁ బ్రహ్లాదుని
పాప మేమి సేసె నయ్యా పగ యేమి సేసెను ॥ వట్టి ॥

కుల మేమి సేసీని గుణ మేమి సేసీని
నలు వైన శ్రీవెంకటనాథుఁ డుండఁగా
అలరి వాల్మీకికి అలనాఁ డహల్యకు
కుల మేమి సేసెనయ్యా గుణ మేమి సేసెను. ॥ వట్టి ॥

(చిన-అధ్యా 43 సంకీర్తన.)

చేయెత్తి యెలుగెత్తి అన్నమయ్య శ్రీవెంకటేశ్వరుఁడు కలియుగ దైవ మని నిరూపించినాఁడు. అతఁడు రచించిన కీర్తన మిది.

రామక్రియ

చాటెద నిదియే సత్యము సుండో
చేటు లే దీతని సేవించినను ॥ పల్లవి ॥

హరి నొల్లనివా రసురలు సుండో
సుర లీతనిదాసులు సుండో
పరమాత్ముఁ డితఁడే ప్రాణము సుండో
మరుగక మఱచిన మఱి లే దిఁకను ॥ చాటెద ॥

వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో
సోదించె శుకుఁ డచ్చుగ సుండో
ఆదిబ్రహ్మ గన్నాఁతఁడు సుండో
యేదెస వెదకిన నితఁడే ఘనుఁడు ॥ చాలెద ॥

యిహపర మొసఁగను యీతఁడె సుండో
వహి నుతించెఁ బార్వతి సుండో
రహస్య మిదివో రహి శ్రీవెంకట
మహీధరంబున మనికై నిలిచె. ॥ చాలెద ॥

(అన్న-అధ్యా- 6 సంపు 164 సంకీర్తన.)
ఇంకను చూ. (అన్న-అధ్యా- 5 సంపు. 140 సంకీర్తన.)
ఇంకను చూ. (అన్న - అధ్యా - 5 సంపు 293 సంకీ.)

చినతిరుమలయ్య కీర్తన మిది చిత్తగింపుదు. తాతకంటెను నొక మెట్టు పైచేయిగనే రచించినాఁడు.

మాళవి

నూరవద్దు తాగవద్దు నోరు చేఁదు గావద్దు
చేరువ నొకచోట సంజీవి వున్న దిదివో ॥ పల్లవి ॥

పొల మెల్లాఁ దిరిగాడి పొడిఁబడనె వద్దు
తలఁకక గడ్డపారఁ దవ్వవద్దు
వలవని వాఁగుల వంకల వెదక వద్దు
చెలఁగి వొకచోట సంజీవి వున్న దిదివో ॥ నూర ॥

మొక్కలానఁ జెరువులో మునిఁగి చూడవద్దు
నిక్కిన పుట్టలమీఁద నెమక వద్దు
వెక్కసానఁ జేతిపైఁడి వెలవెట్టి కొనవద్దు
చిక్కె నెల్లాఁ బాపెటి సంజీవి వున్న దిదివో ॥ నూర ॥

దీవులను నోడ లెక్కి తిరుగాడనే వద్దు
సోవల బిలములోనఁ జొరవద్దు
కావించి గ్రహణాదికాలము వెదక వద్దు
శ్రీవెంకటనాథుఁ డై సంజీవి వున్న దిదివో ॥ నూర ॥

(చినతిరుమలయ్య - అధ్యా 54 సంకీర్తన.)

* (1) స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౬౨ అగునేటి శార్వరి చైత్రశుద్ధ (2)౧౩లు చిత్తా నక్షత్రమందు శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాచార్య శ్రీరామానుజ సి(ం)ద్ధాంత[స్థా]పనాచార్య (3) వేదాంతాచార్య కవితార్కికకేసరి శరణాగతవజ్రపంజరు లైన శ్రీతాళ్ల పాక పెదతిరుమలయ్యంగారి (4) కొమారుండు శ్రీచిన్నతిరుమలయ్యం గారు స్కాంధపురాణోక్త మైన శ్రీవెంకటేశమాహాత్మ్య[ము] (5)లో వికల్య నదీతీరమందు శ్రీరంగమాహాత్మ్యంలోను దశాధ్యాయంలోను దేవళతీర్థమందు (6) తమ [కైంకర్యంగాను] సర్వమాన్య అగ్రహార మైన అలమేలుమంగ పురమందు జీర్ణోద్ధారణంగాను (7) శ్రీవెంకటే శ్వరులాను నాచ్చియారును అనంతగరుడ విష్వక్సేనాదులాను......... .........పెరు - (8) మాళ్లను ఆళ్వారులాను పుదైయవరును పూర్వా చార్యులాను అన్నమాచార్యులైన తమ ఆచార్య(9)లాను తిరుప్రతిష్ఠ చేసి ఆయాళ్వారుల సన్నిధిని ప్రొద్దుగ్రుంకి అప్పుడు నిత్యానుసంధానాలు (10) మొదలైనది అనుసంధించి ఆచార్యపురుషులు జీయరు,............ శ్రీవైష్ణవుల........................ప్రొ - (11)ద్దు గ్రుంక్కిన అప్పుడు ఆరగింపు అప్పపడి........రెండు అప్పాలు పాతికె ఫలం చందనకాపు సమ(12)ర్పణ చేసి తమ పుత్రపౌత్ర పరంపర ఆచంద్రార్కంగాను శ్రీవైకుంఠయతి........శ్రీయతిరాజియ్యం (13)గారి చేతను వ్రాయించిన శిలాశాసనం.

పై శాసనాధారమును బట్టి చినతిరుమలాచార్యులు తాళ్లపాకవారి కగ్రహార మై చెల్లుచు వచ్చిన అలమేలుమంగాపురమందు శ్రీవెంకటే శ్వరస్వామివారి దేవాలయమును జీర్ణోద్ధారము చేసినట్లు తెలియుచున్నది.

---

* ఈ శాసనము మంగాపురములోని శ్రీకల్యాణవెంకటేశ్వరస్వామివారి దేవాలయ ద్వారపు కుడిబండపై కలదు. మంగాపురము చంద్రగిరి సమీపమున నున్న గ్రామము. పైశాసనము తిరుమల తిరుపతి దేవస్థానమువారి శాసన సంపుటము సంఖ్య 4 లో 144 శాసనముగా ప్రకటింపఁబడి యున్నది. ప్రకటింపఁబడిన శాసనములో కొన్ని యక్షర ములు లోపించియున్నవి. బండమీఁది శాసనమును నేరులో చదివి యిందు ప్రకటించు చుంటిని కనుక ముద్రితశాసనమునకును దీనికిని కొంత భేదము కనబడవచ్చును.

ఇంకను నేడున్న శ్రీ వెంకటేశ్వరుల విగ్రహమును, అలమేలు మంగమ్మను, అనంతగరుడ విష్వక్సేనాదులను, లక్ష్మీనారాయణస్వామిని, రంగనాథస్వామిని, పన్నిద్దరాళ్వార్లను, రామానుజులను, తమ ఆచార్యులైన అన్నమాచార్యులను తిరుప్రతిష్ఠ చేసినట్లు తెలియుచున్నది. ఈ శిలా శాసనము క్రీ॥ శ॥ 22–3–1540 వ సంవత్సరము నాఁటిది. ఆనాఁడు చినతిరుమలయ్య ప్రతిష్ఠించిన విగ్రహములలో నేఁడు శ్రీవెంకటేశ్వర, లక్ష్మీనారాయణ, రంగనాథ, రామానుజ, విష్వక్సేన, గరుడాదులవి మాత్రమే కలవు. మిగిలినవి కానరావు. మిగిలినవి శిథిలమైన ఆ దేవాలయ ప్రాంగణములయం దెందేని అణఁగి యుండు నేమో!

చినతిరుమలయ్యా జీర్ణోద్ధారణ చేసిన ఈ దేవాలయపు మొదటి గోపురమున కిరుప్రక్కల అన్నమాచార్య పెదతిరుమలాచార్యుల ప్రతిమలను చెక్కించినాఁడు. ఈ ప్రతిమలు నేఁడు తిరుమలలోని తాళ్లపాక వారి సంకీర్తన భండారమున కిరుప్రక్కల కల ప్రతిమలను పోలి యున్నవి. ఆ తర్వాత లోపలిభాగమున యెడమవైపున (లోనికి వెళ్లినప్పుడు కుడిభాగమున) తన ప్రతిమను చెక్కించుకొన్నాఁడు. తాను తిరుమలలోని శ్రీవెంకటేశ్వరుని కుడిచేతితో చూపుచున్నాఁడు. అతఁడే సర్వరక్షకుఁ డని కాబోలు! మఱి కొంచెము లోపలికి వెళ్లగనే మొదటి ద్వారము దాఁటినదే లోనికి వెళ్లినప్పుడు కుడిచేతివైపు మొదటి స్తంభమున అన్నమయ్య ప్రతిమను ఎడమచేతితో కొండపై వెలసియున్న శ్రీవెంకటేశ్వరుని చూపునట్లు చెక్కి యున్నాఁడు. ఆదేవరుసలో మూడవ స్తంభమునకు వెనుక ఎడమచేతితో లోని శ్రీవెంకటేశ్వరుని చూపునట్లు పెదతిరుమలయ్యను చెక్కి యున్నాడు. చినతిరుమలయ్యా కీర్తనల పరిష్కరణము పూర్తి యైన పిదప నుపోద్ఘాతము రచించుసందర్భమున చినతిరుమలయ్యా నిర్మించిన దేవాలయమున నాతని ప్రతిమయుండు నేమో యని 15–3–62 తేదీన పరిశీలింపగా నివి యన్నియు తెలియ వచ్చెను.

వికల్యానదీ తీరమున చినతిరుమలయ్యయే కాబోలు నిర్మించిన సంధ్యావందన మంటపము గలదు. సంధ్య వార్చినతర్వాత చినతిరుమలా

చార్యులు సంకీర్తనలు పాడగా నేటిగట్టున గలరాళ్లు సైతము దొరలెడి వట! నేటికివి నా యూరి ప్రజలు సగర్వముగా నీకథను తెలుపు చున్నారు. ఆచుట్టుపల్లి గల ప్రదేశమున కంతటికి "తిమ్మాపురము" అని పేరట. పెదతిరుమలయ్యకో చినతిరుమలయ్యకో దానము చేయగా నాపేరు కలిగి యుండు ననుకొందును. తిమ్మాపురమునందలి దేవాలయ గోపురమును శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయమువారు కొనితెచ్చి విశ్వ విద్యాలయావరణమున నుంచుచున్నారు.

చినతిరుమలయ్య కీర్తించిన వేల్పులు

కదిరి : అనంతపురం జిల్లా కదిరిలోని శ్రీనృసింహస్వామిని కీర్తించినాఁడు. చూ. చిన. అధ్యా 37 సంఖ్య. శృంగార సంకీర్తనసంఖ్య. 38; 58.

కడప : కడపజిల్లా కడపగ్రామములోని శ్రీవేంకటేశ్వరుని కీర్తించి నాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య. 7, 86.

ఓఁగునూతల : కడపజిల్లా కడపతాలూకాకు చేరిన చిన్నదాసరిపల్లె సమీప మందలి లోయలో వేయి నూతులు గలప్రదేశమునకు 'వోనూతలకోన' యనియు 'వోగునూతలకోన' యనియు పేర్లు కలవు. అచట నరసింహస్వామి దేవాలయము కలదు. ఆ నృసింహస్వామిని కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తనసంఖ్య 18.

కోన : కడపజిల్లా కడపతాలూకాకు చేరిన నందిమండలమునకు దక్షిణమున పాలకొండ పర్వతమందలి కోనలో చక్కని యూటలు గలప్రదేశ మున్నది. అచటి ప్రజ లీప్రదే శమును చాల పవిత్ర మైనదానినిగా భావించుచున్నారు. అచట గల చెన్నకేశవస్వామిని కీర్తించినాఁడు. కోనలో నుండుటచే 'కోనచెన్నరాయఁ' డని పేరట. చూ. శృంగార సంకీర్తనసంఖ్య 19; 62; 68.

నెలఁదలూరు : కడపజిల్లాలోని నందలూరే 'నెలఁదలూరు'. అచటి సౌమ్యనాథస్వామినే చినతిరుమలయ్య చొక్కనాథుఁగా కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 20.

నెల్లూరుజిల్లా వెంకటగిరితాలూకాకు చేరిన 'నాగపుదల్ లేక రాజమల్ల చతుర్వేదిమంగళము' అను గ్రామమున గల యాదవనారాయణస్వామినో లేక తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ముఖద్వారమున కెడమప్రైపున గల సుదర్శనస్వామి యాలయమందలి యాదవనారాయణునో చినతిరుమలయ్య కీర్తించినాఁడు. చూ. శృంగార సంకీర్తన సంఖ్య 22.

సంబటూరు : కర్నూలుజిల్లా శిరివెళ్లతాలూకాలో 'సంబవరము' కలదు. అది కాక యీసంబటూరువేరైనదో తెలియరాదు. ఆ సంబవరమున దేవాలయము కల దేమో! సంబటూరి చెన్నరాయని చినతిరుమలయ్య కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 23.

ఊటుకూరు : కడపజిల్లా రాజంపేటతాలూకాలో కలదు. ఇందు చెన్నరాయని దేవాలయముకలదు. ఈ స్వామినే కీర్తించినాఁడు చినతిరుమలయ్య. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 24.

కోవిలకుంట్ల : (1) నేడు కర్నూలుజిల్లా కోవిలకుంట్ల తాలూకాకు చేరిన కోవిలకుంట్లయే కాబోలు! అందలి పండరంగివిఠలుని చినతిరుమలయ్య కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 27. (2) ఆ గ్రామమందే గల గోపాలకృష్ణుని గూడ కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తనసంఖ్య 28.

? కడపజిల్లా కమలాపురం తాలూకాకు చేరిన 'పందిళ్లపల్లె' లోని ప్రసన్నవెంకటేశ్వరస్వామిని కాటోలు కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 29.

మండెము : కడపజిల్లాలోని చినమండెమునగల నరసింహస్వామిని కీర్తించినాఁడు చినతిరుమలయ్య (ఈ మండెమును గూర్చి చూ. అన్నమాచార్య చరిత్ర పుట. 43, పీఠిక పుట. 64) చూ. శృంగారసంకీర్తనసంఖ్య 34; 35; 66; 74; 88.

వావిలిపాడు : చిత్తూరుజిల్లా వాయిల్‌పాడులోఁగల రామచంద్రునికాటోలు చినతిరుమలయ్య కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 67; 70. ఇదిగాక గుంటూరుజిల్లాలో 'వావిలేటిపాడు' అను గ్రామము కలదు. అందు దేవాలయము కలదేమో! నెల్లూరుజిల్లా రాపూరుతాలూకాలో వావిలేరు అను గ్రామము కలదు. అందు దేవాలయము కలదేమో!

కోసువానిపల్లె : కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలో "కోసనేపల్లె" కలదు. ఆ గ్రామమున ఆంజనేయస్వామి దేవాలయము కలదు. ఆ గ్రామమునకు 'హరిహరపుర' మని కూడ పేరు కలదు. అదియే కోసువానిపల్లె యైన దేమో! కోసువానిపల్లెలోని దేవుని చినతిరుమలయ్య కీర్తించినాఁడు. చూ. శృంగారసంకీర్తనసంఖ్య 71; 75.

? కడపజిల్లా నందలూరులోని సౌమ్యనాథస్వామినే చెల్లపిళ్లరాయఁ డని చినతిరుమలయ్య కీర్తించిన ట్లున్నాఁడు. చూ. శృంగారసంకీర్తనసంఖ్య 80.

? ఏ యూరిస్వామియో తెలియ రాలేదు. బాలకృష్ణుఁ డని పేరుమాత్రముపేర్కొన్నాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 82.

ఏయూరిస్వామియో తెలియ రాలేదు. గోపాలకృష్ణుఁ డని పేరుమాత్రము పేర్కొన్నాఁడు. చూ. శృంగారసంకీర్తన సంఖ్య 84.

నెల్లూరు : ఇది నేటి నెల్లూరుజిల్లా నెల్లూరు కావచ్చు. అందలి దేవత పేరు పేర్కొన లేదు చినతిరుమలయ్య. ఒక కీర్తనమాత్రమే రచించినాఁడు. చూ. శృంగారసంకీర్తనసంఖ్య 89.

తిరుపతి : చిత్తూజిల్లా చంద్రగిరితాలూకాలోని తిరుపతి. ఇందులోని రఘురాముని చినతిరుమలయ్య కీర్తించెను. చూ. శృంగార సంకీర్తనసంఖ్య 107; 108.

చినతిరుమలయ్య నేటి చిత్తూరు, అనంతపురము, కడప, కర్నూలు, నెల్లూరుజిల్లాలు సంచారముచేసినట్లుగా నతని సంకీర్తనముల వలనఁ దెలియుచున్నది.

అన్నమయ్యనుగూర్చి వివరములు తెలియ రాలేదు.

తిరుమలాచార్యుల మూఁడవకుమారుఁడు తిరువెంగళాహ్వయుఁడు. ఈతఁడు క్రీ॥ శ॥ 1546 లో ముందుగా చనిపోయెను.

నాల్గవ కుమారుఁడు తిరువెంగళనాథుఁడు. ఇతఁడు ఉషా కళ్యాణము, పరమయోగివిలాసము, అష్టమహిషీకళ్యాణము, అన్నమాచార్య చరిత్రములను వరుసగా రచించెను.

పరమయోగివిలాసము(ద్విపద)లండనులోని "ఇండియా ఆఫీసు" లో కలదు. దానిని అనుసరించి శ్రీ సి. పి. బ్రౌను దొరవారు పరిష్కరించి ఒక ప్రతిని తయారు చేసినారు. దానితో నేఁడు ముద్రిత మైన ప్రతిని సరి చూచిన నేవేవి క్రొత్త పాఠములు లభించు నేమో! మన దేశముననే కాక యితర దేశములందును తాళ్లపాకవారి రచనలు వ్రాసిన వనుట కిది యొక గొప్ప నిదర్శనము.

కోనేటి (తిరు)వెంకటనాథుఁడు సదాశివరాయలచే సన్మానితుఁడై నట్లు తెలియుచున్నది. గాని ఆ సన్మానము ఈతని కవిత్వమునకు

మెచ్చియో, సంగీతమునకు మెచ్చియో తెలియ రాదు. 'లంబికాయోగ మార్గావలంబి' యని తెలియుచున్నది. నామలింగానుశాసనమున కితఁడు "సురబాలప్రబోధిక" యను తెనుఁగువ్యాఖ్య రచించినట్లు ముద్రితప్రతిని బట్టి తెలియుచున్నది.

చినతిరుమలయ్యకు పెద్దమంగమ్మ వలన జన్మించిన తిరువెంగళప్ప తన తాత ముత్తాతల సంకీర్తనల విషయమై చాల శ్రమపడి దానముల చేసినాఁడు. ఇతఁడు కావ్యప్రకాశమునకు "సుధానిధి" వ్యాఖ్యను దేవభాషలో రచించెను. ఈవిషయమును శ్రీ ఆఫ్రెహ్ట్ గారు కూడ తెలిపిరి.

వెంకటేశదీక్షితుని కుమారుఁడు తిరువెంగళప్ప (దీక్షితుఁడు) అమరుకమును తెనిఁగించెను. ఈతఁ డెవరి కుమారుఁడో సరిగా తెలియ రాదు.

తాళ్లపాకవారు, వారిసంతతి, వారికవిత్వము, వారి సంగీతమును గూర్చి వారే రచించిన గ్రంథములనుండి యుద్ధరించి తెలిపితిని. ఇఁక తాళ్లపాకవారి పాండిత్య మెంత? వారి సంగీతపరిచయ మెంత? వారు సంగీతసాహిత్యాదులలో జరపినపరిశ్రమ యెట్టిది? అని సందేహించువారును పెక్కుమంది కలరు. ఈ ప్రశ్నలను వేయుటకు ముందు మనకు సంగీతసాహిత్యములలోఁ గలపరిచయ మెంత? అని గమనించుకోవలెను.

17—5—1535 నాఁటికే తాళ్లపాక అన్నమాచార్య పెదతిరుమలాచార్యుల సంకీర్తనలు "చతుస్సాగర పరివేష్టిత భూమండల మంతయు వ్యాపించి, తేనెకన్న తీయనై, మనసునకు అహ్లాదమును కలిగించెడి"వని ప్రసిద్ధిని గన్నవి.

తాళ్లపాకవారు రామానుజమత ప్రచారము చేయుచు దేశమంతయు తిరిగి రామానుజమతప్రచారముతోపాటు తమ కీర్తనల ప్రచారమును గూడ జరుపుకొన్నారు. ఆ ప్రచారమునకు అనుకూలముగా నుండుటకే ఐదు రేకులు గుదిగ్రుచ్చి వాని కొక యుంగరమును తగి

లించి యున్నారు. అట్టివానిని కొన్నింటిని "తంతు" అని పిలువఁబడు లావుపాటి మట్టియూదకు తగిలించి, బోయీలచే తమ వెంట మోయింపించుకొని పోయెడివారు. అట్లు వెళ్లినవే నేను 1949 లో అహోబలమునుండి తెచ్చిన రేకులు. ఆ తరువాత శ్రీరంగమున పలుబడి రేకు లున్న వనికూడ తెలిసికొన్నాను. అవి కూడ దేవస్థానమువారు సేకరింప నున్నారు. అవి కూడ ఆ విధముగానే శ్రీరంగము చేరి యుండును. శ్రీరంగముననే నాలుగు తాళపత్రగ్రంథములు గలవు. అవి గూడ సేకరించుచున్నాను. ఈ మతప్రచారమును చేయుసందర్భముననే తాళ్లపాకవారికి "శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి, శరణాగత వజ్రపంజర" బిరుదములు కలిగిన ట్లున్నది.

అతని మనుమఁడే రచించినది యగుట, అతఁడు జీవించి యుండఁగనే జన్మించినవాఁడు రచించిన దగుట జరిగినది కాఁబట్టియే అన్నమాచార్య చరిత్ర చారిత్రకముగా మిక్కిలి విలువైనగ్రంథము. అందులో అన్నమాచార్యులు సంగీతసాహిత్యములలో నిష్ణాతుఁడని పేర్కొనఁబడి యున్నాఁడు. అదియుఁ గాక నేఁడు మనకు తామ్రఫలకములపై లభించు సంకీర్తనల పరిశీలించినను అతని సంగీతసాహిత్యముల జ్ఞాన మెంతటిదని తెలియ గలదు. అన్నమయ్యయే కాదు అన్నమయ్య కుమారులు నరసింగన్న పెదతిరుమలయ్యలు. అన్నమయ్య మనుమలు చినతిరుమలయ్య, తిరువెంగళాహ్వయుఁడు (చిన్నన్న కాదు), అన్నయ్య-వీరందరు సంగీతసాహిత్యములలో దిట్టలని, పేరు ప్రసిద్ధులను పొందినవారని పై చారిత్రక విషయముల వలన తెలియుచున్నది. వీరికి త్రిపురుష పర్యంతము శ్రీవేంకటేశ్వరస్వామి వారు సంగీత సాహిత్యములలో ప్రజ్ఞను అనుగ్రహించిరి. నాఁటినుండి నేఁటివరకు యావదాంధ్రదేశమున-ఆంధ్రదేశముననే కాదు--దక్షిణభారతదేశమున వీరి కీర్తనలు ప్రజల నాలుకలపై తాండవించుచున్నవి. అందులకు ప్రమాణము నేఁటికిని దక్షిణ

దేశమున భజనపద్ధతిలో నీ కీర్తనలు గానము చేయుచుండుటయే. ఈఅన్నమయ్య కీర్తనలు తిరుమలలో స్వామిసన్నిధిని ద్రావిడవేదమున కన్న పూర్వమునుండియే గానము చేయబడుచుండెడివి. ఆతర్వాతనే ద్రావిడాగమమునకు ప్రవేశము లోన లభించినట్లున్నది. అన్నమయ్య తర్వాత ఆయన కుమారుఁడు, మనుమఁడు, మునిమనుమఁడు ఆయన సంకీర్తనలను గానము చేయువారికి భృతుల నేర్పాటు చేసిరి. సంకీర్తనభండారమునకు ముందు నిత్యధూపదీపనైవేద్యములను గూడ నేర్పాటు కావించిరి. సంకీర్తనములను రాగిరేకులలోఁ జెక్కి భద్రపఱచుటయే కాక నేఁడు మనబోటి వారికి ఆనాడు పాడెడివారా? ఎట్లు పాడెడివారు? అని కలుగఁదగు సందేహములను ముందుగా ఊహించియే కాఁబోలు చినతిరుమలయ్యా (క్రీ॥ శ॥ 7–11–1537?) కు పూర్వమే ప్రయోగపూర్వకముగ తన సంకీర్తనలక్షణమును సుమారు 4 అడుగుల వెడల్పు 7 అడుగుల పొడవు గలబండల పైఁ జెక్కించినాడు. కడచిన శతాబ్దమునకుఁ బూర్వము సరిగమాది స్వరవిన్యాసముతోను, సాహిత్యముతోను, కీర్తనలు లేవని శ్రీమాఁ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారును, ప్రొఫసరు పి. సాంబమూర్తి గారును తెలిపియున్నారు.

"డిక్షనరి ఆఫ్ సౌత్ ఇండియఁ మ్యూజిక్ అండ్ మ్యూజీషియన్సు" మొదటి వాల్యూంలో ప్రొఫెసరు పి. సాంబమూర్తిగారు ఎన్నో అపూర్వ విషయములను చిత్రములతో తెలిపి యున్నారు. 1952 లోఁ బ్రకటింపఁబడిన ఆగ్రంథమున 88 పుటలో తాళ్లపాక చిన్నయ్యను గూర్చియే వ్రాసియున్నారు. 1949 లో సేకరించిన బండలనుగూర్చి, తాళ్లపాకవారి ప్రతిమలను గూర్చి వారు వ్రాయక పోయిరి. 1949 నుండి అన్నమాచార్యోత్సవము మహావైభవముతో జరుగుచున్నను, తెలుగువారైన తాళ్లపాక వారు సంగీతశాస్త్రనిష్ణాతులు, సుప్రసిద్ధులు నైన ప్రొఫెసరు పి. సాంబమూర్తిగారి దృష్టి నిపడక పోవుటకు వారి దురదృష్టమే కారణము కావచ్చును.

చిన్నన్న కీర్తన లేవో రచించినాఁ డనియు, అవి లభ్యములు కాలేదనియు శ్రీ శర్మగారు రచించినారు. వీ రిట్లు వ్రాయుటకు కారణము అర్వాచీనులు కొందఱు "అల తాళ్లపాక చిన్నన్నరోమము లైన - తంబురా దండెకుఁ దంత్రు లౌనె" అన్నదియు, తాళ్లపాక చినన్న దండె మీటులు గావు - గోమాంసభుగ్దుర్గుణరవములు" అన్న శత్రుసంహార శతకపు పద్యములు కాఁబోలు! పైవారిని పెదదారిని పెట్టినవాఁడు తిరుమల కొండయార్యుని పుత్రుఁడైన వెంకటార్యుఁడు. "శ్రీ లలరంగ మంగమను శ్రీహరికి న్నటు ధారవోయుచో - తాళులపాక యన్నమయ తాఁ గడిగెన్‌బదముల్ ధరిత్రి, మా - తాళులపాక చిన్నన పదంబులు పాడిన నాడె సర్వరా ట్పైలవిభుండు" అనియు, "వేకువఁ దాళ్లపాక తిరువెంగళనాథుఁడు బాడ నాడు" అనియు శ్రీపాదరేణుప్రభావమున పేర్కొనుట అతఁడే శకుంతలాపరిణయమున పెదతిరుమలయ్య పుత్రులను తార్మారుగా పేర్కొనుట, అందులోను "తిరువెంగళనాథుండు* సంకీర్తనంబుఁ బాడిన నాదం దొడంగె" అనుటయు కారణములు కావచ్చును. *

అష్టమహిషీకళ్యాణరీతిని పెదతిరుమలయ్య పుత్రులు-చిన తిమ్మయ్య, అన్నయాచార్యుఁడు, తిరువెంగళప్ప, తిరువెంగళనాథుఁడు, కోనేటి వెంకటనాథుఁడు. శకుంతలాపరిణయము రీతిని పెదతిరుమలయ్య పుత్రులు-చినతిరుమలయ్యదీక్షితుఁడు, అన్నయాచార్యుఁడు, తిరువెంగళనాథుఁడు, కోనేటి తిరువెంగళనాథుఁడు, తిరువెంగళప్ప.

చినతిరుమలయ్య కుమారుఁడు తిరువెంగళప్ప గలఁడు. ఈతఁడు పాడెడివాఁ డేమో! ఇతఁడు సంకీర్తనలు పాడువారికి భృతి యేర్పాటు చేయుట నాయూహకు కారణము.

---

* తాళ్లపాకవారి సంకీర్తనముల పరిష్కరణ కార్యమున సుమారు ఆఱు సంవత్సరముల కాలము గణనీయముగాఁ బరిశ్రమించిన శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు చిన్నన్న కీర్తన లేవో రచించినాఁడనియు, నవి లభ్యములగుట లేదనియు వ్రాయుట చేతను, వారివ్రాఁత యాధారముగా ఇతరులు కూడ నట్లే దురభిప్రాయ పడుటచేతను నాదురభిప్రాయమును తొలఁగించు నుద్దేశముతో నింతదూరము వ్రాసితిని.

ఈతఁడు కాక చిన్నన్నను సంగీతపాఠకునిగా పేర్కొన్నవారు కాన రారు. ఇతనీ సమకాలికుఁడైన తెనాలి రామలింగకవి —

క. చిన్నన్న ద్విపద కెఱుగును
బన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెఱుగున్
మిన్నంది మెఱసె నరసిం
గన్నకవిత్వంబు పద్య గద్యశ్రేణిన్ ॥ (అప్ప. 3-225)

అని పేర్కొన్నాఁడు. కాన అకాలమునకే యీతఁడు పాడెడువాఁడు కాఁడని తెలియుచున్నది. ఇంకను రాజలింగకవి 'కూర్మపురాణము'న, కాణాద పెద్దన 'ముకుందవిలాసము'న చిన్నన్నను కవులవరుసలోనే పేర్కొనిరి. పై విషయములు పరిశీలింపఁగా చిన్నన్న కేవలము కవిత్వము చెప్పినవాఁడే యనియు, పదములు రచించి పాడినవాఁడు కాఁడనియు, చినతిరుమలయ్యయో, తిరువెంగళయ్యయో సంకీర్తనములు పాడెడివాఁ డనియు తెలియుచున్నది. దీనికి ప్రోద్బలముగా తిరువెంగళ నాథుఁడురచించిన అష్టమహిషీకళ్యాణమున తిరువెంగళయ్య 'సంగీత సత్కవిత్వాధికుఁ'డని యున్నది. చినతిరుమలయ్య రచనలు అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు తామ్రఫలకములపైఁ గలవు. తాళ్ల పాకవారు నాఁటి నుండి పాడెడివా రని, వారి సంప్రదాయమును తెలుపుటకే శిలాఫలకములపై చెక్కినా రని మనవి చేయుచున్నాను.

శిలాఫలకమున — ఉగము, ఉద్గ్రాహము, మేళాపము, ధృవము, అంతరము, అభోగము, అవృతనియమము, ఝంప, ధ్రువ, అట, రూపక, తివడ, ఆది, ఏక, జ్యావళ, ఆదిజ్యావళ అని కలదు. పల్లవం, పదం అని కలదు. శ్రీవెంకటేశ్వర ముద్రతో సంస్కృతభాషలో కీర్తన గలదు. లిపితీరు వగైరా లన్నియు తాళ్లపాకవారి నాటివే.

చినతిరుమలయ్య అధ్యాత్మ, శృంగార సంకీర్తనముల సంపుటము యొక్క ముద్రణము వడివడిగా ఈ సంవత్సరము ఏప్రిల్ 2, 3, 4, తేదులలో జరుగు పదునాల్గవ అన్నమాచార్యోత్సవము నాఁటికి ముగియ

వలసియుండుటచే నీ సంగీతశిలాఫలకములను జదివి యిందే ప్రకటించు టకు వీలులేక పోయినది. తరువాతి సంపుటమున నీ శిలాఫలకముల పాఠము వివరణములతో పాటు ప్రకటించుటకు యత్నింతును

శ్రీతాళ్లపాక సంకీర్తనల ముద్రణ విషయమున శ్రద్ధాభక్తులు చూపుచున్న శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల సంఘము వారికి, ముఖ్యముగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వారైన శ్రీ చెలికాని అన్నారావు గారికిని ధన్యవాదము లర్పించుచున్నాను.

శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామివారి దేవాలయమునందలి అన్న మాచార్య, పెదతిరుమలాచార్య, చినతిరుమలాచార్యాదుల ప్రతిమల ప్రతిబింబములను తయారుచేయుటలో మిక్కిలి శ్రద్ధ వహించిన పబ్లిసిటీ సూపరండెంటు వారైన శ్రీ టి. ఆర్. నరసింహం గారికి, శ్రీ పవని బాలసుబ్రహ్మణ్యం గారికి, ప్రతిబింబములు తీయుట కనుమతిచ్చిన శ్రీసుందరరాజారాయస్వామి గారికి ధన్యవాదము లర్పించుచున్నాను.

ఈ సంకీర్తనముల పరిష్కరణ కార్యమునఁ బనికొనుటకు నా కనుమతి యిచ్చిన శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ అధికారులకు, అందు లోను వైస్ ఛాన్సలర్ శ్రీ శీరం గోవిందరాజులునాయుడు గారికి ధన్యవాదము లర్పించుచున్నాను.

శ్రద్ధాభక్తులతో సంకీర్తనల ముద్రణమును చేయుచున్న తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము వారికి శ్రీవెంకటేశ్వరస్వామి ఆయురారోగ్యముల నొసఁగవలయునని ప్రార్థించుచున్నాను.

సంకీర్తనల పరిష్కరణమునను ముద్రణమునను నేవేని దోషము లున్న సహృదయులు మన్నింతురు గాక.

తిరుపతి
15-3-62

ఇట్లు,
అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు.

## తాళ్లపాకవారి వంశవృక్షము

నారాయణుఁడు

విట్టలుఁడు

నారాయణుఁడు

విట్టలుఁడు

నారాయణుఁడు

నారాయణసూరి
లక్కమాంబ (భార్య)

అన్నమయ్య (1)
తిరుమలమ్మ (పెద్దభార్య) అక్కలమ్మ (చిన్నభార్య)

నరసింహుఁడు (2)
వాంచారమ్మ (పెద్దభార్య) అనంతమ్మ (చిన్నభార్య)

నారాయణుఁడు

అప్పలార్యుఁడు అన్నమార్యుఁడు

తిరుమలాచార్యులు (3)
(భార్య) తిరుమలాంబ

చినతిరుమలయ్య (4)
పెద్ద మంగమ్మ (భార్య)

అన్నయాచార్యుఁడు

(7) తిరువెంగళప్ప

| | | | | |
|---|---|---|---|---|
| (1) | చూ. | అన్నమయ్య | పుట | 1 |
| (2) | ,, | నరసింహకవి | ,, | 9 |
| (3) | ,, | పెదతిరుమలాచార్యులు | ,, | 10 |
| (4) | ,, | చినతిరుమలయ్య | ,, | 10 |
| (5) | ,, | తిరువెంగళనాథుడు లేక చిన్నన్న | ,, | 10, 30 |
| (6) | ,, | కోనేటి వెంకటనాథుడు | ,, | 10, 30 |
| (7) | ,, | తిరువెంగళప్ప | ,, | 31 |
| (8)[2] | ,, | తిరువెంగళప్ప | ,, | 31 |


1. (ముద్రిత ప్రతిని బట్టి కోనేటి వెంకటనాథుడే గురుబాలప్రబోధికను రచించినట్లు తెలియుచున్నది.)

2. (శృంగారామరుకమునందు తిరువెంగళప్ప వెంకటేశదీక్షితుని కుమారుడయినట్లున్నది. కోనేటి వెంకటనాథుడే తిరువెంగళప్ప తండ్రి యగు వెంకటేశదీక్షితుడగునా? వెంకటనాథుడనుపదమునే తిరువెంగళప్ప తన పద్యమున వెంకటేశుడని యనువదించి పేర్కొనెనా?)

నరసమ్మ

తిరుమలాంబ
తిరుమలకొండయార్యుని
వివాహమాడెను.

తిరువెంగళప్ప

తిరువెంగళ
నాథుడు (5)
(చిన్నన్న)

కోనేటి వెంకట (6)
నాథుడు
(8) తిరువెంగళప్ప

రేపటూరి
వెంకటాచార్యులు

శ్రీ

శుభమస్తు

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ తిరువేంగళనాథదేవునికి తాళ్లపాక అన్నమాచార్యుల కొమారుఁడు

పెదతిరుమలాచార్యులు, పెదతిరుమలాచార్యుల కొమారుఁడు

చినతిరుమలాచార్యులు విన్నపం సేసిన

# అధ్యాత్మ సంకీర్తనలు.

౧౬-వ సంపుటము

చి. అ. 1 రే. 1 పా. వరాళి.

రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరతశత్రుఘ్నులతోడ జయమందు దశరథరాఘవా ॥పల్లవి॥

శిరసు కూఁకటుల రాఘవా చిన్నారిపొన్నారి రాఘవా
గరిమ నావయసున తాటకిఁ జంపిన కౌసల్యానందన రాఘవా
అరిది యజ్ఞముగాచి రాఘవా యట్టె హరునివిల్లు విరిచినరాఘవా
సిరులతో జనకునియింట జానకిఁ జెలఁగి పెండ్లాడినరాఘవా ॥రామ॥

మలయు నయోధ్యారాఘవా మాయామృగాంతక రాఘవా
చెలఁగి చుప్పనాతిగర్వ మడఁచి దైత్యసేనలఁ జంపిన రాఘవా
పొలసి వాలిఁజంపి రాఘవా దండి సుగ్రీవునేలిన రాఘవా
జలధిబంధించినరాఘవా లంకసంహరించిన రాఘవా ॥రామ॥

దేవతలుచూడ రాఘవా దేవేంద్రురథమెక్కి రాఘవా
రావణాదులనుఁజంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయపట్టమేలి రాఘవా
శ్రీవెంకటగిరిమీఁద నభయములు చెలఁగి మాకిచ్చిన రాఘవా॥రామ॥

చి. అ. 1 రే. 2 పా.         బౌళి

గోవింద గోవింద యని కొలువరె
    గోవిందా యని కొలువరె         ॥ పల్లవి ॥

హరి యచ్యుతా యని యాడరె
    పురుషోత్తమా యని పొగడరె
    పరమపురుషా యని పలుకరె
    సిరివర యనుచునుఁ జెలఁగరె జనులు         ॥ గోవింద ॥

పాండవవరద యని పాడరె
    అండజవాహనుఁ గొనియాడరె
    కొండలరాయనినె కోరరె
    దండితో మాధవునినె తలఁచరె జనులు         ॥ గోవింద ॥

దేవుఁడు శ్రీవిభుఁడని తెలియరె
    సేవల ననంతునిఁ జూడరె
    శ్రీవెంకటనాథునిఁ జేరరె
    పావనమై యెప్పుడును బ్రదుకరె జనులు.     ॥ గోవింద ॥ 2

చి. అ. 1 రే. 3. పా.         దేసాక్షి

ఎన్నటికి నీకు జీవుఁడా యిదియె బుద్ధి వో జీవుఁడా
    మన్నించిన నీగురువులపాదము మఱవకువో వోయిజీవుఁడా ॥ప॥

మాఁటచెప్పెద జీవుఁడా మారు మాఁటలేఁటికి జీవుఁడా
    నాఁటకంబుల పంచేంద్రియముల నమ్మకు వో వో జీవుఁడా
    చాటితిఁజుమ్మీ జీవుఁడా నీకుఁజాటువో హరిభక్తి జీవుఁడా
    కూటువగూడిన కామక్రోధాదులఁ గూడకువో వోయిజీవుఁడా ॥

ఎప్పుడు మనసులో జీవుఁడా హరిఁ దప్పక తలఁచవో జీవుఁడా
    తప్పుఁదెరువుల దేవతాంతరాలు (లఁ?) దడవకువో వోయిజీవుఁడా
    చప్పఁబడనేల జీవుఁడా నీవు ధన్యుఁడ వవుదు వోజీవుఁడా
    చిప్పిలువేడుక శ్రీవెంకటనాథు సేవించవో వోయిజీవుఁడా ॥ఎన్న॥

చి. అ. 1 రే. 1 పా. గుజ్జరి

మచ్చరముఁ గపటంబులు మానినంత మరికదా
ఇచ్చలవిడి నాయాసల వీఁగఁదోల నోపుటా ॥ పల్లవి ॥
చంచలమగు నామనసిది మంచిదైన మరికదా
పంచేంద్రియములపోరునఁ బడకమానుటా
కొంచెపరచు నాకోపముఁ గోసివేసి మరికదా
కంచపుఁ బాపంబులలోఁ గడతేరుటా ॥ మచ్చ ॥
వుడివోని దీపనమున కోరిచి(న)నె మరికదా
జడివట్టిన నాజిహ్వాచాపల్యము మానుటా
చిడుముడి నాభోగంబులఁ జిక్కువడక మరికదా
విడువని సంసార మనేటివెల్లి దాఁటనోపుటా ॥ మచ్చ ॥
తరితీపులమోహంబునఁ మరికదా
కెరలిన యీలోభంబున(ను?)గెలువనోపుటా
నెరవుగ శ్రీవిష్ణుభక్తి నిలుకడైన మరికదా
గరగరికలనె శ్రీవెంకటనాథునిఁ జేరుటా. ॥ మచ్చ ॥ 4

చి. అ. 1 రే. 5 పా. దేవగాంధారి

ఏమొకో నేమేమొకో
యీమోహము మానమేమొకో ॥ పల్లవి ॥
కావరించినట్టి కాఁపురములలో
నేవలాపలయ్యే మేమొకో
దావతిసుఖముల దారి దెలిసియు
నేవగించలే మేమొకో ॥ ఏమొ ॥
గాలపుఁజిక్కుల కర్మపుతొడసుల
యీలకరచే మేమొకో
తాలిమిచెరిచెటి ధనముమీఁదివాంఛ
యేలొ యింకా మాన మేమొకో ॥ ఏమొ ॥

వోడుపోయినట్టి వుంగిటిబతుకుల
యీడగిలఁబడే మేమెుకో
వేడుకతో శ్రీవెంకటనాథుఁడు
యీడనె మముఁ గాచె నేమెుకో ॥ ఏమెు ॥ 5

చి. అ. 2 రే. 1 పా. మలహరి

హరికి మెురవెట్టితె అన్నిపనులు లెస్సవును
సరవి నెన్నాళ్లని జాలిఁ బడవచ్చును ॥ పల్లవి ॥

యేమిసేయునీజీవుఁ డీయరివర్గాలతోడ
బూమెల నెన్నాళ్లని పోరాడీని
చూమరలఁ జూడఁ జూడఁ జుట్టాలవలనె వుండి
దోమటిపంచేంద్రియాలు దోడుగాకపోయను ॥ హరి ॥

యెక్కడచొచ్చీజీవుఁ డీకర్మపురుణములు
పెక్కువిధములఁ బిరువీకుసేయఁగా
వాక్కొక్కనాఁటివద్దె వొదిగేఁగాని తల
తిక్కగొన్నపాపములు దీరకెపోయను ॥ హరి ॥

యెవ్వరుదిక్కీజీవుని కెంతని యీఁదఁగలఁడు
యివ్వల సంసార మనె యీవారిధి
నవ్వుతా శ్రీవెంకటనాథుని మఱఁగుచొచ్చి
యివ్వగఁ దా దరిచేరి యిన్నియు గెలిచెను. ॥ హరి ॥ 6

చి. అ. 2 రే. 2 పా. సామంతం

మాజహిహి దుష్టమనాయితి
యోజయ తవపదయుగామృతేన ॥ పల్లవి ॥

పరమాత్మన్ మమపామరచిత్తం
చిరం పాపం చికీర్షతి
కరుణానిధే ర్యకారణబంధో
గురుతరాం కృపాం కురు మయి దేవ ॥ మాజ ॥

అంతర్యామిన్ హరే మదాశా
సంతాపఏవ సమేధతే
దాంతికరానంతగుణానిధే
భ్రాంతిం వారయ పావనచరిత ॥ మాజ ॥

నలినోదర మాం నానామోహే
విలసత్కృతీవ విమోహయ
కలిత శ్రీవెంకటనాథ త్వం
సలలితం ప్రసాదయ స్వామిన్. ॥ మాజ ॥ 7

చి. అ. 2 రే. 3 పా. దేవగాంధారి

ఎవ్వరుచెప్పినా మనసేల మానును
యిష్వలవ్వలౌఁగాక యేలమానును ॥ పల్లవి ॥

కమ్ముకొన్న యింద్రియాలు గారడించఁగా జీవుఁ
డెమ్మెలఁ జొరలక మరేల మానును
యిమ్ములేనికోరికలు యెక్కుక్కు లాడఁగాను
వుమ్మడికర్మాలుసేయ కూర కేల మానును ॥ ఎవ్వరు ॥

పేరడిమదములెల్లా పెనగొనఁగా నొరుల
సీరసించ కీ దేహి యేలమానును
తీరనిచలము లివి తెలివి చెరుచఁగాను
యేరవెట్టుకొనియుండ కేలమానును ॥ ఎవ్వరు ॥

వుడివోనియాసలు వొత్తుకోలుసేయఁగాను
యిడియక యీప్రాణుఁ డేలమానును
కడువేగ శ్రీవెంకటనాథుఁడు గావఁగా
నెడయక కని మన కేలమానును. ॥ ఎవ్వరు ॥ 8

చి. అ. 2రే. 4 పా మలహరి

హిత విదె తెలుసుకొమ్మీ
సతతముఁ జాటితిని ॥ పల్లవి ॥

నేయవోయిజిహ్వ యీశ్రీహరి నుతియెపుడూ
రోయవోయి నీవు యీరుచులయందలివేడుకా ॥ హిత ॥

కోరవోయి మనసా యిఁక గోవిందునిచింతా
చేరకువోయి నీవు యీ చెడుగుఁ గామాదులను ॥ హిత ॥

విడువకువోయి దేహి శ్రీవెంకటగిరినాథుని
వుడుగవోయి నీవు యీవులుకుఁ దొల్లిటిచేఁతలు. ॥ హిత ॥ 9

చి. అ. 2రే. 5 పా. గుజ్జరి

ఎంతలే దిది యెంచిన
సంతోషించని సంసారంబు ॥ పల్లవి ॥

యేలకొ నేఁ డీదేహి
ఆలరి భోగము లడిగీఁగాక
చాలించఁగఁ జాలఁడు
కోయముందు హరిఁ గొలువఁగరాదా ॥ ఎంత ॥

యెంతైనను యీమనసు
పంచవనంబునఁ బారీఁగాక
మించిరికోరిక ముణుఁగదు
కంమప శ్రీవిభుఁ గానఁగరాదా. ॥ ఎంత ॥

విడువనితగు లీవేడుక
తొడిఁబడ నెంతైన దొరసీఁగాక
కడగని శ్రీవెంకటనాథు
బడిబడిఁ దిరుగుచు బ్రదుకఁగరాదా. ॥ ఎంత ॥ 10

చి. అ. 2రే. 6 పా. బౌళి

బ్రహ్మఁగన్నవాఁడు పసిబిడ్డ
బ్రహ్మమైనవాఁడు పసిబిడ్డ ॥ పల్లవి ॥

వగపులేక చంపవచ్చిన బూతకి
పగసాధించినవాఁడు పసిబిడ్డ
పగటునఁ దనమీఁదఁ బారవచ్చినబండి
పగులఁ దన్నినవాఁడు పసిబిడ్డా ॥ బ్రహ్మ ॥

గుట్టున నావులకొరకు వేలనె కొండ
పట్టి యెత్తినవాఁడు పసిబిడ్డా
జెట్టిపోరునఁ దన్నుఁ జెనకవచ్చినవానిఁ
బట్టి చంపినవాఁడు పసిబిడ్డా ॥ బ్రహ్మ ॥

మిడికెటికోపపు మేనమామఁ బట్టి
పడనడిచినవాఁడు పసిబిడ్డా
కడువేగ శ్రీవెంకటనాథుఁడై గొల్ల
పడఁతులఁ గూడినాఁడు పసిబిడ్డా. ॥ బ్రహ్మ ॥ 11

చి. అ. 2 రే. 7 పా. లలిత

చెప్పే నామాట విను చిత్తమా
చిప్పలు నెండమావుల చెరువులు నున్నవా ॥ పల్లవి ॥

వెగ్గలైనవిషయాల వేడుకపడకు మవి
జిగురుఁగండెలు సుమ్మీ చిత్తమా
పొగరుమూఁపుఁదనాలఁ బొరలకు మవియెల్ల
తగులు విరిపందెల దారివంటివి ॥ చెప్పే ॥

బలిమినె యాసలబారిఁ బడకు మవి
చిలుకల వోఁదా లోచిత్తమా
తలఁచిచూచితేనె తప్పులుఁ దారులె
కలలోని రతులయాఁకట వంటివి ॥ చెప్పే ॥

మేరమీరెకోరికల మిసిమి చూడకు మవి
జీరుకుబండ లోయిచిత్తమా
చేరువనె కాచెటి శ్రీవెంకటనాథుఁ గని
గారవాన బ్రదుకుమీ కల్పవృక్ష మతఁడు. ॥ చెప్పే ॥ 12

చి. అ. 3 రే. 1 పా. లలిత

పచ్చిగాఁ దెలియకుంటె బహుముఖమై తోఁచు
అచ్చమై యిన్నియును శ్రీహరి కల్పితములే ॥ పల్లవి ॥

కొందరు దిట్టుదురూ కొందరు దీవింతురు
చందపుసంసారము జాడలివి
కందువ రేయీఁ బగలుఁ గాలము నడచినట్టె
అందరిలోఁ గలుగు శ్రీహరికల్పితములే ॥ పచ్చి ॥

కొన్నిటిపై కోపము కొన్నిటిపై వేడుక
వున్నతి దేహధారుల వోజ లివి
పన్ని కాయ పండు దొండపంటియందె తోఁచినట్టు
అన్నియుఁ బుట్టించిన శ్రీహరికల్పితములే ॥ పచ్చి ॥

కొంతచోట మనుజులు కొంతచోట దేవతలు
అంతా శ్రీవెంకటనాథు నాజ్ఞ యిది
చెంత చప్పనయుఁ దీపు చెఱకందె వుండినట్టు
కాంతుఁడైన శ్రీహరికల్పితములే. ॥ పచ్చి ॥ 13

చి. అ. 3 రే. 2 పా. వరాళి

మాఁటిమాఁటికిఁ జూచి మరపులేలె[1]
సీటునఁ బాటిగంప నీళ్ల మోచేవా ॥ పల్లవి ॥

తెలిపేగురుఁ డుండఁగ తెలియఁగ నేరవు
చిలుకచదువులే[2]లో జీవుఁడా
అలవోక నెందైన ఆస మానలేవు
కల గన్నచోటి కెల్ల గంపయెత్తేవా ॥ మాఁటి ॥

వొబ్బిడైనవేదమార్గ మొల్లనిపుణ్య మంచేవు
జిబ్బిటాయతప మేలె జీవుఁడ
అబ్బురపువేడుకల నలసేవు పలుమారు
గబ్బిపై పారేబండికిఁ గాలు చాఁచేవా ॥ మాఁటి ॥

వొల్లనె సంసారములో నూరకె గర్వించేవు
చెల్లఁబో రొయ్యకొవ్వేలె జీవుఁడా
నల్లని శ్రీవెంకటనాథునిబంటవైతివి
తల్లకిం దేల మేరువు తలగడనుండఁగా. ॥ మాఁటి ॥ 14

---

1. "లై" వ్రాసి "లె" గా దిద్దియున్నారు. 2. "లే" వ్రాసి "లే" గా దిద్దియున్నారు.

చి. అ. 3 రే. 3 పా. గుజ్జరి

చంచలమతులకుఁ దెలియునె సాత్వికధర్మములు
పంచమునీడవలె బహుమార్గములై తోఁచుఁగాక ॥ పల్లవి ॥

తీపుల అల్పపుచదువుల తెలి వేలా కలుగు
తాపై మిడుఁగురుఁబురువులఁ గడచునె చీఁకట్లు
పైపై ప్రాకృతద్రిష్టికి పర మేలా కలుగు
పాపము కనుమాయలవలె భ్రమయించుఁ గాక ॥ చంచ ॥

కొద్దెరఁగని జడునికి [1]సద్గుణ మేలా కలుగూ
అద్దము చిలు పుట్టినక్రియ అజ్ఞానము వొడముఁగాక
నిద్దము కామాతురునకు నిజ మేలా తెలియూ
వద్దనె యండమావులవలెఁ దోఁచుఁ గాక ॥ చంచ ॥

అనువుగ నక్షయపుణ్యము అది యేలా చెడును
పెనఁగెటి తనసీడవలెనె పెడవాయదు యెపుడు
ఘనుఁడగుజీవుఁడు శ్రీవెంకటనాథునిఁ గని (నె?) నా
పనివడి రత్నము సానఁబట్టినగతిఁ జెలఁగుఁగాక. ॥ చంచ ॥ 15

చి. అ. 3 రే. 4 పా. సామంతం

అల్లము బెల్లమౌనా అన్నలాల
యెల్లకాలమును గుణ మేల మానీనయ్యా ॥ పల్లవి ॥

నిక్కము గొండలనీరు నేలకు వేగమె పారు
యెక్కువనేలపై నీరు యెక్క దందుకు
మిక్కిలి ప్రకృతిలోన మెలఁగెటివానికి
చొక్క మైనజ్ఞాన మెట్టు సొగసీనయ్యా ॥ అల్ల ॥

అచ్చపుఁబాలలోన తోడంటితేనె పెరుగాను
పచ్చి నేసినఁ బెరుగు పాలు గాదు
వచ్చి వచ్చి యెఱఁగనివానికిఁ దెలుపవచ్చు
కుచ్చితుని నెటువలె గుణిఁ జేసేదయ్యా ॥ అల్ల ॥

---

1. "సద్దుణ" వ్రాసి "సద్గుణ" గ తిద్ది యున్నారు.

చందనపువాసనలు సంగడి మాఁకుల నంటు
అందలివాసన లిందు నంట వెన్నఁడు
కందువైన శ్రీవెంకటనాథుని దాసు
లెందుండినా నితరము లేల తోఁచీనయ్యా. ॥ అల్ల ॥ 16

చి. అ. 3 రే. 5 పా. బౌళి

తనకోరిక లేఁటికి నాతఁడె యిన్నియుఁ గల్పించఁగ
అనువుగ నిందుకు యిద్దరియత్నంబులు వలెనా ॥ పల్లవి ॥
అద్దముచూచెటియాతఁ డలరుచు నవ్విన నవ్వును
అద్దములోపలినీడయు నారీతినె కాదా
గద్దరియగు శ్రీవిభుసంకల్పంబుననె జగముల
సుద్దులు దుఃఖము సుఖమును సూటిఁబడెఁ గానా ॥ తన ॥
నాఁటక మాడించునతఁడు నయమునఁ గదలింపంగా
నాఁటకమందలిబొమ్మలు నానాగతిఁ జెలఁగుఁగా
ఆటలఁ జేతన్యాత్మకుఁడగు దేవునిచేష్టలనె
పాటిగఁ బాపముఁ బుణ్యము బహుళం బగుఁగానా ॥ తన ॥
అరదము నడపెటిసారథి యటునిటు వాగెలు వట్టిన
అరదముగుఱ్ఱములు మెలఁగు నా యా ముఖములను
నరులను శ్రీవెంకటగిరినాథుఁడె తగఁ బ్రేరింపఁగ
గరవము లేమియుఁ గలిమియుఁ గలిగుండుఁ గానా. ॥తన॥ 17

చి. అ. 3 రే. 6 పా. మలహరి

తలఁ పెన్నఁడు నినుఁ దగులునయ్యా
చల మెన్నఁడు కడచనునోయయ్యా ॥ పల్లవి ॥
మోహం బెన్నఁడు ముదుసునయ్యా
దాహం బెన్నఁడు తలఁగునయ్యా
సాహస మెన్నఁడు జరగునయ్యా
శ్రీహరి తెలియఁగఁ జెప్పఁగదయ్యా ॥ తల ॥

కపటం బెన్నఁడు గడచునయ్యా
చపలత లెన్నఁడు జారునయ్యా
నిపుణత లెన్నఁడు నెగడునయ్యా
ప్రపంచముగ హరి పలుకఁగదయ్యా ॥ తల ॥

మచ్చర మెన్నఁడు మానునయ్యా
నిచ్చల మెన్నఁడు నిలుచునోయయ్యా
గచ్చుల శ్రీవెంకటనాథ
పచ్చిదేర హరి పలుకఁగదయ్యా. ॥ తల ॥ 18

చి. అ. 4 రే. 1 పా. లలిత

కుడువనికుడుపులు కొనసాగె మమతలు
కడువేగ శ్రీహరిఁ గానఁగవలదా ॥ పల్లవి ॥

వమలక చవులయ్య నాతుల సుద్దులు
అమర చింతకాయలవంటివి
భ్రమసి కొరుకఁబోతె పండ్లు వులుసును
తెమ[1]లక శ్రీహరిఁ దెలియఁగ వలదా ॥ కుడు ॥

విచ్చక మెరుఁగులు విడివడ్డ వలపులు
పచ్చిమేడిపంటి భావమువి
మెచ్చి లోను చూడ మెదలుపురువులె
గచ్చుల యివి మాని కనవద్దా హరిని ॥ కుడు ॥

బడలని పంట వో పైపైనె హరిభక్తి
కదలేని కల్పవృక్షమువంటిది
కడఁగి కొలువ శ్రీవెంకటనాథుఁడె గురి
బడినె యీతనిఁ గని బ్రదుకఁగ వలదా. ॥ కుడు ॥ 19

చి. అ. 4రే. 2 పా మలహరి

సంకె లేక తలఁచిన జాణలకు
సంకీర్తనమెపో సర్వశాంతి ॥ పల్లవి ॥

---

1. "ఎ" వ్రాసి "ం" గ దిద్ది యున్నారు.

భవహరమగు శ్రీపతి నామమె
జపకట్టి తలఁచితే జన్మశాంతి
తవిలి హరిపూజ తాఁ జేయుటె
కువలయమున నిదిగో గృహశాంతి ॥ సంతె ॥

అంది ధ్రువవరుదుఁడ యనినదె
కందువైన సర్వగ్రహశాంతి
యిందురవినయనుని నెరుఁగుటె
చందమైన దిదివో నక్షత్రశాంతి ॥ సంతె ॥

భావించి యనంతునిఁ బలుకుటె
కావించిన దిదివో కాలశాంతి
శ్రీవెంకటనాథునిఁ జేరుటె
దేవమానవులకును దేహశాంతి. ॥ సంతె ॥ 20

చి. అ. 4 రే. 3 పా. మాళవిగౌళ

మనసె వశమైతేఁగా మరి మీఁదటిపనులు
తనువులోపలి హరిదయ యింతే కాకా ॥ పల్లవి ॥

వొద్దనె పుత్రమిత్రాదు లువ్విళ్లూరించఁగాను
అద్దా వైరాగ్య మేమి ఆటపాటలా
కొద్దిలేనివిషయాలు గుంపుగూడు కుండఁగాను
వద్దని కడకుఁ దోయ వశమవునా ॥ మన ॥

వొయ్యనె ధనధాన్యాలు వొద్దుకొని వుండఁగాను
అయ్యో సుజ్ఞానము లల్లాడఁబడెనా
గయ్యాళికోరిక లెల్లా గమిగూడ కుండఁగాను
పుయ్యాక దూలయాసలఁ బోఁదోల వసమా ॥ మన ॥

పల్లదపుటాఁక లిది పాయక వుండఁగాను
చెల్లఁబో వోరుపు లింత చెడఁబోయనా
నల్లని శ్రీవెంకటనాథుఁడె యందరికిని
తల్లి దండ్రియై కావఁగా తప్పువాసెఁ గాకా. ॥ మన ॥ 21

చి. అ. 4రే. 4 పా. రామక్రియ

భవరోగవైద్యుఁడైన బలువెజ్జు
నవరని పైఁడిపక్షినకినగాఁడు ॥ పల్లవి ॥

తల్లిపద్ద నోరిలోన తగ లోకములు చూపి
వెల్లవిరి నింద్రజాలవిద్యవాఁడు
చెల్లుబడి నొక్కకొండ చేతఁబట్టి యెత్తినాఁడు
బల్లిదుఁడు వాఁడివో బారివిద్యవాఁడు ॥ భవ ॥

మునుపె సకలభూతములకు నేలికయ్యె
మనసెల్లా నెరిగిన మంత్రవాది
చనవున జలధిలో సంప దింద్రునికిఁ జూపె
అసువరి వాఁడివో అంజనగాఁడు ॥ భవ ॥

పట్టరాని కాళింగుపడిగెలమీఁదు మెట్టి
పట్టినాఁడు వాఁడువో పాములవాఁడు
అట్టె శ్రీవెంకటనాథుఁ డమరుల నెల్లనుఁ జే
పట్టి దైత్యులఁ జంపించే పాళగాఁడు. ॥ భవ ॥ 22

చి. అ. 4 రే. 5 పా. సాళంగనాట

అప్పనివరప్రసాది అన్నమయ్య
అప్పసము మాకె కలఁ డన్నమయ్య ॥ పల్లవి ॥

అంతటికి నేలికైన ఆదినారాయణుఁ దన
యంతరంగాన నిలిపీ నన్నమయ్య
సంతసానఁ జెలువొందె సనకసనందనాదు
లంతటివాఁడు తాళ్లపా కన్నమయ్య ॥ అప్ప ॥

బిరుదుటెక్కెములుగా బెక్కు సంకీర్తనములు
హరిమీఁద విన్నవించె నన్నమయ్య
విరివిగలిగినట్టి వేదముల యర్థ మెల్లా
అరసి తెలిపినాఁడు అన్నమయ్య ॥ అప్ప ॥

అందమైన రామానుజాచార్యమతమున
అందుకొని నిలిచినాఁ దన్నమయ్యా
విందువలె మాతను శ్రీవెంకటనాథుని నిచ్చె
అందరిలోఁ దాళ్లపాక అన్నమయ్యా. ॥ అప్ప ॥ 23

చి. అ. 4 రే. 6 పా. దేవగాంధారి

నేరి చెవ్వఁడు బ్రదికె నేరక యెవ్వఁడు చెడె
భారకుఁ డందరికి శ్రీపతి యింతె కాక ॥ పల్లవి ॥

వొక్కరి నేరము లైతె నూరకె వెదకఁ జూచే
నక్కటా నాగుణదోషా లవి యెంచను
వొక్కపై విచారించితే వారు లేమి తా నేమి
అక్కడ నిక్కడ గురి హరి యింతె కాక ॥ నేరి ॥

దట్టించి వొక్కరి నైతె తప్పు లెంచఁ జూచేను
అట్టె నాయపరాధాల కాఙ్ఞ యేదో
నెట్టనఁ దలపోసితే నేనేమి పరు లేమి
గట్టిగా స్వతంత్రుఁడు శ్రీకాంతుఁ డింతె కాకా ॥ నేరి ॥

వూరకె వొక్కరి నైతె వొచ్చములు వట్టేను
కారుకమ్మినట్టి నాకల్ల లెంచను
గారవించి శ్రీవెంకటనాథుఁడు నన్ను
సారెకు రక్షించఁగాను జయ మాయఁ గాకా. ॥ నేరి ॥ 24

చి. అ. 5 రే. 1 పా. సుంథక్రియ

వట్టివిచారము లేల వలవని చింత లేల
దిట్టతనాన రక్షించ దేవుఁ డుండఁగాను ॥ పల్లవి ॥

తానె బుద్దెరిఁగితే తప్పు లేల వచ్చీని
మానక యేలిక లెప్ప మన్నించుఁ గాక
మేనిలోఁ బాపము లేక మించిన భయ మేఁటికి
అనుకొని రక్షించ శ్రీహరి యుండఁగాను ॥ వట్టి ॥

చేరి తానె కొలిచితే జీత మేల తప్పీని
ధారకుఁడై దొరయే చేపట్టుఁ గాక
మారుముద్ర గాని మంచిమాడకు వట్టము లేల
తారుకాణగా హరి తానె రక్షించుఁ గాక ॥ వట్టి ॥

చనవె కలిగితేను సలి గేల తప్పీని
తనచెప్పినట్టు రాజు తాఁ జేసుఁగాక
పనివడి రాచవారి పసులకు బందె యేది
నను శ్రీవెంకటగిరినాథుఁడు రక్షించఁగా. ॥ వట్టి ॥ 25

చి. అ. 5 రే. 2 ప్లా. గౌళ

విచ్చలూఁ జెడనియట్టి నీకె తెలుసుఁ గాక
యిచ్చల మావంటివా రేమెరుఁగుదు రయ్యా ॥ పల్లవి ॥

బాలుఁడు వృద్ధనియెటి పరిభాష లన్నియును
మూలమూలలను దేహమునకె కాక
యీలో నెంచి చూచితే నెన్నటివాఁడు
కోలుముందై పెరిగీనో కొంచె మయ్యీనో ॥ విచ్చ ॥

మంచిది చెడ్డ దనెటిమాఁట లెల్లా భువిలోన
యెంచి చూడ మనుజులకింతె కాక
నించి సర్వపూర్ణుఁడవై నీవు లేవిచోటేది
తుంచరాదు పెంచరాదు తొల్లె కలవు ॥ విచ్చ ॥

వాఁడు వీఁ డనియెటివచనాలు జగములో
పోఁడిమి జీవులయందె పొసఁగెఁ గాక
[1]వేఁడినా కొసరినాను విశ్వవ్యాపకుఁడవై
నాఁడు నేఁడు శ్రీవెంకటనాథుఁడవె కలవూ. ॥ విచ్చ ॥ 26

చి. అ. 5 రే. 3 పా. నారాయణదేసాక్షి

ఐన దేది కాని దందులో నేమి
నానారూపి శ్రీనాథుఁడె కాకా ॥ పల్లవి ॥

1. "వేఁడినాను" అని వ్రాసి "వేఁడినా" అని దిద్దినారు.

యెవ్వరి దూషించే మెవ్వరి భూషించే
మెవ్వరు స్వతంత్రు లిందులో
అవ్వల నివ్వల నంతరాత్ముఁడైన
యవ్వనజాక్షుని నను టగాకా ॥ ఐన ॥

యెందుకుఁ గోపించే మెందుకు మెచ్చే
మెందుఁ గద్దు మే లిందులో
అందు నిందుఁ దానె యల్లుకొన్న
నందనందనునే నమ్ముట గాకా ॥ ఐన ॥

యేచోటు మంచిది యేచోటు చెడ్డది
యేచోటు సతమా నిందులో
కాచేటి శ్రీవెంకటనాథుఁడె
చేచేతఁ గాణాచై చెల్లించెఁ గాకా. ॥ ఐన ॥ 27

చి. అ. 5 రే. 4 పా. గుజ్జరి

చలమె చెల్లించుకొన్న సతులాల
సులభమా మీతోపొందు సుతులాల ॥ పల్లవి ॥

వ్రతినైన యతినైన వలలమాటలఁ బెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల
హితవరులువలెనె యింత నంత నెలయించి
తతిగొందురుగా ధనధాన్యములాల ॥ చల ॥

పెద్దనైన పిన్ననైన పెలుచుఁదనమె రేఁచి
కొద్దిమీరించిన కామక్రోధములాల(?)
అద్దొ యెంతవిరక్తు నైనా విషయాలకె
తిద్దితిరిగా పంచేంద్రియములాల ॥ చల ॥

మునినైన ఋషినైన మోహమె పెంచి మరపి
మొనసితిరిగా యిల్లు ముంగిళ్లాల
ఘనుఁడైన శ్రీవెంకటనాథుపాదములు
చనవు[1]నఁ జూపితి రాచార్యులాలా. ॥ చల ॥ 28

1. "చనవునీఁ" అని వ్రాసి "చనవునఁ" అని తిద్దినారు.

చి. అ. 5 రే. 5 పా. మలహరి

నిండునిధానమువలె నీవు గలిగుండఁగాను
పండినయోగికిఁ బూర్ణభావనె మంచిది ॥ పల్లవి ॥

కలకాలము భూమిఁ గతలె వింటిమిగాని
నలనహుషాదు లున్నారా యేమి
యిలలో నితరు లెల్లా నేమి లేక్క యిందుకుఁగా
యెలయింపువిషయాల యేమరఁగఁ దగునా ॥ నిండు ॥

చేపట్టి పురాణాలు చెప్పఁగా వింటిమి గాని
బాపురె దుర్యోధనుసంపద యేది
కాపాడ నిప్పటివారికలిమి యెంచఁగ నేది
యీపాటిపనికిఁగా నిది గోరఁ దగునా ॥ నిండు ॥

మళ్లి మళ్లి భూమిలోన మాటలె వింటిమి గాని
తొల్లిటి బలాఢ్యుల సత్తువ లేవి
వెల్లవిరై యెప్పుడూ శ్రీవెంకటనాథ నీదాసు
లెల్లకాలముఁ జెడని యీబలిమె నిజము. ॥ నిండు ॥ 29

చి. అ. 5 రే. 6 పా. లలిత

బ(ప?)ండించితేఁ గలుగునా పరమాత్మునిదాస్యము
నిండుమతి నుండితేను నెరవేరుఁ గాక ॥ పల్లవి ॥

బాధకు నోపనివాఁడు పాపము సేయ నేల
పోది సేయఁ దొలుతేమి బుద్ధి లేదా
సాదువలె నుండితేను పర్వేశ్వరుఁడె తన్ను
వాదులాట లెల్ల మాన్పి వహించుకో లేఁడా ॥ పండి ॥

దండుగ కోపనివాఁడు తప్పులు సేయఁగ నేల
వుండరాదా తా నుండె వొడికానను
కొండవంటి యాసతోడ కోరక తా నుండితేను
తండు ముండై లంపటాలు తగిలీనా తనకు ॥ పండి ॥

వళుకు కోపనివాఁడు వచ్చి పూఁటవడ నేల
వొలిసినట్లు తనంత నుండరాదా
కలకాలము శ్రీవెంకటనాథుఁ గొలిచితె
అలరి యభయ మిచ్చి అట్టె కావ నోపఁడా. ॥ ఎండి ॥ 30

చి. అ. 6 రే. 1 పా. గుజ్జరి

వద్దుసుమ్మీ చెప్పితిని వలలఁ బడఁగ వద్దు
పెద్దరికాన దేవునిఁ బేరుకొన రాదా ॥ పల్లవి ॥

పల్లదపు సంసారానఁ బాయలేక తిరిగేవు
చెల్లఁబో జీవుఁడ యింకా సిగ్గు గాదుగా
వెల్లవిరి నింతయాల వెనకముందరిపాటు
దళ్లాలితనము మాని తలఁచుకో రాదా ॥ వద్దు ॥

వెయ్యైనా మీఁద మీఁద వేసరక కోరేవు
అయ్యో యింకా నిందు కాసపదేవా
వొయ్యనె వెనకజన్మ మొక్కటొక్క టెంచి చూచి
తియ్యని విష్ణుభక్తి తెలుసుకో రాదా ॥ వద్దు ॥

యేపు మీరి యేమైనా నింపులు సేసుకొనేవు
ఫో ఫో యింకా రోఁత వుట్టదాయఁగా
చేపట్టి కాచేయట్టి శ్రీవెంకటనాథుఁడె
దాపై వున్నాఁ డిదె దరిసించ రాదా ॥ వద్దు ॥ 31

చి. అ. 6 రే. 2 పా. గౌళ

చిన్నవాఁడు నాలుగుచేతులతో నున్నాఁడు
కన్నప్పుడె శంఖముఁ జక్రముఁ జేత నున్నది ॥ పల్లవి ॥

నడురేయి రోహిణినక్షత్రమునఁ బుట్టె
వడిఁ గృష్ణుఁ డిదివో దేవతలందు
పడిన మీబాధ లెల్ల ప్రజలాల యిప్పు డిట్టె
విడుగరాయు మీరు వెరవకుఁ డీఁకను ॥ చిన్న ॥

పుట్టుతానె బాలుఁడు అబ్బురమైన మాఁటలెల్ల
అట్టె వసుదేవుని కాన తిచ్చెను
వట్టిజా లింకేల దేవతలాల మునులాల
వెట్టివేములు మానెను వెరవకుఁ డీఁకను ॥ చిన్న ॥

శ్రీవెంకటనాథుఁడె యాసిసువు దా నైనాఁడు
యీపల వరము లెల్లా నిచ్చుచును
కావఁగ దిక్కైనాఁ డిక్కడనె వోదాసులాల
వేవేగ వేడుకతోడ వెరవకుఁ డీఁకను ॥ చిన్న ॥ 32

చి. అ. 6 రే. 3 పా. సాళంగనాట

ఈలగద్ద[1]మూఁకలోన యించుకకోడిపిల్లకు
మూలమూలలఁ దలారికములు చెల్లునా ॥ పల్లవి ॥

పంచుకుఁ బెట్టినయట్టి మైనవుఁగుళ్లాయలు
[2]అంచెల లవుడి(టి?) పెట్టు లానఁ బోయీనా
పంచేంద్రియము లెల్ల బలవంతములై వుండఁగా
యించుక నావైరాగ్య మేడ కెక్కీని ॥ ఈల ॥

గుగ్గిళ్ల వెలవెట్టి కొనిన గుఱ్ఱము లెల్ల
దగ్గరి యగడుతలు దాఁటఁబోయీనా
నిగ్గుల బావకుఁ గాక నేరిచిన సుద్దులెల్లా
వెగ్గళమై యింతటను వెలవెట్టీనా ॥ ఈల ॥

పోరుకుఁ జాలక పోయి పొడిచే పోటులెల్లా
నారటిలుఁ గాక అవి నాటఁబోయి(యీ?)నా
గారవాన శ్రీవెంకటనాథుఁడు గావఁగా
భారములు భయములుఁ బాసె నింతె కాకా ॥ ఈల ॥ 33

చి. అ. 6 రే. 4 పా. దేసాళం

ఏలికెవై నన్నొకని నేలఁగాను । నీ ।
లీలావిభూతి కొకలేశము దక్కువా ॥ పల్లవి ॥

---

1. "మతక" అని వ్రాసి "మూఁక" గా తిద్దినారు,
2. "వ్న" కాకోలు వ్రాసి "అ" గా తిద్దినారు.

పనివూని నాయొకనిపాపము మానుపఁగా నీ
ఘనసంకల్పమునకుఁ గడమా
చెనకి నేనె పూజ సేయఁగా మెచ్చేనంటె
కనుకొనే వందేమి కంఠ గట్టుకొంటివో ॥ ఏలి ॥

దేవుఁడవై నామనసు దెరిచి రక్షించఁగాను
గోవింద నీమాయ కేమి గొఱతా
సోవల నాలోని భక్తి చూచి కాచే నంటివా
కావలసి నీ వెంత గాదెఁ బోసుకొంటివో ॥ ఏలి ॥

అలరి నాహృదయమునందుఁ గానుపించితేను
వెలయ నీమహిమకు వెలితా
కలిమితో నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
[1]యిలమీఁద నీకు నిప్పు డెంతకీర్తి గూడెనో. ॥ ఏలి ॥ 34

చి. అ. 6 రే. 5 పా. లలిత

తచ్చిచూచితేఁ జాలు దైవమే కలఁడుగాక
హెచ్చినమాయలఁ బడ నేల మాకు నిఁకను ॥ పల్లవి ॥

సారె సారె నే నెంత సంపదలు గోరినాను
పోరచి నీదేహమెకా భోగించేది
యీరీతి మనసు దా నెన్నటికిఁ దనిసీని
గారవాన హరి నిన్నుఁ గన్నదె దక్కెను ॥ తచ్చి ॥

పలుమారు చావులేనిబదుకు కాసపడేది
యిలలో సంసారమెకా యేఁ జేసేది
కలిగినయాస యేకాలమున ముదుసును
అలరి విష్ణునిశర ణన్నదె నిలిచె ॥ తచ్చి ॥

వేడుకతో ఘనమైనవిద్యలు నేరిచినాను
జోడుగా నిందరికిని చూపు టింతేకా
పీడని తలఁపుతో శ్రీవెంకటనాథునిఁ గొల్చి
యీడేరి బదుకుటె యెన్ని కింతె కాకా. ॥ తచ్చి ॥ 35

1. " ఝిల " అని వ్రాసి " యిల " గా తిద్దినారు.

చి. అ. 6 రే. 6 పా. లలిత

ధారము నీదిగాన పట్టి విన్నవించేఁ గాక
ఆరితేరి బుద్దెరిఁగే దది యెన్నఁడయ్యా ॥ పల్లవి ॥

వీలని సంసారపువెట్టి సేఁ జేయఁగాను
యేలిన నిన్నుఁ గొలిచే దెన్నఁడయ్యా
కాలమెల్లా విషయాల గాడిసె కట్టుండఁగాను
ఆలించి నీసేవ సేసే దది యెన్నఁడయ్యా ॥ ధార ॥

బట్టబయలు మాయలబారిఁ బడివుండఁగాను
యిట్టె నిన్నుఁ దలఁచే దెన్నఁడయ్యా
వుట్టిపడేకోరికల వువ్విళ్లూరఁగాను
అట్టె నిన్నుఁ బొగడే దది యెన్నఁడయ్యా ॥ ధార ॥

సొలసి నాలుక నూరసుద్దులె తడవఁగాను
యిలపై నిన్ను నుతించే దెన్నఁడయ్యా
కలిగి నన్నును శ్రీవెంకటనాథ కాచితివి
ఫలియించెఁ దపము యీబాగు లెన్నఁడయ్యా. ॥ ధార ॥ 36

చి. అ. 7 రే. 1 పా. సాళంగనాట

తన దాసునికొరకు ధరియించె నీరూపము
దిన దిన వేడుకఁ గదిరి నారసింహుఁడు ॥ పల్లవి ॥

బలురక్కసు నొడిసిపట్టి తొడలపైఁ బెట్టి
చెలఁగి కొనగోళ్లఁ జించినాఁడు
చలపట్టి పేగులజంధ్యాలతోడుతను
తెలివై వున్నాఁడు కదిరి నారసింహుఁడు ॥ తన ॥

ఘోరదానవు కంఠకుహరరక్తము ముంచి
సారెకు వసంతముగాఁ జల్లినాఁడు
మారుకొన్నదైత్యుని చర్మ మొలిచి మేనిమీఁద
ధీరతఁ గప్పినాఁడు కదిరి నారసింహుఁడు ॥ తన ॥

అందపులక్ష్మియుఁ బ్రహ్మోయుఁడు నుతింపఁగాను
విందుగా నాగముపాల వెలసినాఁడు
అంది శ్రీవెంకటనాథుఁడై యీడా నాడాను
దిందుపడున్నాఁడు కదిరి నారసింహుఁడు. ॥ తన ॥ 37

చి. అ. 7 రే. 2 పా. సామంతం

దవ్వులతెరువు మరేఁటికి తడఁబాటులు మరి యేటిఁకి
యెవ్వరు దలఁచిన నిదియె యిహపరముల నొసఁగుఁగా ॥ పల్లవి ॥

మన సనియెడు పెనువింటను మాయాలక్ష్యముపైని
పనిపడి జ్ఞానం బనియెడి బాణం బేసినను
పెనకటి దుష్కర్మంబులు వేళ్లతోడఁ బెకలిన
తనయంతనె సకలంబును తప్పక కాన నగుఁ ॥ దవ్వు ॥

మలయుచు మంత్రార్థం బను మందరగిరిచేతను
పలముగ సంసారం బను జలనిధి దచ్చినను
అలవడ హరిభక్తి యనెడియమృతము వొడమినను
38 ॥ రేపొలనెటి చావునుఁ బుట్టును వొడమక బదుక నగున్ ॥ దవ్వు ॥

జీవుఁ డనియెడిపాదున చిరకాలంబును మొలచిన
శ్రీ వెంకటనాథుండను సిద్ధౌషధతరువు
॥ ఉల్లడ భావింపఁగఁ దనకృప యను పండూ పండినను
కావలసిన యర్థము దనకైవస మనుఁ గానా. ॥ దవ్వు ॥ 38

చి. అ. 7 రే. 3 పా. లలిత

తాళపాకన్నమాచార్య దైవమవు నీవు మాకు
॥ డెత ॥ వేళమె శ్రీహరిఁ గనేవెర వానతిచ్చితివి ॥ పల్లవి ॥

గురుఁడవు నీవెసుమ్మీ కుమతి నైననాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమబంధుఁడ వైనా పరికింప నీవెసుమ్మీ
॥ డెత ॥ వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ॥ తాళ ॥

తల్లివైన నీవెనమ్మి తగిన విషయాలలో
పిల్లదాన( బడకుండా బ్రదికించితి
అల్లుకొని తోడునీడవైనా నీవెనమ్మి
చిల్లరమాయలలోన( జెడకుండా( జేసితి ॥ తాళ ॥

చాలవు నీవెనమ్మి తిరుశ్రీవెంకటనాథ
నాలిక(పులో నిలిపి నమ్మ( జేసితి
మేలిమి( జూచినా నాకు నేడుగడయు నీవె
ఆతల నీతల నన్ను నాకుకొని కాచితి. ॥ తాళ ॥ 39

చి. అ. 7 రే. 4 పా. ఆహిరినాట

ఇందవు నేల దూరేరు హితవే నీవు సేయ(గా
ముందు ముందె తమ్ము( గర్మములు సేయు మంటివా ॥ పల్లవి ॥

తెలిసి నిన్ను( గొలువ దేహ మిచ్చితివి గాక
బలిమినె మాయలలో( బడు మంటివా
మలసి నిన్ను( దల(చ మన సిచ్చితివి గాక
కొలగట్టి విషయాల( గోరు మంటివా ॥ ఇంద ॥

నగుతా నిన్ను( బొగడ నాలు కిచ్చితివి గాక
అగడుగా నూరమా(ట లాడు మంటివా
సొగసి నిన్ను( జూడ(గా( జూపు లిచ్చితివి గాక
వగవగలతో నూరివారి( జూడు మంటివా ॥ ఇంద ॥

శ్రీవెంకటనాథ నిన్ను( జేరు మ నంటివి గాక
జీవులను మనుజులా( జేరు మంటివా
భావించి నీదాసులనె భజించు మంటివి గాక
దావతి లంపటాలలో( దద(బడు మంటివా. ॥ ఇంద ॥ 40

చి. అ. 7 రే. 5 పా. నాట

ఎన్నిచే(త లెన్నిగుణా లెన్నిభావాలు
యిన్నేసినీమహిమ లివి నీకె తెలుసు ॥ పల్లవి ॥

యేమిలీలలు నటించే వేమయ్యా దేవుఁడా
భూమిలో జీవుల నెల్లఁ బుట్టింపుచు
ప్రేమతో నాటలాడేపిన్నవాఁడవూఁ గావు
నీమహిమ(మ?) లివ్నియూ నీకె తెలుసు ॥ ఎన్ని ॥

యెంతని పరఁదుకొనే విందిరానాథుఁడా
అంతరంగములనుండె అందరిలోన
వింతలు లేవు నీకు వెఱ్ఱివాఁడవూఁ గావు
యింతేసి విచారాలు యివి నీకె తెలుసు ॥ ఎన్ని ॥

చెలఁగి వరాలిచ్చేవు శ్రీవెంకటనాథుఁడా
తలఁకక నిన్నుఁ గొల్చే దాసులకు
ఆలరి నీపై తేమ ఆశకుఁడవూఁ గావు
నెలవైన నీసుద్దులు నీకె తెలుసు. ॥ ఎన్ని ॥ 41

చి. అ. 7 రే. 6 పా. రామక్రియ

మాయలో మునుఁగ నేల మమత లేల
చేయారా దేవుఁ డీపాటి సేయ నోపఁడా ॥ పల్లవి ॥

అట్టె దేహసమ్మంధ మాసపడేజీవులాల
పట్టి హరిసమ్మంధాన బ్రదుకరాదా
నెట్టన సర్వాంతరాత్మై నిలుచున్నదేవుఁ డిట్టె
చుట్టాలపక్కాలపాటి శుభ మియ్య నోపఁడా ॥ మాయ ॥

మోసపోక ధనధాన్యములు గూర్చే దేహులాల
వేసరక విష్ణుభక్తి వెదకరాదా
రాసి కెక్క యిందరిని రక్షించేదేవుఁడె
కాసువీసములపాటి కావ నోపఁడా ॥ మాయ ॥

వెలయ రాజులను దీవించే ప్రాణులాల
కల శ్రీవెంకటనాథుఁ గానఁగ రాదా
వలె నని యిందరికి వరాలిచ్చేదేవుఁ డేమి
కొలువునిలువుపాటిగుణ మియ్య నోపఁడా. ॥ మాయ ॥ 42

చి. అ. 8 రే. 1 పా. దేసాళం

వట్టి విచారములేల వగపులేల
నెట్టన శ్రీహరిఁ జేర నేరవలెఁగాక ॥ పల్లవి ॥

కాల మేమిసేసీని కర్మ మేమిసేసీని
యేలిన శ్రీరమణుఁడె యెదనుండఁగా
ఆలించిన ధ్రువునిని అజామిళునిని
కాల మేమిసేసె నయ్య కర్మ మేమిసేసెను ॥ వట్టి ॥

పాప మేమిసేసీని పగ యేమి సేసీని
కాపాడె దేవుఁడె దగ్గరనుండఁగా
యేపున ఘంటాకర్ణుని యెలమిఁ బ్రహ్లాదుని
పాప మేమిసేసెనయ్య పగయేమిసేసెను ॥ వట్టి ॥

కుల మేమిసేసీని గుణ మేమిసేసీని
నలువైన శ్రీవెంకటనాథుఁ డుండఁగా
అలరి వాల్మీకికి అలనాఁ డహల్యకు
కుల మేమిసేసెనయ్య గుణ మేమిసేసెను. ॥ వట్టి ॥ 43

చి. అ. 8 రే. 2 పా. లలిత

అ(అ?)ందరు వికార మందుదురె
విందలేని నీవు నీదాసులుదక్క ॥ పల్లవి ॥

సతుల సుతులఁ జూచి జగములోవారెల్లా
మతిలోన భ్రమయక మానరు
రతికెక్కఁగా హేయరాగరహితుఁడవై
సతతము గలిగినస్వామివి నీవు(వు?) దక్క ॥ అంద ॥

ధనధాన్యములుచూచి తగినజీవులు వాని
వెనువెంటఁ దిరుగక విడువరు
పనివూని యాశాపాశ దూరుఁడవై
ఘనతగలుగు శ్రీకాంతుఁడ నీవుదక్క ॥ అంద ॥

యిల్లుముంగిలిచూచి యీదేహాలు వాని
నొల్లి మనుచురోసి వుడుగరు
వెల్లవిరిగ శ్రీవెంకటనాథుఁడవై
తెల్లమైనయట్టి దేవుఁడవుదక్క. ॥ అంద ॥ 44

చి. అ. 8 రే. 3 పా. సాళంగనాట

ఎటులఁబుట్టించితో నీవెరుఁగుదువు
ఘటన నన్నియు నీసంకల్పమేఅయ్యా ॥ పల్లవి ॥

చచ్చేవారిఁ జూచి చావుకు వెరతుఁగాన
రొచ్చుల సంసారముపై రోతుఁగాని
కచ్చుపెట్టి అదియె కాలాఁజేతాఁబెనఁగఁగ
మచ్చిక సేయుదుఁగాని మానలేనయ్యా ॥ ఎటు ॥

బడలేవారిఁజూచి బడల నోపఁగాన
విడువని సంపదపై విసిగేఁగాని
పెడవాయ కదియె పెరుగుచురాఁగాను
బడిఁ దిరుగుదుఁగాని పాయలేనయ్యా ॥ ఎటు ॥

మలిగేవారిఁ జూచి ములుగ నోడుదుఁగాన
శిలుగుఁగోరికలఁ గోసితిఁగాని
కలిమితో శ్రీవెంకటనాథ నీభక్తి
వెలయఁ గోరుదుఁగాని విడువలేనయ్యా. ॥ ఎటు ॥ 45

చి. అ. 8 రే. 4 పా. రామక్రియ

నీవుగలిగినఁ జాలు నిక్కము అన్నిఁగలవు
ఆవల మాయాచార్యుఁ డానతిచ్చెనయ్యా ॥ పల్లవి ॥

యేలోకమునసున్న యెడయవిసొమ్ము నీవె
తాలిమి యెందుఁబోనిధనము నీవె
కాలముకడాతరగని ధాన్యము నీవని
ఆలించి మాగురుఁ డిట్టె ఆనతిచ్చెనయ్యా ॥ నీవు ॥

యెందెందుం దిరిగిన యేలికవు నీవె
నిందలేనియట్టి తోడునీడవు నీవె
ముందువెనకల నిల్లు ముంగిలియు నీవె యని
అందముగ దేశికుఁడె ఆనతిచ్చెనయ్యా ॥ నీవు ॥

యెన్నఁడుఁ గలఁగనట్టి హితుఁడవు నీవె
పన్నినట్టైవుండె నిచ్చపంటా నీవె
నన్నుఁ గాచే శ్రీవెంకటనాథుఁడ వని తాళ్లపా
కన్నమయ్యంగారె నాకు నానతిచ్చిరయ్యా. ॥ నీవు ॥ 46

చి. అ. 8 రే. 5 పా. లలిత

జగదీశ్వరుని లీలాచక్రములోపలనుండి
మగుడ దాసుఁడుగాక మాయ దాఁట వసమా ॥ పల్లవి ॥

తనువు నాదెయనఁగ తనకు స్వతంత్రమేది
తనువులో తాను హరి(రి?)తనువెకాన
మనసులో యీసుద్ది మరినమ్మితేఁ జాలు
వెనకముందరలకు విచారమేలేదు ॥ జగ ॥

సొమ్ములు నావియనఁగ సోధించఁ దానెవ్వఁడు
సొమ్ములునుఁ దాను హరిసొమ్మలెకాన
సమ్మతి నీతలఁపె సహజమై కలిగితే
నెమ్మదిఁ దా నిన్నిటా నిశ్చింతుఁడౌను ॥ జగ ॥

బంటులు నావారనఁగఁ బరికించ నెవ్వఁడు
బంటులునుఁ దా(దా?)ను హరిబంట్లెకాన
నంటున శ్రీవెంకటనాథునిఁ గొలిచితేను
కంటకములెల్లాఁ బాసి ఘనుఁడె తానౌను. ॥ జగ ॥ 47

చి. అ. 8 రే. 6 పా శుద్ధవసంతం

మేలేమి కీడేమి మించిన నీరూపమె
వాలాయించి తెలిసినవానికి ॥ పల్లవి ॥

యినమేమి పసిఁడేమి యెంచిచూచితె
మనసు దెలిసిన నిర్మలునికి
ఘనమేమి కిరుదేమి కలవెల్లా నీ
తనువుగఁ దెలిసిన తత్వజ్ఞానికి ॥ మేలే ॥

పగయేమి చెలిమేమి పలుమారు నిన్ను
పొగడుచునుండెటి పుణ్యునికి
వగపేమి వేడుకేమి వరుసతో నిన్ను
వెగటులేక కొలిచే వివేకికి ॥ మేలే ॥

చేరువేమి దవ్వేమి శ్రీవెంకటనాథ నిన్ను
కూరిమిఁ గొలిచిన సద్గుణునికి
ఖారమేమి పాఁచేమి పరమాత్మ నిన్ను
సారమతిఁ దెలిసిన సర్వజ్ఞునికివి. ॥ మేలే ॥ 48

చి. అ. 9 రే. 1 పా. లలిత

ఏలికైన హరి నేల మరవఁగవలె
పాలుమాలి మరియాల భంగపడవలెను ॥ పల్లవి ॥

యిరుకుమానిసంది నేఁటికిఁ జొరవలె
తిరుగలేక యేల తిమకవలె
యెరవులవిషయాల నేల పొరలవలె
కొరగాని పాపాలగొడ వేలవలెను ॥ ఏలి ॥

మిగుల పురులలోన మెడ యాల పెట్టవలె
తగిలించుకొని యేల పొగులవలె
యెగసక్కెపుఁగోరిక లేల కోరవలె
జిగురువంటిబందాలఁ జిక్క నేలవలెను ॥ ఏలి ॥

పారేబండికింద పాద మేల చాఁచవలె
జారుపడి మరియాల జడియవలె
మీరి శ్రీవెంకటనాథు మిక్కిలివేడుకఁ గొల్చి
పోరుమాలివుండ కేల పొడిఁబడవలెను. ॥ ఏలి ॥ 49

చి. అ. 9 రే. 2 పా. పాడి

తానేడ వారేడ తనువేడ మరి తక్కినవెల్లానేడ
మానలే వనుచు తరితీపునేనే [1]మన నేడ నుండునో ॥ పల్లవి ॥

కందువ మానిపై నోరూరించెటికాయలుఁ బండ్లు పక్వముదప్పిన
అందముగ మున్నుగోరినట్టివారియాస లెందుండునో
పొందున వలచి పులకించినట్టిపురుషులు సతు లట్టె ముదిసితె
ముందర వెవక నెరఁగనియ్యనిమోహ మెందుండునో ॥ తానే ॥

కొత్తమెరుఁగులచేత భ్రమయించే కోకలు చివిరె పాఁతగిలితె
బత్తితోఁ గావలె నని కొన్నవారిభ్రమ లెందుండునో
రిత్తజవ్వనాన కొప్పు గోళ్ల దిద్ది రీతిగానుండెటి సింగారంబులు
పత్తివలెనై బట్టగట్టఁదనభావ మెందుండునో ॥ తానే ॥

తావితో బుగులుకొనెటిపూవులు దాఁపఁగ నవియె వాడినపిమ్మట
భావించి చూచితే నందలి తొల్లిటిపస యెందుండునో
శ్రీవెంకటనాథుఁ డిట్టె యేలెఁగాకచెల్లఁ బోతాఁదొల్లి భోగించినవెల్ల
వేవేగ మరునాఁ డవియె చూడ నేవిధమైయుండునో. ॥తానే॥ 50

చి. అ. 9 రే. 3 పా. మాళవిగౌళ

శ్రీపతిపురనాయకా జయచింతితాభీష్టదాయకా ॥ పల్లవి ॥

వున్నతోన్నతవిగ్రహా దానోపరిస్థానుగ్రహా
సన్నుతామరసుగ్రహా సామవదపరిగ్రహా ॥ శ్రీప ॥

జానకీప్రియకారకా శివసాధితాఖిలతారకా
మానుషాహితమారకా మామకాఘనివారకా ॥ శ్రీప ॥

శ్రీవెంకటనాథరూపకా సంచితరఘుకులదీపకా
భావసంతోషప్రాపకా అతంగమంజులచాపకా. ॥ శ్రీప ॥ 51

చి. అ. 9 రే. 4 పా. దేసాళం

ఎట్టిహితోపదేశకుఁ డెటువంటిదయాళువు
అట్టె తాళ్లపాకన్నమాచార్యులు ॥ పల్లవి ॥

---

1. "మద" వ్రాసి "మన" గా తిద్దియున్నారు.

పచ్చితామసుల మమ్ముఁ బరమసాత్వికులఁగా
యిచ్చటనె చేసినాఁడు యెంతచిత్తము
యిచ్చగించి మాకులాన నెన్నఁడులేనివైష్ణవ
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥

ముదిరిన పాపకర్మములు సేసినట్టి మమ్ము
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంతసోద్యము
కదిసి యేజన్మవఁ గానవి సంకీర్తన
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥

గడుసుఁదనపు మమ్ముఁ గడు వివేకులఁ జేసి
యిడుమలెల్లాఁ బాపె నేమరుదు
నడుమనె యెన్నఁడుఁ గానని శ్రీవెంకటనాథు
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు. ॥ ఎట్టి ॥ 52

చి. ఆ. 9 రే. 5 పా. సామంతం

తోఁటకూరదొంగలాల తొయ్యలులాల
నాఁటకపు మీమోహము నమ్మ నెట్టువచ్చును ॥ పల్లవి ॥

పాపపుణ్యపు[1]టోఁదాలపాలుసేసి జీవులను
చూపులనె భ్రమయించే సుద్దులు మీవి
దాపుదండై శ్రీవిభుఁడు తానె కాచెఁగాక
యేపున రిత్తవారి మీ రెంతంతసేయరు ॥ తోఁట ॥

కీడు మే లనె వురులఁ గీలించి మనుజులఁ
బాడితోనె యెంచెటిభావము మీది
యీడేరించి నాగురుఁడు యిందిరేశుఁ జూపెఁగాక
యీడనె రుత్తవారి మీ రెంతంతసేయరు ॥ తోఁట ॥

చావుఁ బుట్టుగు లనెటి సముద్రాలఁ బడఁదోసి
జీవులను విసిగించేచిత్తము మీకు
శ్రీవెంకటనాథుఁడె చేపట్టి మమ్మేలెఁగాక
వేవేగనఁ బేదలచే వెట్టి యెంతగొనరు. ॥ తోఁట ॥ 53

1. "బందాల" వ్రాసి "టోందాల" గా శోధియున్నారు.

చి. ఆ. 9 రే. 6 పా. మాళవి

నూరవద్దు తాగవద్దు నోరు చేఁదుగావద్దు
చేరువ నొకచోట సంజీవి వున్న దిదివో ॥ పల్లవి ॥

పొలమెల్లాఁ దిరిగాడి పొడిఁబడనెవద్దు
తలఁకక గద్దపారఁ దవ్వవద్దు
వలవని వాఁగుల వంకల వెదకవద్దు
వెలఁగి వొకచోట సంజీవి వున్న దిదివో ॥ నూర ॥

మొక్కలానఁ జెరువులో మునిఁగి చూడవద్దు
నిక్కిన పుట్టలమీఁద నెమకవద్దు
వెక్కసానఁ జేతిపైఁడి వెలవెట్టి కొనవద్దు
చిక్కులెల్లాఁ బాపెటి సంజీవి వున్న దిదివో ॥ నూర ॥

దీవులను నోడలెక్కి తిరుగాడనేవద్దు
నోవల బిలములోనఁ జొరవద్దు
కావించి గ్రహణాదికాలము వెదకవద్దు
శ్రీవెంకటనాథుఁడై సంజీవి వున్న దిదివో. ॥ నూర ॥ 54

చి. అ. 10 రే. 1 పా. దేసాళం

ఎఱుక గలిగితేను యీతఁడె దిక్కు
మఱి నిమిష మీతని మానివుండఁదగునా ॥ పల్లవి ॥

యెవ్వరిసొమ్ముగుడిచి యెవ్వరిగుత్తాలవెంట
కొవ్వుదీరఁ బారాడి కొలిచేది
యివ్వలఁ బుట్టించి పెంచి యేలిన దేవుఁ డుండఁగా
అవ్వ లివ్వలివారిని ఆసపడఁదగునా ॥ ఎఱు ॥

తా నెవ్వరికిఁ బుట్టి తలఁకక వూరివారి
నానందాన అయ్య లమ్మ లనుకొనేది
పానిపట్టి సర్వవిధబంధుఁడు విష్ణుఁ డుండఁగా
మానిసిచుట్టరికాలు మదుసఁగఁ జెల్లు(ల్లు)నా ॥ ఎఱు ॥

యెందువంకనో యీదేహి యేమిటినో పొగడుచు
విందువలె నెవ్వరిని వెత్తిఁజేసేది
కందువైన శ్రీవెంకటనాథుఁడు గావఁగా
సందునుడి కోరికల సటఁ బడఁజెల్లునా. ॥ ఎఱు ॥ 55

చి. అ. 10 రే. 2 పా. నాట

ఇందరిఁ జూచి చూచి యెఱఁగవద్దా
బందెపసులకు మెడ పన్నించ నేలా ॥ పల్లవి ॥

యిమమునఁజేసిరా యెవ్వరిదేహమ్మైనా
పొనిఁగి పోతేఁబోవు పోకుంటే మాను
పనివడి యిందుకుఁగాఁ బాటువడ నేమిటికి
మొనసి దొసవంటికి యినుపక ట్టేలా ॥ ఇంద ॥

మంచి రాతఁజేసిరా మనుజునిమే నేమి
వించి చెడితేఁజెడు నిల్చితే నిల్చు
పొంచి పొంచి యిందుకుఁగా పొడిఁబడ నేఁటికి
మంచ నీరుబుగ్గ రాతిబరణిఁ బెట్ట నేలా ॥ ఇంద ॥

చేఁగమానఁ జేసిరా చెల్లఁబో నరుల నెల్లా
యీఁగి కుంగితేఁగుంగు హెచ్చితే హెచ్చు
నాఁగువార శ్రీవెంకటనాథుఁడు మన్నించఁగాను
డాఁగి జీలుగుబెండుకు తరమువెట్ట నేలా. ॥ ఇంద ॥ 56

చి. అ. 10 రే. 3 పా. భూపాళం

గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమా నీకు ॥ పల్లవి ॥

కమలజ చల్లనికాఁగిటఁ దగిలి
సమరతిఁ బాయఁగఁ జాలవూ
కమలభవాదులు కడు నుతియింపఁగ
విమలపుశయనము విడువగ లేవు ॥ గోవిందా ॥

భూసతితోఁఘుత పొందులు మరిగి
వేసర విడె నీవేడుకలా
వాసవముఖ్యులు వాకిట నుండఁగ
పాసి వుండ నని పవళించేవూ ॥ గోవిందా ॥
నీళామనసిజలీలలఁ దగిలి
నాలితోఁద మానఁగ లేవూ
వేళాయను శ్రీవెంకటనాథుఁడ
పాలించి దాసుల బ్రతికించఁగనూ. ॥ గోవిందా ॥ 57

చి. అ. 10 రే. 4 పా. లలిత

సకలపురాణములు చాటి నినుఁ బొగడఁగా
తకమకలుగా నల్పార్థము చెప్పఁదగునా ॥ పల్లవి ॥
నిను నిర్గుణుఁ డనేటి నీచజాతులయందు
యెనయు దుర్గుణము దా నెంతో
కనకంబు నిను మనుచు కారునాయంబులను
యెనలేనిదుర్వాదుల నేమనఁగఁగలము ॥ సకల ॥
నీవె తా మనుకొనేటి నిందితాత్ములు దాము
కావించుద్రోహంబు కడమా
దావతులఁ దముఁ గన్నతల్లి గొడ్డనిపల్కు
దేవతానిందకులఁ దెలుపంగ వశమా ॥ సకల ॥
అమరుసర్గము మిథ్య యనుశూన్యభాషలకు
తమితోఁద భ్రమ యేల తరగు
తమగురువు శాస్త్రంబు తామె కల్లనఁ గాను
క్రమబుద్ధి శ్రీవెంకటనాథ యిత్తువా. ॥ సకల ॥ 58

చి. అ. 10 రే. 5 పా. దేవగాంధారి

నిమిష మెడతెగక హరి నిన్నుఁ దలఁచి
మమత నీమీఁదనే మరిపి బదుకుట గాక ॥ పల్లవి ॥

నిదురచేఁ గొన్నాళ్లు నేరములఁ గొన్నాళ్లు
ముదిమిచేఁ గొన్నాళ్లు మోసపోయి
కదిసి కోరినను గతకాలంబు వచ్చునె
మది మదినె వుండి యేమరక బ్రదుకుట గాక ॥ నిమి ॥

కడుఁ దనయులకుఁ గొంత కాంతలకు నొకకొంత
వెడయాసలకుఁ గొంత వెట్టిసేసి
అదరి కావలె ననిన నందు సుఖ మున్నదా
చెదక నీసేవలే సేసి బదుకుట గాక ॥ నిమి ॥

ధనమువెంటాఁ దగిలి ధాన్యంబునకుఁ దగిలి
తనవారిఁ దగిలి కాతరుఁ డైవను
కనుకలిగి శ్రీవెంకటనాథ కాతువె
కొనసాగి నిన్ననే కొలిచి బదుకుట గాక. ॥ నిమి ॥ 59

చి. అ. 10 రే. 6 పా. వరాళి

గాడిదెపిల్లకోమలికమె కలిగినది
వేడు[1]కపడు సంసారమె విసిగించు వెవక ॥ పల్లవి ॥

అగపడుసంపదమీఁదట నాసలు కడుఁ బుట్టు
వగ నది భరియింప వసమె కాదయ్య
మొగమె చూడఁగ నాపై ముదమునఁ గనుపట్టు
పొగులఁగఁ గరచెటికాల్లు పులికంపె బెట్టు ॥ గాడి ॥

పిడువని భోగంబులపై వేడుక కడుఁ బుట్టు
తడఁబడులంపట మైతే తలఁచనె రాదయ్య
తొడ(డి?)మెను మూఁగినపండైతే తోఁచుఁ జూచినను
వడియఁబడి గొడ్డంటికి వసమె కాదెవ్వుడు ॥ గాడి ॥

మోవఁగ విషయంబులపై మోహము కడుఁ బుట్టు
శ్రీవెంకటనాథా అది చెప్పఁగ రాదయ్య
ఆవలఁ జూడఁగఁ జల్లనై వుండుఁ గాని
తేవలఁ గూఁకటవేళ్లు తెగఁబారును మిగులా. ॥ గాడి ॥ 60

1. "కడు" వ్రాసి రెండక్షరముల మధ్య "వ" చిరికించి "కవడు" గా దిద్దియున్నారు.

# సూచిక ౧

## సంకీర్తన రాగముల అకారాది సూచిక


| రాగములు. | | సంకీర్తనల సంఖ్యలు. |
|---|---|---|
| అహిరినాట | .... | 40. |
| గుండక్రియ | .... | 25. |
| గుజ్జరి | .... | 4, 10, 15, 28, 31. |
| గౌళ | .... | 26, 32. |
| దేవగాంధారి | .... | 5, 8, 24, 59. |
| దేసాళం | .... | 34, 43, 52, 55. |
| దేసాక్షి | .... | 3. |
| నాట | .... | 41, 56. |
| నారాయణదేసాక్షి | .... | 27. |
| పాడి | .... | 50. |
| బౌళి | .... | 2. 11, 17. |
| భూపాలం | .... | 57. |
| మలహారి | .... | 6, 9, 18, 20, 29. |
| మాళవి | .... | 54. |
| మాళవిగౌళ | .... | 21, 51. |
| రామక్రియ | .... | 22, 42, 46. |
| లలిత | .... | 12, 13, 19, [illegible]0. 35, 36. 39, 44, 47, 49, 58. |
| వరాళి | .... | [illegible] |
| శుద్ధవసంతం | .... | [illegible] |
| సామంతం | .... | 16, [illegible] |
| సాళంగనాట | .... | [illegible] |

# సూచిక ౨

## సంకీర్తనల అకారాది సూచిక


| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| అందరు వికారమందు | .... లలిత | .... 44 |
| అప్పనివరప్రసాది | .... సాళంగనాట | .... 23 |
| అల్లము బెల్లమౌనా | .... సామంతం | .... 16 |
| ఇందరిఁజూచి చూచి | .... నాట | .... 56 |
| ఇందరు నేళదూరేరు | .... ఆహిరినాట | .... 40 |
| ఈలగద్దమూఁకలోన | .... సాళంగనాట | .... 33 |
| ఎంతలేదిది యెంచిన | .... గుజ్జరి | .... 10 |
| ఎటులబుట్టించితో | .... సాళంగనాట | .... 45 |
| ఎట్టిహితోపదేశకు | .... దేసాళం | .... 52 |
| ఎన్నటికి నీకు జీవుఁడా | .... దేసాక్షి | .... 3 |
| ఎన్నిచేత లెన్నిగుణా | .... నాట | .... 41 |
| ఎఱుక గలిగితేను | .... దేసాళం | .... 55 |
| ఎవ్వరుచెప్పినా | .... దేవగాంధారి | .... 8 |
| ఏమొకో నేమొకో | .... దేవగాంధారి | .... 5 |
| ఏలికయైనహరి | .... లలిత | .... 49 |
| ఏలికవై నన్నొకని | .... దేసాళం | .... 34 |
| ఐనదేది కాని | .... నారాయణదేసాక్షి | .... 27 |
| కుడుపవి కుడుపులు | .... లలిత | .... 19 |
| గాఁడిదెపిల్లకోమలికమె | .... వరాళి | .... 60 |
| గోవింద గోవింద | .... బౌళి | .... 2 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| గోవిందా మేల్కొన | .... భూపాలం | .... 57 |
| చంచలమతులకు | .... గుజ్జరి | .... 15 |
| చలమేచెల్లించుకొన్న | .... గుజ్జరి | .... 28 |
| చిన్నవాఁడ నాలుగు | .... గౌళ | .... 32 |
| చెప్పేనామాఁట | .... లలిత | .... 12 |
| జగదీశ్వరుని లీలా | .... లలిత | .... 47 |
| తచ్చిచూచితే | .... లలిత | .... 35 |
| తనకోరికలేఁటికి | .... బౌళి | .... 17 |
| తనదాసునికొరకు | .... సాళంగనాట | .... 37 |
| తలఁపెన్నఁడునిను | .... మలహరి | .... 18 |
| తానేదవారేద | .... పాడి | .... 50 |
| తాళపాకన్నమాచార్య | .... లలిత | .... 39 |
| తోఁటకూర దొంగలాల | .... సామంతం | .... 53 |
| దవ్వులతెరువు | .... సామంతం | .... 38 |
| నిందువిధానమువలె | .... మలహరి | .... 29 |
| నిచ్చలూఁజెదనియట్టి | .... గౌళ | .... 26 |
| నిమిషమెడతెగక | .... దేవగాంధారి | .... 59 |
| నీవుగలిగినఁజాలు | .... రామక్రియ | .... 46 |
| నూరవద్దు తాగవద్దు | .... మాళవి | .... 54 |
| నేరిచెవ్వఁడుబ్రదికె | .... దేవగాంధారి | .... 24 |
| పండించితేఁ గలుగునా | .... లలిత | .... 30 |
| పచ్చిగాఁదెలియ | .... లలిత | .... 13 |
| బ్రహ్మఁగన్నవాఁడు | .... బౌళి | .... 11 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| భవరోగవైద్యుడైన | .... రామక్రియ | .... 22 |
| భారమునీదిగాన | .... లలిత | .... 36 |
| మచ్చరములుఁగపటంబులు | .... గుజ్జరి | .... 4 |
| మనసె వశమైతేఁగా | .... మాళవిగౌళ | .... 21 |
| మాఁటిమాఁటికిఁజూచి | .... వరాళి | .... 14 |
| మాజహిహిదుష్ట | .... సామంతం | .... 7 |
| మాయలోమునుఁగ | .... రామక్రియ | .... 42 |
| మేలేమి కీదేమి | .... శుద్ధవసంతం | .... 48 |
| రామరామచంద్ర | .... వరాళి | .... 1 |
| వట్టి విచారములేల వగపు | .... దేసాళం | .... 43 |
| వట్టి విచారములేల వలవని | .... గుండక్రియ | .... 25 |
| వద్దునుమ్మీ చెప్పితి | .... గుజ్జరి | .... 31 |
| శ్రీపతిపురనాయకా | .... మాళవిగౌళ | .... 51 |
| సంకెలేక తలఁచిన | .... మలహరి | .... 20 |
| సకలపురాణములు | .... లలిత | .... 58 |
| హరికి మొరవెట్టితె | .... మలహరి | .... 6 |
| హితవిదె తెలుసు | .... మలహరి | .... 9 |


★

శ్రీ

శుభమస్తు

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ తిరువెంగళనాథదేవునికి తాళ్లపాక అన్నమాచార్యుల కొమారుఁడు
పెదతిరుమలాచార్యులు, పెదతిరుమలాచార్యుల కొమారుఁడు
చినతిరుమలాచార్యులు విన్నపం సేసిన

# శృంగార సంకీర్తనలు.

[illegible] సంపుటము

f. శృ. 1 రే. 1 పా. వరాళి

ఎట్టకేల కిదేలరా యెన్నఁడులే నలపాటు
చిట్టకాల కిన్నాళ్లెట్టె సేయవత్తువా ॥ పల్లవి ॥

దవ్వుల నాటఁజూచేవు దగ్గరి మాఁటలాడేవు
యెవ్వతైనా మతకాన కీడ కంపెనో
యివ్వల నిన్నాళ్లు మనమిద్దరము నొక్కవూరె
నవ్వులు మాతో నిట్టె నవ్వవత్తువా ॥ ఎట్ట ॥

వారసేవు రమ్మనేవు వారి ముచ్చట లాడేవు
గరిమ రేతిరి కలగంటివా నీవు
యిరవుగ నేను నీవూ నిద్దరము నొక్కవూరె
నెరతనా లిట్లానె నెరపుదువా ॥ ఎట్ట ॥

ఋక్కవ నాతోఁ జెప్పేవు యిప్పుడిట్టె రమ్మనేవు
యెక్కువ నామనసు నీవెఱుఁగుదువా
చక్క శ్రీవెంకటనాథ సరవి నన్నుఁ గూడితి
మక్కువ వెనక కిట్టె మన్నింతువా. ॥ ఎట్ట ॥ 1

చి. శృ. 1 రే. 2 పా. మధ్యమావతి

విన్నవించవే వోరమణి విభునికి వింత లింకనేలె
వున్నతిఁ దన్ను నే నేమైననంటినా వోరుచుకొమ్మనవే ॥ పల్లవి ॥

చెలులలో నన్నె చేపట్టినవాఁ డలుగనేఁటికినే
వలచి తా నాకు నిచ్చినబాసలు వాకిటనె పోయనా
తలఁచి తలఁచి తాపాన నే నిట్టె తలఁకుచు నుండఁగా
కలయఁ దా రాక యెడమాఁటలనె కాఁకరేఁచ నేలె ॥ విన్న ॥

యెప్పుడు నావద్దఁ బాయనివాఁడు నేఁ దేమిటికిఁ బోయనే
తప్పెనో నామీఁదిమోహము తనకు తామసించ నేలె
ముప్పిరిగొన్నట్టి జవ్వనము నే మోవలేకవుండఁగా
యిప్పుడెవిచ్చేసి నన్నుఁ గలయక యేమిటికున్నాఁడె ॥ విన్న ॥

యెక్కుడుమాఁట దన్నాడని నాతోడనేఁటికిఁ గోపించెనే
వొక్కటై నే నెంతమీరి నవ్వినా నూరకుండేవాఁడు
చక్కని శ్రీవెంకటనాథుఁడు నన్ను సరవితోఁ గూడెనే
మక్కువ నన్నింక దిగవిడువక మన్నించు మనవె. ॥విన్న॥ 2

చి. శృ. 1 రే. 3 పా సామంతం

అవునె లెప్పతగవులాయనె నేఁడు
తివిరి నీకింత నాతో దీకొనఁగవలెనా ॥ పల్లవి ॥

మాఁటలఁ దేలించనేర్చుమగువా నీకు నిప్పుడు
యేఁటికె నా విభునితో నేకాంతము
వాఁటమై నాపతిపొందు వద్దన్నా మానవు
గాఁటాన నీకింతయేలె గామిడితనాలు ॥ అవునె ॥

కూరిమిపుట్టించనేర్చుకోమలి యేఁటికే నీకు
చేరి నారమణునితోఁ జేసన్నలు
సారెకు నామగనితో సరసాలు మానవు
కారణములేని దేలె గయ్యాళితనాలు ॥ అవునె ॥

కలసి మెప్పించనేర్చుకామిని యేఁటికె నీకు
నెలపై నాకాంతునితో నెయ్యములు
యిల శ్రీవెంకటనాథుఁ డిద్దరి మన్నించికూడె
మలసి మనలో నిఁక మచ్చరా లేమిటికె. ॥ అవునె ॥ 3

చి. శృ. 1 రే. 4 పా. పాడి

మానరా నారో(తో?) నింక మరఁగులు
పోనీనెంతైనా నిన్ను బొంకకు నాతోను ॥ పల్లవి ॥

గుఱుతైన యాకెమేనికుంకుమపరిమళము
మెఱయ నేఁటికిరా నీమేనియందును
మెఱుఁగు నీమేనిమీఁద మించిన కెంపేలవచ్చె
పొఱపొచ్చముల నీవు బొంకకు నాతోను ॥ మానరా ॥

లలనపాదానమున్న లత్తుక నీనొసలను
కలుగ నేమిటికి వేగనచెప్పరా
కలికిపుక్కిటనున్న కప్పురపుఁ దమ్ము(మ్మ)లము
పొలుపై నీకేలవచ్చె బొంకకు నాతోను ॥ మానరా ॥

పడఁతి నీమేన విట్టె బాగుగానించినయట్టి
జడిగొన్న కొనగోళ్ల జాడ లేడవి
కడఁగి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
పొడవైనచెలిపుద్ది బొంకకు నాతోను. ॥ మానరా ॥ 4

చి. శృ. 1 రే. 5 పా. పాడి

మేలురా యీనీగుణము మెచ్చవచ్చును
పోలించ నీచేఁత పూఁట పూఁట కొత్తేకాదా ॥ పల్లవి ॥

దిట్టయై యెవ్వతెయైనాఁ దిట్టినా నవ్వేటి నీవు
యెట్టు నేఁ బొగడినాను యీరసించేవు
యిట్టె వలపించేవా రేమ్న(మ?)నినాఁ జెల్లుఁగాక
నెట్టన నేమూరకున్నా నీకు నెగ్గేకాదా ॥ మేలు ॥

తొయ్యలి యెవ్వతెయైనాఁ దోకినా నవ్వేటి నీవు
యియ్యెడ నేమొక్కినాను యేవగించేవు
నెయ్యపువారిచేతలె నీకు నితవౌఁగాక
చయ్యన నామోహమైన చప్పనెకాదా ‖ మేలు ‖

వాదుగ కెవ్వతె గైకోకుండినా నవ్వేటి నీవు
యెదురుకొన్నా నామో మిటుచూడవు
యిదె శ్రీవెంకటనాథ యిట్టె నన్నుఁగూడి నా
మదిలోఁ బాయవైతివి మంచిదెకాదా. ‖ మేలు ‖ 5

చి. శృ. 2 రే. 1 పా. పాడి

ఒద్దన్నఁ జలము సేసీ నోయమ్మ వీఁడు ।తన।
వుద్దండా లెంతైన మానఁ డోయమ్మ వీఁడు ‖ పల్లవి ‖

యేపుమీరి నాతోడ నెగసక్కెలాడీని
వో పో పొమ్మన్న మానఁ డోయమ్మ వీఁడు
పై పై నన్నుఁ జెనకి బలిమి సేయవచ్చీనే
నోపనన్నాఁ గొంగువట్టీ నోయమ్మ వీఁడు ‖ ఒద్ద ‖

సారెకుఁ బేరఁ బిలిచి సన్నలు సేయవచ్చీని
వూరకపోయెటి నన్ను నోయమ్మ వీఁడు
నేరుపరి నంటానె నింతువాని సేసుకొనీ
వోరిచిన నెరఁగఁడు వోయమ్మ వీఁడు ‖ ఒద్ద ‖

యేలుకొన్నవానివలె నెవ్వరుంటా నెరఁగఁడు
వోలవేయవచ్చీ నాపై నోయమ్మ వీఁడు
నాలికాఁడు శ్రీవెంకటనాథుఁడు నన్ను నిట్టె
వోలివెట్టకె కూడె నోయమ్మ వీఁడు. ‖ ఒద్ద ‖ 6

చి. శృ. 2 రే. 2 పా. శంకరాభరణం

చాలుఁ జాలు నే నెరంగనా నాఁడు వాఁడె
అలరి నీసుద్దు లెల్ల విన్నిఁ గంటిని ‖ పల్లవి ‖

సారె సారె నన్ను నేల పిలిచేవు
యేరా నీ వలపు నే నెరఁగనిదా
వూరకె యింకా నేలరా మాఁటలనె
దూరేవు నీసుద్దు లెల్ల తొల్లె కంటిమి ॥ చాలు ॥

సన్నలు నేసే వేమిరా యెరఁగనా
చిన్ననాఁడె నీ చేఁత లెల్లాను
చన్నులుముట్టే వేమిరా నాలికాఁడ
వున్నతి నీ సుద్దు లెల్లా నిన్ననె కంటిమి ॥ చాలు ॥

దగ్గరి చేయి వట్టేవురా యెప్పుడును
నిగ్గుల నీ చల మెల్లా నే నెరఁగనా
అగ్గమై శ్రీవెంకటనాథ కడపలో
దగ్గరి నన్నుఁ గూడఁగా తలఁ పెల్లాఁ గంటిమి. ॥ చాలు ॥ 7

చి. శృ. 2 రే. 3 పా. శ్రీరాగం

ఇంతిచక్కఁదన మిఁక నేమని కొనాడుదవ
చెంత నాతఁడును నీపె చేఁతలకె భ్రమనె ॥ పల్లవి ॥

మొలక నవ్వుల చెలిమోము చూచి విభుఁడు
తొలఁకువెన్నెలల చందురుఁ డని భ్రమనె
మలయు జంకెనల బొమ్మలుచూచి రమణుఁడు
వెలయఁగ మదనుని విండ్లని భ్రమనె ॥ ఇంతి ॥

సొగసిన చెలి చూపు చూడఁ జూచి ప్రియుఁడు
పగతో మరుఁ డేసిన బాణ మని భ్రమనె
మగువ యాడినయట్టి మాఁట విని నాయకుఁడు
పగటునఁ గోవిలపలు కని భ్రమనె ॥ ఇంతి ॥

కరఁగించి చెలి దన్ను కాఁగిలించిననుఁ బతి
తిరమైయున్న మెరుఁగుఁ దీగె యని భ్రమనె
గరిమతోడుత శ్రీవెంకటనాథుఁడు కాంత
వరుసఁ గూడఁగ పరవశమున భ్రమనె. ॥ ఇంతి ॥ 8

చి. శృ. 2 రే. 4 పా. హిజ్జిజి

నీ వేమి సేతువు నానేరమోయమ్మా
చేవ నీయిచ్చ రాజ్యము సేయవోయమ్మా ॥ పల్లవి ॥

వలపించి రమణుఁని వాకిలి వెళ్లనీవు
కలికిచేఁతలనె కదవమ్మా
చలమున నావిభుని జంకించి నాఁడు నాఁడె
నెలవై నే నింతేసి నేరనైతినమ్మా ॥ నీవే ॥

నయమున నాపతిని నాయింటికిరాకుండా
బయకారించితివిగా పదవమ్మా
పయిపడి యతనిచే బాసవెల్లఁ జేయించుక
జయముతోడుత నుండఁజాలనైతినమ్మా ॥ నీవే ॥

సటలకు నామగని జంటవాయక నన్నిట్టె
అటమటించితివిగా అవునమ్మా
నటనతో శ్రీవెంకటనాథుఁడు మ నిద్దరిని
యిటులనె సరిగా నేలెనోయమ్మా. ॥ నీవే ॥ 9

చి. శృ. 2 రే. 5 పా. పాడి

ఎంత సేసినాను ని న్నేమనేనురా
వింతదాననా యలిగి వెరపుచూపను ॥ పల్లవి ॥

యేదనైనా నిలిచి నీ వెవ్వతెతో నైన మాఁట
లాడుకొన్న నిన్ను నే నద్దలింతునా
యీడనుండె నన్ను నీ వెవ్వతె పేరఁ బిలిచినాను
కోడెకాఁడ నిన్ను నిట్టె కోపగింతునా ॥ ఎంత ॥

కలికివైన నిన్ను నేకాంతయింటఁ జూచినాను
చలము సాధించి నిన్ను సాధింతునా
సొలసి నీమేన నెవ్వతె సొమ్ము వెట్టు కుండినాను
పలుకుమాఁటలను నిన్ను గుంపింతునా ॥ ఎంత ॥

వన్నెకాఁడ యేరమణివాకిలిగాచున్నా నిన్ను
సన్న సేసి సారె సారె జంకింతునా
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవెకూడి నేఁడు
కన్నెనైన నామనంబు కరఁగఁ జేసితి. ॥ ఎంత ॥ 10

చి. శృ. 2 రే. 6 పా. ఆహిరి

ఇంతలో నందుకొనే వేమీ నీవు
యెంతసేతువో నీతో నీతో నిట్టె పొందుసేసిన ॥ పల్లవి ॥

తేలగిలఁ జూచితేనె తెలిసె నీమన సంటా
తాలిమితోఁదుత నన్ను దగ్గరేవు
పోలికగా నామేను పులకించినంతలోనె
ఆలిఁ జూచినట్టె చూచే వవునయ్య నీవు ॥ ఇంత ॥

ఆలవోకగా నీపే రడిగినయంతలోనె
చెలరేఁగి నీవావి చెప్పేవూ
జలకపుఁ జెమటలు సారె నామైఁ దొడమితె
వలపుచల్లి చొక్కించవచ్చేవు నీవూ ॥ ఇంత ॥

నవరనివాఁడ వంటా జాణతన మాడితేనె
రవళిఁ జెయిముట్టి సరస మాడేవు
నవకపు శ్రీవెంకటనాథ కాఁగిలించితేనె
కవకవనవ్వి రతిఁ గలసితి నీవూ. ॥ ఇంత ॥ 11

చి. శృ. 3 రే. 1 పా. ముఖారి

ఇన్నియు నేమి సేయునె యింపు లిన్నియునుఁ గూడి
కన్నెపాయాననె నన్నుఁ గలికిఁ జేయఁగను ॥ పల్లవి ॥

మన నేమి సేయునె మచ్చిక యీవలపులు
కొనసాగి లోలోనె గుబ్బతిలఁగా
తను వేమి సేయునె తతిగొన్న తమకము
వెనుకొని పొసిక పీరిడిఁ జేయఁగను ॥ ఇన్ని ॥

చూపు లేమి సేయునె సుడిగొన్న జవ్వనము
పై పైఁ దీపు లెక్కించి భ్రమయించఁగా
కోప మేమి సేయునె గురియైె యీ విరహము
[1]ఆపసోపాలె రేఁచి అలయించఁగాను ॥ ఇన్ని ॥

పులక లేమి సేయునె పోదియై పతికాఁగిలి
కళలలోని మర్మాలు గలఁచఁగాను
చెలువ మేమి సేయునె శ్రీవెంకటనాథుఁడు
సొలపులరతిఁ గూడి చొక్కించఁగాను. ॥ ఇన్ని ॥ 12

చి. శృ. 3 రే. 2 పా. కేదారగౌళ

వలపించనేరుతువు వడి నేఁచనేరుతువు
సిలుగు కోప నీవు సేసినట్టె సేయరా ॥ పల్లవి ॥

ప్రియముతోడుత నన్నుఁ బిలిచేవు । యీ ।
నయమె యీడేర నడపేవా
బయకారించే నీచే బడలితిని । నీ ।
చెయి మీఁ దింతె నీవు సేసినట్టె సేయరా ॥ వల ॥

దగ్గరి నాతో మంచితన మాడేవు । యీ ।
నిగ్గుల నీమే లిట్టె నిలిపేవా
వెగ్గళించే నీచేత విసిగితిని । నాకు ।
సెగ్గము గాదు నీవు సేసినట్టె సేయరా ॥ వల ॥

కలసితి నన్ను శ్రీవెంకటనాథుఁడా । నీ ।
తలఁపులో దయ నాపైఁ దప్పేవా (?)
యెలయింపు నీచేత నింతైతిని । నాపై ।
చెలిమిగలవు నీవు సేసినట్టె సేయరా ॥ వల ॥ 13

చి. శృ. 3 రే. 3 పా. కేదారగౌళ

చాలు నాతో నింతేసి జంపు లేలా
అలరి నీచేఁత లెవ్వరితోనైనఁ జేయరా ॥ పల్లవి ॥

---

1. "ఆపె" వ్రాసి "ఆప" అని దిద్దియున్నారు.

రాకాఁ బోకా నాతో నింతేసి రంతు లేలా
నీకు నీకె చుట్టరికములు నెరపేవు
నాకు నీకు నేమి వాదు నన్ను నవ్వేకానె
యేకమైన మాఁటలనె నన్ను నెలయించేవు ॥ చాలు ॥

సారె సారె నాతో నింతేసి పను లేలా
వూరకె నీవావులు దెలిపి వొరసేవు
తారుకాణమాఁటల నిక్కువ దాఁక నాడి
మేరమీరి యానలు వెట్టుతా మేకొనేవు ॥ చాలు ॥

మెచ్చి మెచ్చి నాతో నింతేసి మేకు లేలా
యిచ్చకము సేసి సేసి నన్ను యేలఁ జూచేవు
ఇచ్చలవిడిఁ గూడితి నన్ను శ్రీవెంకటనాథ
పచ్చిదేర నన్ను నింకా నొరఁబరచేవు. ॥ చాలు ॥ 14

చి. శృ. 3 రే. 4 పా. హిజ్జిజి

ఎటువంటివాఁడె యీతఁడు
యిటువలె దగ్గరీ నీతఁడు ॥ పల్లవి ॥

తలయెత్తి చూచితే తమఁ జూచితి నంటా
నెలయించవచ్చీ నీతఁడు
చెలులతోడ నేఁ జేసన్న సేసితే
నెలమి దగ్గరవచ్చీ నీతఁడు ॥ ఎటు ॥

యింతిఁ బిలిచితే యెరవరికము లేక
యింతలోఁ బలికీ నీతఁడు
చెంత నానకిపైఁ జేయివేయఁబోతే
యెంత కెంత చెయ్యొగ్గీ నీతఁడు ॥ ఎటు ॥

యెదుటనున్నసతితో నేకతము లాడఁబోతే
యిదివో కాఁగిలించీ నీతఁడు
కదిసి యిప్పుడు శ్రీవెంకటనాథుఁడు నా
యెదలోనె పాయకున్నాఁ డీతఁడు. ॥ ఎటు ॥ 15

చి. శృ. 3 రే. 5 పా. కేదారగౌళ

పదఁతి నీయాసనె బతి కున్నది
యెదయక నీవింక నెట్టయినాఁ జేయుమీ ॥ పల్లవి ॥

గుబ్బలమీఁదఁ జెలి కొంగు వేయదు
విబ్బరపుమోహమున నిన్నుఁ దలఁచి
గబ్బియైన మరునిచే [1]కాఁకలు బెట్టు
అబ్బురపు విరహమూ నాఁపలేక వున్నది ॥ పద ॥

పొలఁతి మేనఁ గస్తూరి పూయ నొల్లదు
నెలకొన్న వలపుల నిన్నుఁ దలఁచి
కలువ[2]బాణాలచేతిగాసియూ బెట్టు
బలిమైన తాపముల బారిఁ బడి యున్నది ॥ పద ॥

సతి నీవు గూడఁగాను సంతసించెను
గతియైన శ్రీవెంకటనాథుఁడా
యితవైన పాయము నీ కెక్కాసు నేఁడు
సతతము నిన్నుఁ గూడి చల్లనై వున్నది. ॥ పద ॥ 16

చి. శృ. 3 రే. 6 పా. శంకరాభరణం

తగు నీకు నాకును దయ్యమె కూరిచినాఁడు
నగవుల సరసాలె నయమాయ మనకు ॥ పల్లవి ॥

జూటుఁజూపులనె నన్నుఁ జూచేటి వోజవరాల
సూటి నామనసు నీపైఁ జోటు గైకొనె
నాటుకొన్నతమకము నాకు నీకు నొక్కపాటె
యేటలమాయల యెర వేఁటి కింక మనకు ॥ తగు ॥

ఆసమాఁటలనె నన్ను నద్దలించే వోయింతి
వాసి నామోహము నీతో వావి గలసె
యీసుల మరునికాఁక యిద్దరికి నొక్కసరె
వేసాలజగడముల వేఁగ వేల మనకు ॥ తగు ॥

---

1. "కాఁకలు" వ్రాసి "కాఁకలు" అని తిద్దియున్నారు.
2. "బాణాల" వ్రాసి "బాణాల" అని తిద్దియున్నారు.

వలపులు చల్లి నన్నె వలవఁ దీసేటి కాంత
చెలిమి నే నీతోడఁ జెపితి విట్టె
వలువైన శ్రీవెంకటనాథుఁడ విన్నుఁ గూడి
వులుకు లేక వుండఁగా నొవగూడె మనకు. ॥ తగు ॥ 17

చి. శృ. 4 రే. 1 పా. కాంభోది

నాలితనా లేఁటికోయి నారసింహుఁడా
నాలోనె నవ్వు వచ్చీ నారసింహుఁడా ॥ పల్లవి ॥

చేరువవి ప్రియములు చెప్పి చెప్పి నామీఁద
నారువోసేవు వలపు నారసింహుఁడా
[1] దారాసుద్దపుమాఁటలు తాఁకనాడి మదనువి
నారసాలు సేయకు నారసింహుఁడా ॥ నాలి ॥

వెనుకొవి నా వెంట వెంటఁ దిరిగి నామీఁద
నసువు మోపు గట్టేవు నారసింహుఁడా
కనుచూపులనె వట్టి కాఁక రేఁచి మెత్తనైన
నవలు వాఁడిసేయకు నారసింహుఁడా ॥ నాలి ॥

చిలుకుగోళ్ల నన్నుఁ జెనకుచు నీపై నా
నలు వెట్టె వచ్చేవు నారసింహుఁడా
కలికితనాన శ్రీవెంకటనాథ కూడితివి
వలువై వోఁగునూతుల నారసింహుఁడా. ॥ నాలి ॥ 18

చి. శృ. 4 రే. 2 పా. ఆహిరి

మిక్కిలి నేరుపరివి మేలు మేలోయి
గుక్కనివలపుల వో కోన చెన్నరాయఁడా ॥ పల్లవి ॥

గారవించి నామనసు కరఁగించ వచ్చేవు
వారకపు వలపుల దేవరవు గావా
పేరడి నీపెనపుల ప్రియములనె నన్ను
కూరిమి గొసరెటి వో కోన చెన్నరాయఁడా ॥ మిక్కిలి ॥

---

1. "దారామద్దపు" వ్రాసి "దారామద్దపు" అని దిద్దియున్నారు.

మెచ్చి మెచ్చి నాతో నమ్మికమాఁట లాడేవు
తచ్చన వినయాల యాతఁడవు గావా
ముచ్చట నీజాణతనములనె నామీఁద గుది
గుచ్చేవు మాయ లెల్లాఁ గోన చెన్నరాయఁడా ॥ మిక్కిలి ॥
యెన్నికసరసాల నా కిచ్చకాలు సేసేవు
కన్నెవలపువేడుకకాఁడవు గావా
నన్ను నిదె శ్రీవెంకటనాథుఁడ కూడితివి
కొన్నదె కోలిఁక నీకుఁ గోన చెన్నరాయఁడా. ॥ మిక్కిలి ॥ 19

చి. శృ. 4 రే. 3 పా. మలహరి

చల్లరవెట్టుఁ జేఁతల చొక్కనాథుఁడు
వుల్లములో నీ నెలఁదలూరి చొక్కనాథుఁడు ॥ పల్లవి ॥
అద్దమరాతిరికాడ నంటువడి వచ్చి తాను
సుద్దు లేమి పచరించీఁ జొక్కనాథుఁడు
వద్దు వొమ్మనవె రేపువచ్చుఁ గాని యిప్పు డేల
వొద్దికి వచ్చీ నెలఁదూరి చొక్కనాథుఁడు ॥ చల్ల ॥
మిక్కిలిఁ దా నెక్కడనో మీఁదువోయి వచ్చి నేఁడు
చక్కటు లేమి చెప్పీనె చొక్కనాథుఁడు
పెక్కు లేల నేనె పిలిపించఁగా వచ్చీ
వొక్కటిగా నీ నెలఁదలూరి చొక్కనాథుఁడు ॥ చల్ల ॥
యిప్పుడె తా నెవ్వతెకో యెంగిలియై వచ్చి యిట్టె
చొప్పులు మాప వచ్చీనె చొక్కనాథుఁడు
కప్పురపుమోవి శ్రీవెంకటనాథుఁడె నన్ను
వొప్పుగాఁ గూడె నెలఁదలూరి చొక్కనాథుఁడు. ॥ చల్ల ॥ 20

చి. శృ. 4 రే. 4 పా. మేచబౌళి

సింగారపుమేనిచెలువరి యింత
చెంగలింతురా చెలువరీ ॥ పల్లవి ॥

నెఱతనా లూరకె నెరపుచు । యిట్టె ।
చిఱునవ్వు నవ్వేవు చెలువరీ
తఱి నగి నగి వావి దగిలేవు । అంత ।
చెఱఁగు ముట్టకువోయి చెలువరీ ॥ సింగా ॥

విలువున మోహము నింపుచు । మాపై ।
చిలికించేవు చూపు చెలువరీ
నెలవైన మాఁటలె నిజ మయ్యాని । మాకు ।
కెలవు సేయకు వోయి చెలువరీ ॥ సింగా ॥

వొక్కటిమాఁటల నొడఁబరచి । నా ।
చెక్కు నొక్కకు వోయి చెలువరీ
గక్కన శ్రీవెంకటనాథుఁడా । నీకుఁ ।
జిక్కితి కాఁగిట చెలువరీ. ॥ సింగా ॥ 21

చి. శృ. 4 రే. 6 పా. సాళంగనాట

దొరవు నిన్నేఁగా దని దూరవచ్చునా
అరిదిపడేము గాక యాదవనారాయణా ॥ పల్లవి ॥

విమ్మపంట వేయగాను నిక్కము వచ్చే వని
నమ్మితిఁగా యాదవనారాయణా
చిమ్మల నాచూపులకు చిక్కినట్టె వుండితివి
అమ్మరో యింత సేతురా యాదవనారాయణా ॥ దొర ॥

పువ్వులు నీ వంపఁగాను పులకించి సంతోసాన
నవ్వితిఁగా యాదవనారాయణా
దవ్వులనుండె నాకు దక్కినట్టె వుండితివి
యొవ్వనపుమదమున యాదవనారాయణా ॥ దొర ॥

యింటికి నీవె రాఁగా యిప్పు డిట్టె భ్రమసితి
నంటుఁజూపుల యాదవనారాయణా
వెంట వెంటఁ దిరిగి శ్రీ[illegible]నాథుఁడవై
అంటుకొని కూడితివి యాద[illegible]యణా. ॥ దొర ॥ 22

చి. శృ. 4 రే. 6 పా.      రామక్రియ

వద్దు నాతో వెచ్చి వేవని మాయలు
 వుద్దండపు వో సంబటూరి చెన్నరాయఁడా ॥ పల్లవి ॥

అమ్మమీఁద నానవెట్టి ఆసవుట్ట మాఁటలాడి
 నమ్మించ వచ్చేవు నాకుఁ గొత్తలా
 సమ్మతి నీ వలపుల సతులవద్దికె పోయి
 యెమ్మెలు నెరపేవారి నెలయించవయ్యా ॥ వద్దు ॥

మానము సోఁకనాడి మచ్చిక బాస లిచ్చేవు
 యీనెపా లెల్లా నే నెఱఁగనివా
 వూనినవేడుకల నీ వువిదలతోడుతను
 నీ నేరుపు పట లెల్లా నెరపవయ్యా ॥ వద్దు ॥

కాఁగిటికిఁ జేరఁదీసి కన్నుల మొక్కులు మొక్కి
 ఆఁగేవు నేఁ దెలియనిపనులా
 నాఁగువార శ్రీవెంకటనాథ నన్నుఁ గూడితివి
 యేఁగి వచ్చి యిట్టె మాయింట నుండవయ్యా. ॥ వద్దు ॥ 23

చి. శృ. 5 రే. 1 పా.      మాళవిగౌళ

తియ్యవిమాఁటలఁ దేలించేవూ
 వొయ్యారపు వూటుకూరి చెన్నరాయ ॥ పల్లవి ॥

పిలిచే వూరకె పిన్ననాఁటి పొందు
 గలవానివలెనె యాఁకటతోడ
 చలిమినె న న్నింత సందడి పరసాల
 వులికించకు వూటుకూరి చెన్నరాయ ॥ తియ్య ॥

[1]చెనకే వూరకె చేవమీరి కడు
 చనవరివలెనె ముచ్చటతోడ
 పెనఁగుచు నీ విట్టె ప్రియములు నెరపేవు
 పునుపుఁజేతఁల వూటుకూరి చెన్నరాయ ॥ తియ్య ॥

---

1. "చెనకేవూరకె" వ్రాసి "చెనకేవూరకె" అని తిద్దియున్నారు.

తివిరే వూరకె దిట్టతనమునను
కవగూడే ననుచు నక్కారతోడ
నవకపు శ్రీవెంకటనాథ నన్నుఁ గూడి
తువిదలలో నూటుకూరి చెన్నరాయ. ॥ తియ్య ॥ 24

చి. శృ. 5 రే. 2 పా. దేసాళం

నేఁడు నీచేఁత లెల్లా నీ వెరఁగవా
నీడనుండె యలసేవు నీ వెరఁగవా ॥ పల్లవి ॥
వేమారు నాచేత వెళ్లనాడించ నేఁటికి
నీమనసులోని కల్ల నీ వెరఁగవా
దీమసానఁ బెక్కిండ్లు దిరిగి వచ్చేవాఁడవు
నేమపు నీగుణములు నీ వెరఁగవా ॥ నేఁడు ॥
గుట్టున నుండక నాకుఁ గోపము రేఁచ నేఁటికి
నెట్టన నీనడవడి నీ వెరఁగవా
చుట్టాలసురభి వని నోఁకనాడినంతలోనె
నిట్టచూపులు చూచేవు నీ వెరఁగవా ॥ నేఁడు ॥
పన్ని నీనిజము లీడఁ బచరించ నేఁటికి
నిన్నటి నీసుద్దు లెల్లా నీ వెరఁగవా
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవె కూడి
నిన్ను నన్ను మెచ్చేవు నీ వెరఁగవా. ॥ నేఁడు ॥ 25

చి. శృ. 5 రే. 3 పా. రామక్రియ

మేలు మేలె నిన్ను నీవె మెచ్చుకొనవే
కోలుముందై నపనులకు కొంకఁ దగునా ॥ పల్లవి ॥
పచ్చిగా గుబ్బలమీఁదిపయ్యద జారినందుకు
యెచ్చరించితేఁ గోపించే వేమాయనే
కచ్చుపెట్టి యింత వాసి గలదానవు నీవు
మెచ్చి మెచ్చి నన్నుఁ జూచి మెయి మరవఁ దగునా ॥ మేలు ॥

అక్కరైన మోహముతో నరగన్ను మొగిచినందు
కిక్కు వంటితేఁ గోపించే వేమాయనే
చిక్కక మనసులోన సిబ్బితి గలదావవు
గక్కన నాయెదుటను కరఁగఁగఁ దగునా ॥ మేలు ॥

పొంతనె నామోము చూచి పులకించినందుకు
యెంత నేఁ జేసినా నందు కేమాయనే
కంతునికేలిని శ్రీవెంకటనాథుఁడఁ గూడఁగా
వంతుకు నీ కింత పరవశము గాఁ దగునా. ॥ మేలు ॥ 26

చి. శృ. 5 రే. 4 పా. సాళంగనాట

రచ్చ కెక్కితివి పండరంగివిఠలా
పచ్చిదేరే వింతలోనె పండరంగివిఠలా ॥ పల్లవి ॥

గుట్టుగల దొర వని కొసరి చూచినంతనె
రట్టుగా నవ్వేవు పండరంగివిఠలా
మట్టుమీరి తమకపు మాఁటలనె నీవలపు
బట్టబయలె సేసేవు పండరంగివిఠలా ॥ రచ్చ ॥

సొగినసబలలోన సన్న సేసినంతలోనె
రాగిదేలించేవు పండరంగివిఠలా
వేగిరపుఁ జేఁతలనె విరివి నీ మోహ మెల్ల
బాగుగా వెళ్ల వేసేవు పండరంగివిఠలా ॥ రచ్చ ॥

తతి నీ వున్నచోటికి దగ్గర వచ్చినంతనె
రతిఁ గూడితివి పండరంగివిఠలా
గతి యైన శ్రీవెంకటనాథ యేలితివి
పతివై కోవిలకుంట్ల పండరంగివిఠలా. ॥ రచ్చ ॥ 27

చి. శృ. 5 రే. 5 పా. శంకరాభరణం

చెల్లె నీవు సేసినట్టి చేఁత లెల్లాను
కొల్లలై కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥ పల్లవి ॥

అసము దించక మాఁటలాడేవు గాక నాకు
వసమయ్యేవా యింతవన్నెకాఁడవు
కసిగాటువలపుల గబ్బివైన నిన్ను నేల
కొసరేఁ గోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥ చెల్లె ॥
సడికి వెరచి నాతో సరసమాడేవు గాక
తొడరేవా నీ వింత దొడ్డవాఁడవు
విడువని పొందులతో విఱ్ఱవీఁగేనీకు నేల
కొడిమె కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥ చెల్లె ॥
బాసకు వెరచి నన్నుఁ బైకొని కూడితి గాక
ఆసగద్దా నీకు నింత అందగాఁడవు
వేసారవు రతుల శ్రీవెంకటనాథ వొకరి
కోసమా కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా. ॥ చెల్లె ॥ 28

చి. శృ. 5 రే. 6 పా. నాదరామక్రియ

వేవేలుచేఁతలవాఁడు వీఁడె వీఁడె
దేవుఁడుగదె ప్రసన్న తిరువెంగళప్పఁడు ॥ పల్లవి ॥
యిద్దరు సతులు తన యిరువంకలఁ గొలువ
గద్దెన చూపులనె కరఁగింపుచు
అద్దరిపాటు సేసి ఆయములు ముట్టీని
తిద్దినగోళ్ల ప్రసన్న తిరువెంగళప్పఁడు ॥ వేవేలు ॥
కామినులు నలువంక కదిసి సేవలు సేయ
సామపు మాటలనె యాసలు సేయుచు
దోమటి చెనకులనె దుండగాలు సేసీని
దీమసముతో ప్రసన్న తిరువెంగళప్పఁడు ॥ వేవేలు ॥
అలమేలుమంగ దన కాకుమడి చియ్యఁగాను
నొలపులమాఁటలనె చొక్కింపుచు
నలువై శ్రీవెంకటనాథుఁడై కూడినవాఁడు
తెలిఁగన్నుల ప్రసన్న తిరువెంగళప్పఁడు. ॥ వేవేలు ॥ 29

చి. శృ. 6 రే. 1 పా. సామంతం

ఇన్నాళ్ల నీవుగావో యెప్పటి నేనె కానో
వెన్నుఁడ నీచేఁతలె వింత లింతే కాక ॥ పల్లవి ॥

దాఁపరాని చెక్కుగోరు తలపించె నీగుణాలు
మాపుదాఁకాఁ దెలుపఁగ మావసమా
ఆఁపరాని తమకాన అపె నీమోహ మెల్లా
రూపు నేయఁగా నింత రూఢి కెక్కెఁ గాక ॥ ఇన్నాళ్ల ॥

అంటినమోవిపై కెంపె అంగమచ్చ మాయఁగాక
నంటునఁ దారుకాణించ నావసమా
యింటికాడ నిన్ను నాపె యెనసిన భోగ మెల్లా
వెంట వెంటనె వెల్లవిరి నేసెఁ గాక ॥ ఇన్నాళ్ల ॥

విడువనివాసనలె వెలయించె నీపొందులు
వడి నీతో వాదించ వసమా నాకు
కడువేగ శ్రీవెంకటనాథ నీవె నన్ను
వొడఁబరచి కాఁగిట నొక్కటై కూడితివి. ॥ ఇన్నాళ్ల ॥ 30

చి. శృ. 6 రే. 2 పా. శంకరాభరణం

వలపులకలగంప వాని కేమె
వలరాజుఁ గన్నతండ్రి వాని కేమె ॥ పల్లవి ॥

వాడికగాఁ దానె యెవ్వతెనైనా వలపించు
వాడనివాసనపువ్వు వాని కేమె
వోడఁ డెందరికినైనా వుత్తరువె చెప్పని
వాడమగువలవిందు వాని కేమె ॥ వలపు ॥

తగిలి యెక్కడనైనాఁ దనమేలె చూచుకొను
వగలమగతుమ్మెద వాని కేమె
తగిన ట్టిందరితోడఁ దరితీపులె నేసు
వగకాఁ డల్లారుముద్దు వాని కేమె ॥ వలపు ॥

యెనసి యెక్కడనైనా యిచ్చకమె నేసుకొను
వనితలపెనుబాఁతి వాని కేమె
ఘనుఁడు దానె శ్రీవెంకటనాథుఁడు వచ్చి
వనజాక్షి నను( గూడె వాని కేమె. ॥ వలపు ॥ 31

చి. శృ. 6 రే. 3 పా. ముఖారి

తమకపడ నేఁటికి దాని కేమి దోసమా
అమర మన సిచ్చి మాఁటాడవయ్య విభుఁడా ॥ పల్లవి ॥
మోవనాడి పిలిచినా మోనాన నున్నాఁడవు
చేవల నామాఁటలకు సిగ్గాయనో
మావంటివారితోఁడ మాఁటాడవల దని
మోవిమీఁద నెవ్వతైనా ముద్ర వెట్టెనో ॥ తమక ॥
కాతరానఁ జెనకినా కడుఁగడుఁ జొక్కేవు
ఘాతల నాచేఁత లేమి కళ లంటెనో
జాతిగా మాతోఁడుతను సరస మాడకు మని
చేతుల నెవ్వతైనా లచ్చెన వెట్టెనో ॥ తమక ॥
కమ్మి నే నిన్నుఁ గూడఁగా కప్పుకొనేవు నాకొంగు
యిమ్ముల నీ కిది దానె యితవాయనో
నమ్మి కిచ్చి శ్రీవెంకటనాథ వెనకదినాల
రొమ్ముపై నెవ్వతైనా గురుతు వెట్టెనో. ॥ తమక ॥ 32

చి. శృ. 6 రే. 4 పా. ఆహిరి

నన్ను నేఁ బొగడుకొన్నా నాయము గాదు గాక
కన్నెనాటనుండి నీకెకాఁ బాటువడనా ॥ పల్లవి ॥
అయ్యో యింటివారిచే నారడిఁ బడితిఁగా
నెయ్యపు వలలఁ జిక్కి నీకొరకు
గయ్యాళి నావలపులు కతలై నిలిచెఁగా
వెయ్యైనాఁ దలఁచుకొంటె వెనకముందరికి ॥ నన్ను ॥

అక్కటా చెలులతోఁ గల్లానలు వెట్టితిఁగా
పక్కన నీవిచ్చినట్టి బాసలు నమ్మి
రొక్కమైన నాపొందులు రోఁకటఁ బాడిరిగా
దిక్కులు నిండెఁగా నీవు తెలియకుండినను ॥ నన్ను ॥

చెల్లఁబో యిందరిలోఁ బచ్చి సేయించుకొంటిఁగా
యిల్లు వెళ్ల నట్టి నీ యిచ్చకానకె
కల్ల లాడక శ్రీవెంకటనాథ కూడితివి
మల్లడి యీరతి మనమనసు లెరుఁగుఁగా. ॥ నన్ను ॥ 33

చి. శృ. 6 రే. 5 పా. పాడి

ఇంతేసి పొరుపత్తే లేమీ నీకు
అంతంతకు గరిసించే వత్తునా నే నీకు ॥ పల్లవి ॥

కూడఁ బారివచ్చి నా కుల మేల యడిగేవు
వేడుకకాఁడ నాతో వియ్య మందేవా
నాదొడిమాటనె నాపే రే లడిగేవు
చేడెలపైఁ బద్దెలు చెప్పుదువో నీవు ॥ ఇంతేసి ॥

సరసానఁ జెయివట్టి సత్తు [1]వేమి చూచేవు
బిరుదుకు నాతోడఁ బెనఁగేవా
సొరిది నాపై నోరచూపు లేమి చూచేవు
తిరిగి తిరిగి వంక దిద్ద వచ్చేవా ॥ ఇంతేసి ॥

ముద్దు ముద్దువలె నాకు మొక్కు లేమి మొక్కేవు
కొద్దిమీర నీవు నన్నుఁ గొలిచేవా
అద్దొ మండెమురాయఁడవై నన్నుఁ గూడితివి
గద్దరివైన శ్రీవెంకటనాథుఁడా. ॥ ఇంతేసి ॥ 34

చి. శృ. 6 రే. 6 పా. వరాళి

వలపేమి దాఁగునా వన్నెకాఁడ
అలవడి నీవెంత అణఁచఁ జూచినను ॥ పల్లవి ॥

---

1. "లేమి" స్థానే "వేమి" అని దిద్దియున్నారు.

గక్కన మొక్కకుంటేను కాంత నిన్ను దీవించునా
తక్కి మాతో సిగ్గువడి దాఁచేవు గాక
చక్కఁగా నవ్వకుండితె సరసము లాడునా
లెక్కించి మాకు వెఱచి లే దనేవు గాకా ॥ వల ॥

చెనకక నీవుంటె చెలి పూవుల వేసునా
[1]పొనిగి మాతో లే దని బొంకేవు గాక
గునిసి యరువకుంటె కొంగు నిన్నుఁ బట్టునా
తనివోని నీననుపు దాఁచేవు గాకా ॥ వల ॥

కన్నుసన్న సేయకుంటె కాఁగిట నిన్నుఁ బట్టునా
అన్నిటా మాతోడుతఁ దోశాదేవు గాక
వెన్నడించి యాపెను శ్రీవెంకటనాథుఁడ కూడి
మన్నించితి నన్ను నిట్టె మందెమురాయఁడవె. ॥ వల ॥ 35

చి. శృ 7 రే. 1 పా. రామక్రియ

తెఱవ లందరుఁ గూడి తిద్దిరిగా నిన్నును
మఱపు వెఱపు లేక మాకొరకుఁగానె ॥ పల్లవి ॥

కన్నులనె వలపించే [2]కాంతలు గలుగఁగా
పిన్ననాఁడె గుణములఁ బెద్ద వైతివి
మున్నిటివారి యధరముల తేనె సోఁకఁగా
తిన్నని నీమాటలకు తీపు లెక్కెను ॥ తెఱవ ॥

యిచ్చకాన సింగారించే యింతులు గలుగఁగా
కచ్చుపెట్టి యింత [3]వన్నెకాఁడ వైతివి
మచ్చికతోడ నందుకు మరిగి రాఁగాఁ గదా
నిచ్చలపుఁ బిల్లఁగోవి నెరజాణ వైతివి ॥ తెఱవ ॥

తరుణులు నీతో జాణతనము లాడఁగఁగా
గరువతనాన మాటకారి వైతివి
కరఁగి వారెల్లా శ్రీవెంకటనాథ కూడఁగాఁగా
పరువపు నారతి బెంబడి నోడ వైతివి. ॥ తెఱవ ॥ 36

1. "పొవిరి" వ్రాసి "పొనిగి" అని తిద్దియున్నారు. 2. "కాంతెలు" వ్రాసి "కాంతలు" అని తిద్దియున్నారు. 3. "వెన్న" వ్రాసి "వన్న" అని తిద్దియున్నారు.

చి. శృ. 7 రే. 2 పా. శంకరాభరణం

అన్నిటా నీదిద్దుబడె అది విచారించవయ్య
యెన్నుకొని నన్ను నేర మెంచకుమీ అయ్యా ॥ పల్లవి ॥

నీవాళ్లి నేరము లెంచి నెరవాది నైతిఁ గాక
కావించి నేఁ దొల్లేమి కతకారినా
కోవరపు నీగుణాలు కోపము రేఁచెఁ గాక
కావలసి నేఁ దొల్లి గయ్యాళినా ॥ అన్నిటా ॥

సారె నీబాసతప్పులె చలపాదిఁ జేసెఁ గాక
నేరిచి నాయంత నేనె నిష్ఠూరినా
పేరడి నీయెడమాట పెచ్చు పెరిగించెఁ గాక
రారాఁపుల నేఁ దొల్లి రచ్చ కెక్కేనా ॥ అన్నిటా ॥

తక్కరి నీవిద్యలె దంటఁ జేసెఁ గాక నన్ను
గక్కనఁ దొల్లి కయ్యాన కాలు దవ్వేనా
కక్కసించి శ్రీవెంకటనాథ కూడితివి
లక్కవలెఁ గరఁగక లాఁతిదాననా. ॥ అన్నిటా ॥ 37

చి. శృ. 7 రే. 3 పా. సాళంగనాట

తగవో బలిమో నీతలఁపు నాతోఁ జెప్పర
నగుమోముతోఁ గధిరినాథ నీవు ॥ పల్లవి ॥

యేరా వొద్దన్న మాన విల్లురికి నాతోను
మీరి నవ్వేవు కోమటిమేనరికమా
వారము వజ్జ మనక వాకిట నన్ను నాఁగేవు
పోరచి మావారు నీకుఁ బోఁక వెట్టిరా ॥ తగవో ॥

కొంత గొంత కోపించిన కొంగువట్టి నాతోను
రంతులు సేసేవు నీకు రాచబలిమా
వంతుకు వాసికి నన్ను వావిదేరఁ బిలిచేవు
కొంతైనా మావారు నీవుంకువ వట్టిరా ॥ తగవో ॥

గబ్బినై యదలించిన కన్నుల మొక్కుచు నన్ను
గొబ్బునఁ గాఁగిలించేవు గొల్లదొమటా
అబ్బురపు శ్రీవెంకటాద్రినాథ కూడితివి
సిబ్బితివాయఁ బెండ్లి సేసిరా నీకూ. ॥ తగవో ॥ 38

చి. శృ. 7 రే. 4 పా. ఆహిరి

ఎందు కెందుకు గడించీ యిది యేమె
మందలించినదె మారుమాఁట లవునటె ॥ పల్లవి ॥
చెనకి నన్నుఁ బట్టఁగ చెయి విదిలించితేను
కొనగోరు దాఁకినదె కొస రవునటె
పెనఁగి తనపై నానపెట్టఁగానె లోఁగితేను
యెనసి తనచేఁతకు యియ్యకోలటె ॥ ఎందు ॥
వువ్వెళ్లార నవ్వఁగాను వూరకె కోపము రేఁగి
పువ్వుబంతి వేసితేనె పొం దవునటె
రవ్వగాఁ దా దూరఁగాను రాఁగతనానఁ దిట్టక
అవ్వల సిగ్గువడితె ఆస లవునటె ॥ ఎందు ॥
వెగ్గళించి తనుఁ దానె విడెము నా కియ్యఁగాను
దగ్గరి యందుకొంటేను తగు లవునటె
కగ్గు లేక శ్రీవెంకటనాథుఁడు గూడఁగ
అగ్గల మై కూడితేను ఆ లవునటె. ॥ ఎందు ॥ 39

చి. శృ. 7 రే. 5 పా. శంకరాభరణం

ఇది నీకె సమ్మతైతె యెవ్వరైనాఁ గాదనేరా
మదిలో నీ వేల కొంకు మానవో కాకా ॥ పల్లవి ॥
పొలఁతి యంపిన లేక బూతులు దొరలఁ బోలు
వెలయ నే మడిగినా వెళ్లనాడవు
యెలమి నాపె కానికె యెంగిలై యుండఁగఁ బోలు
సొలసి చెలులతను చూప వైతివి ॥ ఇది ॥

అతివంపిన యేకాంత మాయములు నోఁకఁబోలు
యితవై నీలోలోనె యిందుకొంటివి
సతి వంపిన పువ్వుల సవరము గాఁబోలు
తతి నేము దగ్గరిన దాఁచుకొంటివి ॥ ఇది ॥

కలికి దగ్గరితేను కాఁకలు రేఁగఁగఁ బోలు
చెలరేఁగి పానుపు చేరఁబోతివి
వెలయ నిన్నును శ్రీవెంకటనాథ కూడఁగా
మెలుఁత మించఁగఁ బోలు మెచ్చుకొంటివి. ॥ ఇది ॥ 40

చి. శృ. 7 రే. 6 పా. వరాళి

నీగుణా లేల మానీని నేనె వేసరఁ గాక
యేగతిఁ జెప్పినను నీయిచ్చ మానేవా ॥ పల్లవి ॥

పోరి పోరి నేఁ జెప్పిన బుద్ధు లెల్లా నీ వాపెఁ
జేరఁబోయి కానికగాఁ జెప్పకుండేవా
గోరసేసి నడుమను గోళ్లరాచి నీ వలపు
పేరడిగా జగడాలు పెంచకుండేవా ॥ నీగుణా ॥

అద్దలించి నేఁ బెట్టిన ఆన లెల్లా నీ వాపె
వొద్దఁ బోయి సూడిదెగా వొట్టకుండేవా
బద్దుల నేరుపు లెల్లా పచరించి నీ మోహము
పెద్ద సేసి కైలాటాలు పెట్టకుండేవా ॥ నీగుణా ॥

పాసి పోకు మని నిన్ను బలిమి నేనేఁ గొన్న
బాస లాపెకుఁ గప్పము పట్టకుండేవా
గాసి చేసి నిన్ను శ్రీవెంకటనాథ కూడితిని
ఆసపడి నీ వాపె నంటకుండేవా. ॥ నీగుణా ॥ 41

చి. శృ. 8 రే. 1 పా శ్రీరాగం

సంగతిగా మాఁటలాడ జాణ వౌదువె। నీ।
సంగతి గలదు గాన జాణనె పో యెప్పుడు ॥ పల్లవి ॥

యెక్కువఁ బయ్యెదలోని వేఁటివె యింతి ।అవి।
పక్కనె వలపు నించే పైఁడికుండలు
పెక్కువ మేడలమీఁదఁ బెట్టవచ్చుఁబో ।నీవు।
మిక్కిలి నెప్పుడు నుండె మేడవో నాదేహము ॥ సంగతి ॥

హెచ్చె నీమైఁ బులక లివేఁటికె యింతి ।అవి।
ముచ్చట మోహపునోము మొలకలురా
పెచ్చుగా దేవరమీఁదఁ బెట్టవచ్చుఁబో ।నీవె।
వచ్చి వరము లిచ్చే దేవరవెపో నాకును ॥ సంగతి ॥

యినుమడించెఁ జెమట లేఁటికె యింతి ।రతిఁ।
దనివోని కళలెల్ల దైలువారెరా
అనువై అట్లానైతె అగ్గువాయఁబో ।నన్ను।
ఘనమై కూడితి శ్రీవేంకటనాథుఁడా. ॥ సంగతి ॥ 42

చి. శృ. 8 రే. 2 పా. శంకరాభరణం

ఎంచి మీచుట్టరికము లిందులోఁ దెలుసుఁగా
మించి నడచితి రైన మీకు మీ యాన ॥ పల్లవి ॥

యేలా చల్లనిగాలి యింతి నేఁచ నేఁటికి
జాలి రేఁచితైన నీకు చందన మాన
మేలిమి తుమ్మిదలాల మెలుఁత వోరువ లేదు
కోలుముందై కూసిన మీకులము నాన ॥ ఎంచి ॥

మదనుఁడా చెలిమీఁద మానవయ్య కోపము
పదరితి వైన పంచబాణము లాన
పొదలినా చందమామ పున్నమవెన్నెల గాసి
కదిసి యెంచితి వైన కలువ లాన ॥ ఎంచి ॥

చక్కని కోవిలలాల జవరా లోపఁగ లేదు
చిక్కని కూఁత రేఁచితే చిగురు లాన
గక్కన నింతివి శ్రీవెంకటనాథుఁడు గూడె
మక్కువ నిందరికివి మానితి నాన. ॥ ఎంచి ॥ 4

చి. శృ. 8 రే. 3 పా. పాడి

ఆతఁ డేమి దవ్వుగాఁడు అతివ ప్రాణనాథుఁడె
సీతితోడ వానిఁగూర్చి నెలఁతఁ గావఁగదరే ॥ పల్లవి ॥

చల్లనైన గాలిచేత జాలిరేఁచె వలపు
పిల్లఁగోవి వట్టి వాఁడు పెచ్చురేఁచెనే
పొల్లవోని పూవులపుప్పొడి పోదిసేసెనే
వొల్లనన్నఁ బోదు దీని కోమరమ్మ చెలులు ॥ ఆతఁడే ॥

రవ్వలైన వెన్నెలల రాఁపాయ మోహము
నవ్వి నవ్వి వాని చూపు నాముడేఁచెనే
కొవ్వినట్టి కోవిలలకూఁతచేఁత గనమాయ
యెవ్వ రేమి సేతు రిఁక యెదరమ్మ దీనిని ॥ ఆతఁడే ॥

మదను పూవుటమ్ము సోఁకి మదము రేఁగె ప్రేమము
కదిసి విభుఁడు మోము చూపి కళలు రేఁచెనే
యిదివో శ్రీవెంకటనాథుఁ డింతి నిట్టె కూడినాఁడు
చెదరనట్టి వేడుకెల్ల చెందెనమ్మ యింతికి. ॥ ఆతఁడే ॥ 44

చి. శృ. 8 రే. 4 పా. సామంతం

వెలఁది నీ చెమటలె వెల్లవేయఁగా
తలఁగి నేఁ జెప్పకుంటే దాఁగఁబొయ్యీనా ॥ పల్లవి ॥

సంగతి నీమోహ మెల్లా సకితోఁ జెప్పఁగఁ బోతే
అంగడిఁ బెట్టకు మని అనవెట్టేవే
దొంగిలి గజ్జలపేరు తొలఁగఁ బెట్టఁగఁ బోతే
వెంగలితనమె కాక వినక మానేరా ॥ వెలఁది ॥

యీకడ నీ విరహము యింతితోఁ జెప్పఁగఁ బోతే
కాకు సేయ వద్దంటా కన్ను గీఁటేవే
పైకొని కన్నులు మూసి పాటు దాఁగఁబోతేను
సోకగా వింటివారు చూడక మానేరా ॥ వెలఁది ॥

జిగి విభునిఁ దెమ్మని చెలులతోఁ జెప్పఁబోతే
[1]అగడు సేయకు మని ఆన వెట్టేవే
నగుతా శ్రీవెంకటనాథుఁడె తా నిన్నుఁ గూడె
చిగిరింపుఁ గోరికల చేఁత దాఁగీనా. ॥ వెలఁది ॥ 45

చి. శృ. 8 రే. 5 పా. వరాళి

తెలిసినమాఁట తేటతెల్లమిగాఁ జెప్పేను
తలిరుఁబోణి విభునిదండ నుండవలెనా ॥ పల్లవి ॥

ముదిత మేని పులక మొలకలు పన్నీటి
పదనునఁ దీఁగెలువారీఁ జుండీ
కదిసి వోచెలులాల గందవొడి పొదిచేత
అదన నవియుఁ బొదలయ్యీఁ జుండీ ॥ తెలిసి ॥

చెలి చనుఁగొండలపై చెమట వూట వూఁదేనె
నలుకఁగాఁ గాలువలయ్యీఁ జుండీ
కలికికోరికలచే కన్నుల నీరు గూడఁగా
యిలపై మదనుపేరి టేరులయ్యీఁ జుండీ ॥ తెలిసి ॥

కాంతమదిలోఁ బతిఁ గడు గడుఁ దలఁచఁగా
అంతటా నాతఁడె తా నయ్యీఁ జుండీ
వింతగా నింతిని శ్రీవెంకటనాథుఁడు గూడె
పంతమునఁ జెలికిఁ దాపము మానెఁ జుండీ. ॥ తెలిసి ॥ 46

చి. శృ. 8 రే. 6 పా. వరాళి

ఆపె యెరుఁగును నీ వన్నియూ నెరుఁగుదువు
రేపు మాపు నే నెచ్చరించేనా విభుఁడ ॥ పల్లవి ॥

చిలుకచే మాఁటలు చెప్పించి మరు
చిలుకలపాలుగఁ జేయ నేల
కల గని లేచి లేకలు వ్రాసి కాఁ
కలఁ బొరలుచునె నీకడ కంపెఁ జెలియా ॥ ఆపె ॥

1. "అగ్గడు" వ్రాసి క్రింద గ వత్తును తేలికగా చెరిపి "అగడు" అని తిద్ది యున్నారు.

కడువేగ ముదుర వుంగరమె యంపి మరు
కడివోని బాణాలఁ గాఁచ నేల
బడి బడి విరహావఁ బడలేక మా
పడఁతి నీకుఁ జిత్తరుపట మంపె నిదివో ॥ ఆపె ॥

విందువలెఁ గప్పురపు విడె మిచ్చి గో
విందుఁడ వయిన శ్రీవెంకటనాథ
కందు లేనివేడుక నాకందుకొని నీ
కందువ లంటి కూడెఁ గాంతయు ని న్నిపుడూ. ॥ ఆపె ॥ 47

చి. శృ. 9 రే. 1 పా. కేదారగౌళ

ఎందరి దూరె యెవ్వరి వేఁడె యెంతవి వేగించేనె
పొందు దలఁచుక వచ్చెనా వానిచే పుణ్యమింతే కాక ॥ పల్లవి ॥

పుక్కిలిబంటి కాఁకలలోనె పొద్దువోవు టెట్లే
యెక్కువైన నా మోహము చెలులూ నెరఁగ రేమందునే
వొక్కనిమిషము వానిఁ బాసి నే వోరువఁ గల నటే
మొక్కశీఁడయిన మరునమ్ములకు మొకమోట గలదా ॥ ఎంద ॥

తలమునుకల విరహము నే ధరియించు టెట్లే
వల పెరిఁగియు సకులు మీరైన వానిఁ దే రేమందునే
[1] అలిగినవానిఁ బాసి నిమిషము ఆఁపఁ గల నటవే
దళమై కప్పెటి పూవుటమ్ములకు దయగల దటవే ॥ ఎంద ॥

ఇట్టె యీఁదరాని తమకమునె యీదేరే దెట్లే
వొట్టిన నా కాఁక లెరిఁ గింతు లూరకున్నా రేమందునే
నెట్టన శ్రీవెంకటనాథుఁడు నేఁడు నన్నుఁ గూడెనే
గట్టిగ నాయింట కాఁపుర మున్నాఁడు కడమలున్న వటే. ॥ ఎంద ॥ 48

చి. శృ. 9 రే. 2 పా. పాడి

ఆతవినె దూరరమ్మ అలుగ కుండిన నాఁడు
యీతల నాతల నివి యితవుగా కుండెనా ॥ పల్లవి ॥

1. "అరిగి" వ్రాసి "అలిగి" అని శిద్ధి యున్నారు.

పున్నమచందురుఁడు దప్పులురేఁచఁ బగవాఁడ
ఇన్నిటా నా విభుఁడె గు రింతె కాక
సన్నపుఁ జల్లనిగాలి జాలి రేఁచఁ బగవాఁడ
మన్నమగఁడు సేసిన మతకము గాక ॥ ఆతనివె ॥

కమ్మని పువ్వులు మేను కాఁడిపార సూడు గద్దా
చిమ్ముల నా రమణుని చేఁతలె కాక
దొమ్మిసేసి తుమ్మెదలు తొలియాడ వైరులా
నమ్మించి బాస దప్పిననాథుఁ డింతె కాక ॥ ఆతనివె ॥

ముప్పిరి మరుఁడు కాఁక ముంచఁగ దోసమువాఁడ
యెప్పుడు నీచేఁతలు ప్రాణేశువె కాక
కప్పుచు నన్నును శ్రీవెంకటనాథుఁడు గూడె
అప్ప టప్పటిచేఁతలు ఆతనివె కాక. ॥ ఆతనివె ॥ 49

చి. శృ. 9 రే. 3 పా బౌళి

నీ వేమి సేతు వాపె నిన్నుఁ బెరరేఁచఁగాను
తావుల సాకిరి గోరఁ దగదా నిన్నును ॥ పల్లవి ॥

పోరాదే వాపెకుఁగా పూనుక నీవు రాఁగా
మేరతోఁ జుట్టా లెల్లా మెచ్చకుందేరా
సారె సారెఁ బిరిదూరి సాకిరులు చెప్పఁగాను
తీరిచేటి చెలు లెల్ల దీవించకుందురా ॥నీవేమి॥

కన్నుగీఁటాపెకు నాకుఁ గై లాటాలు వెట్టఁగాను
కన్న విన్న వారెల్లాఁ బొగడకుందేరా
మన్నించి యాపెకు నీవు మాఁట లందియియ్యఁగాను
సన్నల వాడవా రెల్లా సంతసించకుందురా ॥ నీవేమి ॥

సందడి జగడాలలో సారె నన్నుఁ బట్టఁగాను
అందరును నిన్నె మే లనకుందేరా
ఆంది శ్రీవెంకటనాథ ఆపెను నన్నుఁ గూడితి
విందరు నీచేఁత లివి యెంచకుందేరా. ॥ నీవేమి ॥ 50

చి. శృ. 9 రే. 4 పా. వరాళి

నీ వేల వత్తువయ్యా నెలఁతఁ బాసి
మావంటివారు నీకు మనసయ్యేరా ॥ పల్లవి ॥

ఇప్పటికి మాతోడ యిచ్చక మాడేవు గాక
తప్పరాని బాస నీవు దాఁటఁ గలవా
అప్పసమై తలఁపెల్లా ఆపెకుఁ గుదువవెట్టి
దెప్పరమై మావెంటఁ దిరుగ నోపుదువా ॥ నీవేల ॥

నిక్కమువంటి మాఁటలే నెరపేవు గాక నీవు
వొక్కమనసై యీడ సుండఁ గలవా
అక్కజపు నీమేను ఆపెకు మీదు(దీ?)చ్చి
యిక్కడ మాతోఁటిపొందు యితవయ్యీనా ॥ నీవేల ॥

ముచ్చట నేసుక మాతో మొగమోడే వింతే పక్క
మచ్చికయాపె కాఁగిలి మాన గలవా
కచ్చుపెట్టి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యెచ్చరిక నిట్టె మాయింటికి రాఁగలవా. ॥ నీవేల ॥ 51

చి. శృ. 9 రే. 5 పా. దేసాళం

కలితె నానతీవయ్యా కానిదానికి నేమి
చెలరేఁగి ఆపె మాఁట చెల్లించేఁ గాని ॥ పల్లవి ॥

వెడ్డువెట్టి నే నిన్ను వేడుకతోఁ గొసరఁగా
అడ్డాలు వచ్చీ నాకంటే నంత చుట్టమా
వొడ్డినగర్వాన నాతో వొరగోసుకొన్నది
సడ్డలాడి నీ వింత చనవు లిచ్చితివా ॥ కలితె ॥

బాసగొని నే నిన్ను పైపైఁ బలుకఁగాను
యీసడించీ నాకంటే యితవరా
గాసిలి మచ్చరాన నీకాంత మాసటీనవలె
నేసిన చేఁతల కల్లా చెల్లుబ డిచ్చితివా ॥ కలితె ॥

యీపొద్దె నిన్ను మాయింటికిఁ దోడుక పోఁగా
కోపగించీ నాకంటెఁ గూరిచినదా
కైపు గాక నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
పై పై నాపెకుఁ బారుపత్యము లిచ్చితివా. ॥ కలితే ॥ 52

చి. శృ. 9 రే. 6 పా. పాడి. అటతాళం

కాదని వేగిరించితే కరఁగీనా అతఁ డేమి
వాదు మాని వచ్చినట్టె వచ్చేదె చాలును ॥ పల్లవి ॥

మాఁట లాడించకురే మదనమంత్రాలు దప్పి
నేఁటిదాఁకా నాపెవద్ద నేరిచినవి
నీటుతోడ నాతనిని నిండునిధానమువలె
సూటిచూపుల మనము చూచేదె చాలును ॥ కాదని ॥

గందము పూయకురే యంగజునిముద్రలు మాసీ
కందువ నిన్నాళ్లదాఁకా గడించినవి
దిందుపడ నుపారము దేవరకుఁ జూపినట్టు
ముందర నన్నియుఁ బెట్టి మొక్కెదె చాలును ॥ కాదని ॥

మల్లాడి తియ్యకురె మన్మథయోగ మెడసీ
తొల్లియూ నాపెవలన దొరకినది
కల్ల గాదు నన్ను శ్రీవెంకటనాథుఁడె కూడె
చెల్లుబడి నీచనవు చేకొనేదె చాలును. ॥ కాదని ॥ 53

చి. శృ. 10 రే. 1 పా మాళవిగౌళ

మంచితనము ల దెట్టు మరచీనయ్యా
మంచముపై నున్న నెట్టు మరచీనయ్యా ॥ పల్లవి ॥

యెచ్చరించి వొక రొక రెనసి కూడుండేటి
మచ్చికలు చెలి యెట్టు మరచీనయ్యా
వచ్చినదాఁకాఁ దలవాకిటనె కాచుకుండే
మచ్చులచేఁత ల దెట్టు మరచీనయ్యా ॥ మంచి ॥

యిత వెరిఁ గాక రాక రిచ్చకాలు సేసేది
మతిలోనఁ జెలి యెట్టు మరచీనయ్యా
సతతము నౌందారుల జవ్వనమె కుదువైన
మతములు చెక్కె యెట్టు మరచీనయ్యా ॥ మంచి ॥
సంతసాన మనసులే సరిదాఁకినట్టి నీ
మంతనాలు చెలి యెట్టు మరచీనయ్యా
కాంతను నీవె శ్రీవెంకటనాథ కూడఁగాను
మంతు కెక్కె నిది యెట్టు మరచీనయ్యా. ॥ మంచి ॥ 54

చి. కృ. 10 రే. 2 పా. భైరవి

తనుపె యిక్కడఁ గాని తలఁ పెల్లా నక్కడనె
మనసులో నాపె వింత మానవైనఁ గలవా ॥ పల్లవి ॥
మాయింటాడ నిచ్చకపు మాఁట లాడే వింతే కాక
వోయీ నీ వాపెఁ బాసి వుండ నోపేవా
ఆయెలే మాముందటను ఆసము దించవు గాక
చేయార నీపె యాపెను చెనక కుండేవా ॥ తనుపె ॥
మానలేనివానివలె మన సరసేవు గాక
బొనా ఆపె వద్దించ కారగించేవా
తేనెలమాఁటలఁ దరితీపులు సేసేవు గాక
కాపీలె యాపెపై తమకమె పట్టఁగలవా ॥ తనుపె ॥
యీపొద్దుకు నాకాఁగిలి యింపాయ ననేవు గాక
పో పో నీవాపెఁ దలపోయ కుండేవా
కాపాడి నన్నును శ్రీవెంకటనాథ కూడితివి
మాపొందు లాపెవద్దను మఱవఁగఁ గలవా. ॥ తనుపె ॥ 55

చి. కృ. 10 రే. 3 పా. కాంబోది

ఇరుమొనసూది వని యింపు సేసుకుందుఁగాని
మరిగి నే మన సిచ్చి మాఁటలాడఁ జాలరా ॥ పల్లవి ॥

ఆపెతోఁ బురుడువెట్టి ఆడక వుండినఁ గదా
నాపై నీవల పెల్ల నమ్మి కుందును
చూపుల నాపె కెదురుచూడక వుండితేఁ గదా
చేపట్టి నాముచ్చటెల్లాఁ జెప్పుదు నీతోను ॥ ఇరు ॥

ఇచ్చక మాపె కాడక యీడనె వుండినఁ గదా
ఇచ్చిన నీబాస లెల్ల నియ్యకొందును
కచ్చుపెట్టి యాపెతో నేకతము మానినఁ గదా
తచ్చనలు మాని నీతో దగ్గరి నవ్వుదును ॥ ఇరు ॥

కడలు దొక్కక నాకాఁగిట నుండినఁ గదా
అడియాలముగఁ గళ లంటుదు నిన్ను
కడువేగ శ్రీవెంకటనాథ నీవె నన్ను
యెడయక వుండఁగానె యితవాయఁ గాకా. ॥ ఇరు ॥ 56

చి. శృ. 10 రే. 4 పా. నాదరామక్రియ

వేగిరమా నీవు విభుఁడవు నీ వెలఁదిని నేను
బోగకన్నుల నీసొలపుఁజూపులసొంపు నాకుఁ జాలదా ॥ పల్లవి ॥

చెలియ మునుపు సింగారించుకొన్న చెంగావిచీర యిది । నీవు ।
తలఁకక నేఁడు దట్టి గట్టుకొంటె దాని కేమి దోసమా
అలిగేనా నేను అందుండె మాఁటాడు అంటుకొన నోపను । అది ।
తలఁగ వేరొక్కతావునఁ బెట్టిరా దగ్గరుందు గాని ॥ వేగి ॥

కందువతో నాపె కస్తూరి పూయఁగ గట్టిబేఁటులు రాలితే । నీవు ।
పొందు చెడకుండ బొట్టు వెట్టుకొంటె బోగానకుఁ గడమా
వింద నిన్నాడేనా [1]నేటి కటుండరా నే వందు కోరువను । వొక ।
చందానఁ బన్నీట జలక మాడి నాసంగడికి రారా ॥ వేగి ॥

ముద్దియ వేలనె ముందర నుండెటి ముద్దుర వుంగరము । నీవు ।
పెద్దరికానకు ప్రియమునఁ గేలఁ బెట్టుకొంటేఁ దగదా
గద్దరివై శ్రీవెంకటనాథ నన్నుఁ గరఁగించి కూడితి । నా ।
వద్దనె పాయక వాలాయించి దేవరవలె నుండరా. ॥ వేగి ॥ 57

1. "వటి" వ్రాసి "వేటి" అని తిద్ది యున్నారు.

చి. శృ. 10 రే. 5 పా. తెలుఁగుఁగాంబోది

చెప్పరె మీరైనా బుద్ధి చెలులాల
అప్పసము మా కదిరి యప్పనికి ॥ పల్లవి ॥

యింతగా వలచినవాఁ డింటికి వచ్చితే నేమి
అంతలోఁ దనకును సిగ్గాయ నటవే
పంతము దప్పిపోయినా పచ్చిదేరేమాఁటలను
అంతేసి తన్నుఁ దూరనాడఁ జాలఁ గాక ॥ చెప్పరె ॥

మన సిచ్చినట్టివాఁడు మాఁటలాడితే నేమి
తను నెవ్వరైనా వద్దనే రటే
చనుమొనలు సోఁకఁగా జాణతనపుఁజేఁతల
చెనకలేనా కొంత చేకాచి కాక ॥ చెప్పరె ॥

కదిసినవాఁడు నన్నుఁ గాఁగిలించితే నేమి
అదను గాదా తనకు నడ్డమా యేమి
వెదచల్లఁ గూరిమి శ్రీవెంకటనాథుఁ డై కూడె
పదిలమై యిఁకఁ దన్నుఁ బాయలేనుఁ గాకా. ॥ చెప్పరె ॥ 58

చి. శృ. 10 రే. 6 పా. బౌళి

ఏలరా కృష్ణుఁడా ॥ పల్లవి ॥

పగటూ మాఁటల నొగరూ దోఁచఁగ
మగనాలిని నన్ను నగఁ జూచే వేరా ॥ ఏలరా ॥

కొనబూ విటుఁడ నీ కనుచూపులనె నా
మనసూ గరఁగించఁ బెనఁగే వేరా ॥ ఏలరా ॥

కలికిచేఁతల వలపించి నను నిట్టె
కలసితి శ్రీవెంకటగిరినాథా. ॥ ఏలరా ॥ 59

చి. శృ. 11 రే. 1 పా. పాడి

అంత మనసరి వని ఆదేనా నిన్ను
చింతించే నీయాల ననే సిగ్గు కింతే కాక ॥ పల్లవి ॥

నవ్వులు నవ్వేవు నీవు ననుపువానివలెనె
యెవ్వతెతో నైనా నదేరా నీవు
దువ్వటపుఁ బయ్యదపైఁ దోఁగిన చెమట నీపై
చివ్వనగోళ్ల నాపె చిమ్మె ననీ కాక ॥ అంత ॥

ముచ్చట నెవ్వతె నైన మొకము దగ్గరఁ బోయి
యిచ్చకము లాడేవు యేరా నీవు
మచ్చిక నాపె నీతోను మారుమాఁట లాడఁగాను
తచ్చన వీడెపుటాలి దాఁకె ననీ కాక ॥ అంత ॥

చనవున మెచ్చి మెచ్చి సారెకు నెవ్వతె నైనా
యెనసి కాఁగిలించేవు యేరా నీవు
నను నిట్టె శ్రీవెంకటనాథుఁడ కూడితివి
అనువై యాపె వాసన లంటె ననీ కాక. ॥ అంత ॥ 60

చి. శృ. 11 రే. 2 పా. శంకరాభరణం

నా కన్నిచేఁత లెల్ల నాయకుఁడ యియ్యకోలె
యీకడ నీవేడుక యీడేరితేఁ జాలును ॥ పల్లవి ॥

దాపుగా వారింటఁ గాని దగ్గరి మాయింటఁ గాని
వోపికతో నీవు లెస్స వుంటేఁ జాలు
ఆపెవద్దఁ గాని అట్టె నావద్దఁ గాని
తీపు లైన నీముచ్చట తీరితేఁ జాలును ॥ నాకన్ని ॥

అతివచేతనె కాని అట్టె నాచేతఁ గాని
యితవుగా నీవు భుజియించితేఁ జాలు
సతమై యాపెతోఁ గాని జట్టిగా నాతోఁ గాని
బతిమివట్టినట్లాఁ బాయకుంటేఁ జాలును ॥ నాకన్ని ॥

అలయింతిరతిఁ గాని అట్టె నారతిఁ గాని
చెలువమై నీసుఖము చెల్లితేఁ జాలు
చెలరేఁగి యిద్దరిని శ్రీవెంకటనాథుఁడ
పలపట్టి కూడితిగా సత మైతేఁ జాలును. ॥ నాకన్ని ॥ 61

చి. శృ. 11 రే. 3 పా. మాళవిగౌళ

ఇంచుక యస మిచ్చితే యెవ్వరూ నేల మానేరు
కొంచేవా నీ వీఁకఁ గోన చెన్నరాయఁడ ॥ పల్లవి ॥

మొగము చూచి వలచి ముందు ముందె నీకుఁ గేలు
మొగిచి మొక్కినదె మోస మాయఁగా
సగముచూపులఁ జూచి జాణతనా లాడేవు
తగునా చేఁతకు నీచేఁతలు వో విభుఁడా ॥ ఇంచుక ॥

కలికి నీచేఁతలకు కాఁక రేఁగి నాకు నేనె
నిలిచి మాటాడినదె నేర మాయఁగా
చిలుకుగోళ(ళ్ల) నూఁది చేరి సరస మాడేవు
తలఁపనందుకు నీవు తగునయ్య విభుఁడా ॥ ఇంచుక ॥

అగ్గలపు వేడుకతో నలపు దీర నీమీఁద
దగ్గరి చేయి చాచుటే తగు లాయఁగా
వెగ్గళించి కూడితి శ్రీవెంకటనాథుఁడ నన్ను
సిగ్గుదీర నిదె కోన చెన్నరాయఁడ వై. ॥ ఇంచుక ॥ 62

చి. శృ. 11 రే. 4 పా. సామంతం

ఆఁటదానఁ గనక నే నాసలు మానలేఁ గాక
యేఁటికి మాచక్కఁదనా లింపు గాని నీకును. ॥ పల్లవి ॥

వాడికై ననాఁటికి వలతు వింతే కాక
నేఁడు బాస చెల్లించ నీ కేలయ్యా
వాడుదేరుకూలికి వలచిన వలపులు •
యీడేరించుకొనేది యింత పిన్నపనులా ॥ ఆఁట ॥

పనిగల యప్పు డెల్లాఁ బై కొందు వింతే కాక
ననిచి యెప్పుడూ నేల [1] నడపేవయ్యా
చెనకి గడ్డాయముగాఁ జేసినబాస లెల్ల
అనువుగా నడపఁగ నల్లాడఁ బడెనా ॥ ఆఁట ॥

1. "నడప" వ్రాసి "నడపే" అని తిద్ది యున్నారు.

చిత్తము నిలుప లేక శ్రీవెంకటనాథుఁడ
హత్తి కూడితివి గాక అల పేలయ్యా
కొత్తగాఁ దమకమునఁ గూడినకూట మెల్లా
తత్తరపడక యుండఁ దమయిచ్చలా. ॥ ఆఁట ॥ 63

చి. శృ. 11 రే. 5 పా. రామక్రియ

పించెపుతలజడల [1] పిన్నవాఁడు
పెంచీనె వలపులు పిన్నవాఁడు ॥ పల్లవి ॥

చనవరివలెనె వేసాలచేఁతలు నేసి
పెనఁగీఁ గుచములతోఁ బిన్నవాఁడు
ఘన మై ముద్దులు చూపి కరఁగించి యింతలోనె
పెనపులఁ బెట్టీనె పిన్నవాఁడు ॥ పించెపు ॥

చెలిమికానివలెనె సిగ్గు వీడ మాఁటలాడి
పిలిచీ యేకతానకుఁ బిన్నవాఁడు
కులమువావులు చెప్పి గుట్టు దెలుసుక నాతో
పెలుచుమాఁట లాడీనె పిన్నవాఁడు ॥ పించెపు ॥

చిట్టకపు చేఁతలను చెనకి నా వేలఁ దెచ్చి
పెట్టీనె వుంగరము పిన్నవాఁడు
గట్టిగాఁ దానె శ్రీవెంకటనాథుఁ డై వచ్చి
బెట్టుగా నన్నుఁ గూడెనే పిన్నవాఁడు. ॥ పించెపు ॥ 64

చి. శృ 11 రే. 6 పా. శంకరాభరణం

ఏఁటి కిఁక నాకు నీతో నెగ్గు లెంచను
మాఁటలాడినప్పుడె మానేనయ్యా కోపము ॥ పల్లవి ॥

మాన లేక నీవు పెక్కుమానినులఁ దెచ్చినాను
దాని కేమీ నేను పెద్దదాననె కానా
నాననట్టివలపులు నాఁడు నాఁడె చవులు గావా
సానఁ బట్టినమణులు చాయలె కావా ॥ ఏఁటి ॥

1. "బిన్న" వ్రాసి "పిన్న" అని శిద్ధి యున్నారు.

పొందులె మానక నీ వేపొలఁతియింట నుండినా
అందుకే మెపుడు నీకు నాలనే కదా
ముందు ముందె యిట్లానైన మోహాములు తీపులే కా
యెందు నాఁక లైనవిందు యితవు లవునె కా ॥ ఏఁటి ॥
కళలు మించ నీ వెవ్వతెఁ గాఁగిలించుకొన్నా నేమి
బలిమి నైన నావరుస పాయవే కదా
చెలిమి సేసేనాటిదాన శ్రీవెంకటనాథ నీవు
తలఁచి కూడితి నాతోఁ దనియక వుందునా. ॥ ఏఁటి ॥ 65

చి. శృ. 12 రే. 1 పా. బౌళి

చిత్తమె చిమ్మ రేఁగితే సిగ్గేమి యెగ్గేమి
రుత్తవోని వేడుకల రుచి గన్నవారికి ॥ పల్లవి ॥
మొక్కలానఁ దిట్టినాను మోహమె పెచ్చువెరుగు
దక్క వలచినయట్టి తరితీపున
వుక్కుగోరు సోఁకినాను వుపవారు మై తోఁచు
నిక్క మై సరస మాడ నేరిచినవారికి ॥ చిత్తమె ॥
కాలు దాఁకించిన నైన కళ లంటిన ట్లౌను
వేళమె మోహించినట్టి వేడుకను
పేలరి మాఁట లాడిన ప్రియము లై తోఁచును
వాలాయించి నను పైనవారికిని ॥ చిత్తమె ॥
ఎంగిలి సోఁకించినాను యిచ్చక మై తోఁచును
పొంగెటి తమకపు తీపులవేళను
చెంగలించె నీచెలియ శ్రీవెంకటనాథుఁ గూడి
అంగ మైన మందెమురాయఁడె తా నై యుండఁగా. ॥ చిత్తమె ॥ 66

చి. శృ. 12 రే. 2 పా. పాడి

రావయ్య వావిలిపాటి రామచంద్ర
రావాడివలపులు రామచంద్ర ॥ పల్లవి ॥

మూఁగినసబలలోన ముంచి మాఁటలాడఁగాను
రాఁగెఁగా నీ మోవికెంపు రామచంద్ర
మాఁగినమాఁటలనె మర్మము లెత్తితి నని
రాఁగతనాలు మానుమీ రామచంద్ర ॥ రావయ్య ॥

బట్టబయలుమాఁటల బాసలు సేయ రాఁగా
రట్టాయ నీ సుద్దులు రామచంద్ర
గుట్టు దెలిసినందుకు కోపగించుకొనకుమీ
రట్టడిచేఁతల వో రామచంద్ర ॥ రావయ్య ॥

ఆసలమాఁటల నన్ను నలమి పట్టఁగ నిన్ను
రాసెఁగా నా కొనగోరు రామచంద్ర
వేసాలు మాని నన్ను శ్రీవెంకటనాథుఁడ వై
రాసి కెక్కఁ గూడితివి రామచంద్ర. ॥ రావయ్య ॥ 67

ఐ. శృ 12 రే. 3 పా. దేసాళం

కాంతుఁడు మరునియాజ్ఞ కడవలేఁ డింతే కాక
కొంతైన నెరఁగఁడా కోన చెన్నరాయఁడు ॥ పల్లవి ॥

వలపు నిలుప లేక వనితకు మొక్కెఁ గాక
సొలసి వాఁ డటువంటి సుద్దులవాఁడా
చెలిమి విడువ లేక చెయిమ్రాఁత యిచ్చెఁ గాక
కొలమున నేమి తక్కువవాఁడా ॥ కాంతుఁడు ॥

ఆసలు మానఁగ లేక ఆకు మడి చిచ్చెఁ గాక
వేసాల వాఁ డటువంటి విద్యలవాఁడా
బాసలు దప్పఁగ లేక బడినె తిరిగెఁ గాక
యీసున దొరతనము తెలియఁగనివాఁడా ॥ కాంతుఁడు ॥

పొందు విడువఁగ లేక పొత్తున భుజించెఁ గాక
అందగాఁ డాతఁ డెంగి లంటేవాఁడా
అంది శ్రీవెంకటనాథుఁ డాపెఁ గూడితే నేమి
చందముగా నాతోడి సమరతి మానేనా. ॥ కాంతుఁడు ॥ 68

చి. శృ. 12 రే. 4 పా. వరాళి

మాటకు మాఁటె యాడి మంచితనము సేయక
సీటున సరస మాడ నేఁడు నాకుఁ జెల్లునా ॥ పల్లవి ॥

ఘనుఁడ వంటా నీకుఁ గానుక చేతి కిచ్చితే
యెనసి నీ వాపెచేతి కియ్యఁ దగునా
ననిచి నీనేరమా నానేర[1]మింతే కాక
నిను దొర వని నమ్మి నేస్తము సేసినది ॥ మాటకు ॥

కాంతుఁడ వనుచు నావుంగరము వేలఁ బెట్టితే
అంతలో నాపె కిచ్చితి వది దగునా
అంతయు నీకడమలా అది నాకడమ గాక
వింత లేనిపొందు నీతో వేడుకఁ జేసినది ॥ మాటకు ॥

హితవరి వని నీతో నేకతము చెప్పితేను
అతివతోఁ జెప్పితివి అవునా నీవు
కితకారి శ్రీవెంకటనాథ నన్నుఁ గూడి
బతిమివట్టు కుండఁగా బా సదుగఁ జెల్లునా. ॥ మాటకు ॥ 69

చి. శృ. 12 రే. 5 పా. ముఖారి

సవతుల మైనాను సంగతి దప్పఁ దగునా
రవళి వావిలిపాటి రామచంద్రుముందర ॥ పల్లవి ॥

నీ వనఁగా నే ననఁగా నిష్ఠూరా లేఁటికే
చేవదేరే మాఁట లెల్ల చిగిరించీని
మోవరాని దూరు లెల్ల మోపులు గట్టఁగాను
వేవేగ నిన్నియు మనవిభుఁడు మోఁచీనా ॥ సవతుల ॥

కా దనఁగా నౌ ననఁగా కరక రేమిటికే
మీఁద మీఁద జగడాలు మితిమీరీని
వాదుల యీ సుద్దు లెల్ల వాములు వెట్టఁగాను
కా దని మనవిభుఁడు గాదెలఁ బోసీనా ॥ సవతుల ॥

1. "వింంతే" అని వ్రాసి "వి" కి ప్రక్క నున్న మొదటి "ం" సున్నను "వి" తో చేర్చి "మి" గ చేసి యున్నారు.

రమ్మనఁగ బొమ్మనఁగ రారాఁపు లేఁటికే
దొమ్మి రేఁగి కాఁకలు తోదోపు లాడీని
నమ్మించి శ్రీవెంకటనాథుఁడు నిన్ను నన్నును
సమ్మతిగాఁ గూడఁగాను సతము లైతిమిగా. ॥ సవతుల ॥ 70

చి. శృ. 12 రే. 6 పా. రామక్రియ

కాంతాళిం చాడినమాఁట గాదు సుమ్మీ వో విభుఁడ
దొంతిమాయలఁ జిక్కఁగ దొరలకుఁ జెల్లునా ॥ పల్లవి ॥

వేడుకతో నీ వాపె వెంట వెంటఁ దిరుగఁగా
చేడెలలో నెల్ల నాకు సిగ్గాయరా
యీడు లేని వలపు ని న్నెరఁగని దింతే కాక
తోడనె యీ పను లెల్ల దొరలకుఁ జెల్లునా ॥ కాంతా ॥

వొయ్యనె నీ వాపెకు వూడిగాలు సేయఁగాను
నెయ్యపు నా కపు డెంత నెగు లాయరా
గయ్యాళితమి నీకు కన్నులఁ గప్పెఁ గాక
తొయ్యలికి నింత లోఁగ దొరలకుఁ జెల్లునా ॥ కాంతా ॥

ఆసపడి నీ వాపెకు అట్టె కొలువు సేయఁగా
యీసున నాకునుఁ గోప మెంత వచ్చెరా
కోసువానిపల్లెలోనఁ గూడి శ్రీవెంకటనాథ
తోసిపోవైతివి యింత దొరలకుఁ జెల్లునా. ॥ కాంతా ॥ 71

చి. శృ. 13 రే. 1 పా. దేసాళం

చాలు లేరె మీ రేల చక్కఁటులు చెప్పేరె
మేలు గలవారికి మెచ్చకుండఁ జెల్లునా ॥ పల్లవి ॥

వలచినవాఁ డైతె వద్దికి తా వచ్చుఁ గాక
అలిగి తా నెదమాఁట లాడించునా
చెలిమే కలిగితేను [1]సిగ్గుపడవలెఁ గాక
వాలసీనొల్లముతో నూరకుండఁ జెల్లునా ॥ చాలు ॥

---

1. "సిగ్గువి" వ్రాసి కొట్టి "సిగ్గువ" గా దిద్ది యున్నారు.

ప్రియమే కలిగితేను పిలువ రావలెఁ గాక
దయ లేక యింతవడి తామసించునా
నయమే కలిగితేను నమ్మించవలెఁ గాక
భయము లే కింతవడి పట్టెడఁ జెల్లునా ॥ చాలు ॥
ఆసలే కలిగితేను అలముకోవలెఁ గాక
యీసున మరి యెగ్గు లెంచఁ జెల్లునా
వేసాలు మాని నన్ను శ్రీవెంకటనాథుఁడు గూడె
వాసు లెంచి యాతఁ డిఁక వాదించఁ జెల్లునా. ॥ చాలు ॥ 72

చి. శృ. 13 రే. 2 పా. గౌళ
మేర లేనివల పిది మీ కేల తెలుసునే
యీరస మయ్యేబుద్ధు లేల చెప్పేరే ॥ పల్లవి ॥
అఁట దెంత గబ్బి యన్నా నసుఁడ మీ రిఁక వేయి
మాఁట లన్నా వాని నేను మాన లేనే
వేఁటలాదేమదనుఁడు విరహులఁ బొదగంటే
యీ చెలవంటి పూబాణా లేమరుండీనా ॥ మేర ॥
అమ్మరో యంతటికల్ల యన్నా నంటిరి గాని
వమ్ము వోని వానిపొందు వదల లేనే
కమ్మటిఁ జందురుఁడు కాఁకలఁ బొరలేవారిపై
కుమ్మువంటి వెన్నెలలు గుప్పకుండీనా ॥ మేర ॥
అతివ మారాడఁ జెల్ల దన్నా నంటిరి గాని
వెత లేనివానిరతి విడువ లేనే
కతకారై నన్ను శ్రీవెంకటనాథుఁ(డె)గూడె
యిత వైనకళ లెల్లా హెచ్చుకుండీనా. ॥ మేర ॥ 73

చి. శృ. 13 రే. 3 పా. ముఖారి
ఎక్కడి పరాకుననో యిందాఁకా నుండెఁ గాక
మక్కువ నాపై బత్తి మానలేఁడె వాఁడు ॥ పల్లవి ॥

పాయరాని వలపులు పక్కనఁ దలఁచుకొంటే
రాయా మనసు గరఁగ కేమే
వో యమ్మలాల నావుంగరము చూపరమ్మ
వేయేల తా నిప్పుడే విచ్చేసీ నీడకే ॥ ఎక్కడి ॥

వూనినట్టిసరసాలు వూహించుకొంటేను
మానా దేహము తమకించ కేమే
మానినులాల వొక్కమాఁట విన్నవించరమ్మ
తానె వచ్చి నన్ను సంతస మందించీనే ॥ ఎక్కడి ॥

సేదదేరే చనవులు చిత్తమునఁ దగిలితే
దూదేవయ నేమి వూదితేఁ బోను
ఆదెస మండెమురాయఁ డైన శ్రీవెంకటనాథుఁ
డాదరించి నన్నుఁ గూడె నతిమోహముననూ. ॥ ఎక్కడి ॥ 74

చి. శృ. 13 రే. 4 పా. సామంతం

ఈదేర వలచితే యేపని సేయఁగ రాదు
యేడ నైనా యెగ్గు సిగ్గు లెంచేరా భూమిని ॥ పల్లవి ॥

వనిత చెప్పితేఁ జాలు వారి దైనా నీఁదేవు
అనువుగాఁ గొండ మోవు మన్నా మోఁచేవు
తనివోక బూ మెల్లాఁ దవ్వు మన్నాఁ దవ్వేవు
వొనర బహురూపాన నుండు మన్నా నుండేవు ॥ ఈదేర ॥

ఇంతి చెప్పితేఁ జాలు యెంతైనాఁ గొంచెపదేవు
అంతలోఁ బగరఁ జంపు మన్నాఁ జంపేవు
చెంత నాపె తపములు సేయు మన్నాఁ జేసేవు
కాంత దనపసులనుఁ గావు మన్నాఁ గాసేవు ॥ ఈదేర ॥

అతివ చూచి కల్ల లాడు మన్నా నాడేవు
బతిమిఁ బారాడు మన్నాఁ బారాడేవు
పతి వైన కోసువానిపల్లె శ్రీవెంకటనాథ
గతి యై కూ డుండు మన్నాఁ గాఁగిట మండేవు. ॥ ఈదేర ॥ 75

చి. శృ. 13 రే. 5 పా. కేదారగౌళ

నేనె యనఁగ నేల నీమనసూ నెరఁగదా
ఆనవెట్టి చెప్పేఁ జూమ్మీ ఆసగింతు నీకు ॥ పల్లవి ॥

చిగిరించె కోపమునఁ జేఁదైనవలపు
తెగనట్టి తమకానఁ దీపాయరా
వొగరుఁగాఁకలచేత నుడికేటిదేహము
సగము మొగమోటానఁ జల్ల నాయరా ॥ నేనె ॥

చిమ్మిరేఁగె జగడాలఁ జీఁక పైనమోహము
దిమ్మరియెడమాఁటలఁ దేటవారెరా
సమ్మతిగా నీ వొట్ల సైంచనిపొందులు
యెమ్మెల కోరికలచే నితవాయరా ॥ నేనె ॥

చెదరని రేసులఁ జిన్నఁబోయె మోములు
కదిసి మేను సోఁకితేఁ గళ రేఁగెరా
వెదకి నీవు నేనూ శ్రీవెంకటనాథ కూడఁగా
మదిలోని మచ్చికలు మక్కళించెరా. ॥ నేనె ॥ 76

చి. శృ. 13. రే. 6 పా. శుద్ధదేశి

కొండవంటిదొరవు నీగుణ మేల విడిచేవు
వుండరాదా నీ వుండేవొడికానను ॥ పల్లవి ॥

కడుఁ దగవు చెప్పేవు కట్టకానికలు వెట్టి
అడిగితిమా నిన్ను నయ్యో నేఁడు
బడి బడి నీవు చెప్పే పండితనాయానకు
తొడిఁబడ నెవ్వతైనా తుచ్చ మాడకుండునా ॥ కొండ ॥

వెట్టిసాకిరి చెప్పేవు విత్తూఁ దిమ్మిరి వేసి
నెట్టనఁ గరి గోరేమా నేఁడు నిన్నును
బెట్టిమాఁట లాడి నీవు పిరిదూరి రాఁగాను
గుట్టుచెడ నెవ్వతైనాఁ గోపగించకుండునా ॥ కొండ ॥

నీతులు చెప్ప వచ్చేవు నినుఁ బెద్దతన మిచ్చి
ఆతల నడిగితిమా అప్పటినిన్ను
కాతరాన నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
ఘాత రతిలోపల నాకాలు దాఁకకుండునా. ॥ కొండ ॥ 77

చి. శృ. 14 రే. 1 పా. దేసాళం

ఒక్కరి నొ నన నేల వొకరిఁ గా దన నేల
చెక్కు నొక్కి ప్రియములే చెప్పించుకో రాదా ॥ పల్లవి ॥

మేలురా నాతో నీవు మితిమీరి మాఁటాడేవు
బాలే నాతోడి వాదు కాపో నీవో
యేలరా నీపాలిటికి నిద్దరము సమమే
మేల మాడి సారె సారె మెప్పించుకో రాదా ॥ ఒక్కరి ॥

ఇప్పుడు నీవె వాసు లెక్కించుక వచ్చేవు
అప్పటి నాతోడి సవ తాపో నీవో
అప్పస మై యిద్దరము నాంట్ల మింతే నీకు
ముప్పిరి దేవరవలె మొక్కించుకో రాదా ॥ ఒక్కరి ॥

కన్నుల జంకెనలతో గరిసించి యడిగేవు
అన్ని వొట్లకు గురి యాపో నీవో
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవె కూడితి
వెన్నఁడూ నిద్దరి నిట్టె యేలుకొన రాదా. ॥ ఒక్కరి ॥ 78

చి. శృ. 14 రే. 2 పా. ముఖారి — ఏకతాళి

తేటతెల్లమిమాఁటలఁ దెలియ నాడఁ గదరా
మాటి మాటి కింత యేల మరఁగు లాడేవు ॥ పల్లవి ॥

కన్నుల నవ్వుల నేల గయ్యాళించేవు । నేము ।
నిన్నువంటి వొరపులే నేరుతుమా
సన్నలా చాయలా నేల సాధించేవు । వో ।
వెన్నఁడా నే మింతేసి వెర వెఱుఁగుదుమా ॥ తేట ॥

తక్కరిమాఁటల జాణతన మాడేవు । నేము ।
చక్కఁగా నీవలె నంత చదివితిమా
మిక్కిలి వాఁడిగోళ్ల మీఁదఁ జిమ్మేవు । నేము ।
కక్కసపుఁ జేఁతలకు కరఁగ నేరుతుమా ॥ తేట ॥

నిబ్బరపుఁ గాఁగిటను నించే వేమిరా । నేము ।
అబ్బురంపునిన్ను నొఁ గా దనఁ గలమా
గబ్బి వై కూడితి శ్రీవెంకటనాథుఁడా । నేము ।
వొబ్బిడి నింత నేసితే వొద్దనఁగఁ గలమా. ॥ తేట ॥ 79

చి. శృ. 14 రే. 3 పా. మాళవిగౌళ

బెల్లపుమాఁటల చెల్లపిల్లరాయఁడా । నీకుఁ ।
జెల్లునయ్య యేమైన చెల్లపిల్లరాయఁడా ॥ పల్లవి ॥

పేలరిమాఁట లాడేవు పెద్దతనమా యిది
పీలిచుంగుతోడి చెల్లపిల్లరాయఁడా
రొలు దాఁకించినప్పుడె కళ లంటె నిఁక నేల
చేలకొంగు వట్టేవు చెల్లపిల్లరాయఁడా ॥ బెల్లపు ॥

యీతల నాకుఁ బరచే వింతటిదొరవు నీ
పీతాంబరము చెల్లపిల్లరాయఁడా
ఘాతల నీగోరు దాఁకి కరఁగితి నిఁక నే నీ
చేతిలోని చాన నింతె చెల్లపిల్లరాయఁడా ॥ బెల్లపు ॥

నెట్టన దేవరవంటి నీమేనిసొమ్ము నాకుఁ
బెట్టేవుగా చెల్లపిల్లరాయఁడా
గట్టిగా నన్ను శ్రీవెంకటనాథుఁడ వై కూడి
చిట్టకాలు నేసేవు చెల్లపిల్లరాయఁడా. ॥ బెల్లపు ॥ 80

చి. శృ. 14 రే. 4 పా. కన్నడబంగాళం

బాయిఁడు నేసెటి పనులా
వోల వేయవచ్చీ నోయమ్మా ॥ పల్లవి ॥

చన్నులపైఁ జెయి చాఁచీనే యివి
చిన్నవాండ్ల చేఁతలా
కన్నులు గిరిపీ గామి దై
వున్నాఁ డిప్పుడు వోయమ్మా ॥ బాలుఁడు ॥

పస నీమోవిపైఁ బల్లు నోఁకించీ
పసిబిడ్డలబాగులా
కొసరుమాఁటల గో రంటి విడె
మొసఁగీ నిప్పుడె కో(వో?)యమ్మా ॥ బాలుఁడు ॥

నిండారఁ గాఁగిట నించీనే యివి
కొండుకబిడ్డలగుణములా
వెండిఁ బైఁడి నిచ్చి శ్రీవెంకటనాథుఁడు
వుం డుండి ననుఁ గూడె నోయమ్మా. ॥ బాలుఁడు ॥ 81

చి. శృ. 14 రే. 6 పా. నాదరామక్రియ

రారా చిన్నన్నా రా రోరి చిన్నవాఁడ
రార ముద్దులాఁడ రా రోరి బాలకృష్ణ ॥ పల్లవి ॥

కిందిచూపుల గిలిగించి ఆల
మంద గొల్లెతల మరిగించి
సందడి వలపించి జవరాండ్ల ।వూర।
విందవైనయట్టి వేడుకకాఁడ ॥ రారా ॥

కొదలుమాఁటలనె గొణఁగుచు భూమి
సుదతుల శిగ్గులు చూరాడి
చిదుగుచేఁతలనె చెనకుచు ।ముద్దుఁ।
బెదవిచవులు చూపిన జాణకాఁడ ॥ రారా ॥

కలికితనముననె కరఁగించి ।కాచె।
చెలుల కాఁగిటనె చెలఁగి
లలనామణి యైన లకిమమ్మఁ
గలసుక శ్రీవెంకటనాథుఁ డైనవాఁడ. ॥ రారా ॥ 82

చి. శృ. 14 రే. 6 పా. కాంబోది

మచ్చికఁ బందిలి వెట్టే మాయకాఁడ
కుచ్చితపు నేఁపుల కుశీలికాఁడ ॥ పల్లవి ॥

పలుకునయమె కాని పస లేదు నేస్తము
వలపులబేరాల వన్నెకాఁడ
మొలకనవ్వులె కాని మోహ మెరఁగ రాదు
నిలువు రాజసముల నీటుకాఁడ ॥ మచ్చి ॥

దవ్వులపొందె కాని దగ్గరఁగ నెడ లేదు
జవ్వనపుమదముల జాణకాఁడ
పువ్వులవాట్లె కాని పొరపొచ్చము మానవు
రవ్వలసరసముల రాయడికాఁడ ॥ మచ్చి ॥

తమకపుఁజూపె కాని తలఁపు దెలియ నీవు
అమరినరతులలో ఆసోదకాఁడ
క్రమమున నన్ను శ్రీవెంకటనాథ నీవె కూడి
భ్రమయించి తౌర వోరి పంతగాఁడా. ॥ మచ్చి ॥ 83

చి. శృ. 15 రే. 1 పా. లలిత

చాలా మేలుదిరా యీబాలామ యిపుడు నీ
పాలిటఁ జిక్కెరా గోపాలక కృష్ణమ్మా ॥ పల్లవి ॥

పంకాజముఖి నీవంకా చూచి నప్పుడే
బొంకాముగా వలచె యింకా నే మందురా
సంకె లేక నీమీఁద నంకిత మైనపాట
లంకించి పాడీ నీతో లంకెలఁ గృష్ణమ్మా ॥ చాలా ॥

పల్లాదమున నీవు మొల్లామి నందరిలో
మొల్లాపూబంతి వేయ జల్లునఁ గరఁగెరా
మెల్లానె వ్రాసి చూచీ జల్లాఁగ నీ రూపమె
కల్లా గాదురా శ్రీవల్లభ కృష్ణమ్మా ॥ చాలా ॥

తటుకానా నీ వప్పుడు నటనాలా సరసాన
యిటు నటుఁ గాఁగిలించ నెట్లాఁ దాఁ జొక్కెరా
విటరాయఁడవు శ్రీవెంకటనాథ నీ కూటమి
ఘటియించ వేడుక మిక్కుటమాయఁ గృష్ణమ్మా ॥ చాలా ॥ 84

చి. శృ. 15 రే. 2 పా. దేసాళం

ఎన్నఁడయ్యా నీ నేరుపు లిప్పుడు గాక
మున్నిటివోం డైనవారి ముందరనె కాక ॥ పల్లవి ॥

వాడలోన నీమోమె వనితలు చూడఁగాను
యీడనె సేయవద్దా నీ యెమ్మెలు
చేడె లెల్లా నీ మాఁటలె చెవి యొగ్గి వినఁగాను
ఆడవద్దా నీకుఁ దోఁచి న ట్టెల్లాను ॥ ఎన్న ॥

సతు లెల్లా మూఁకగట్టి సంగడి నిలుచుండఁగా
సతమై కరఁగ వద్దా సారెకు నీవు
అతివలె చెయి ముట్టి అంటి సరస మాడఁగ
మతిలోనఁ జొక్కవద్దా మాముందర నీవు ॥ ఎన్న ॥

సందడిలో నింతు లెల్లా చన్నుల నీ న్నొరయఁగా
కందువ లంటఁగ వద్దా గబ్బి వై నీవు
యిందె శ్రీవెంకటనాథ యేకతమై వుండఁగాను
అందముగా నన్నుఁ గూడి తవునయ్యా నీవు. ॥ ఎన్న ॥ 85

చి. శృ. 15 రే. 3 పా. ఆహిరి

అయ్యో దయ వలదా ఆఁటదానికి
చయ్యాట మాడినాను సంగతి గావలదా ॥ పల్లవి ॥

జీరల నీ మేను చూచి సిగ్గయ్యా నా కైతె
ఆరడి నీ కె ట్లితవాయనో కాని
కూరిమితో నాపెకు నీ కుందణమువంటి మేను
యీరీతిఁ జేయఁగఁ జేతు లెట్టాడెనో ॥ అయ్యో ॥

గంపైన నీ మోవి చూచి కనికి(క?)ర మయ్యీని
కంటకము నీ కెట్లా గాదో గాని
గొంటరియాపె దానె చిగురువంటి నీ మోవి
అంటి యింత సేసె నెంత అగ్గలికో కాని ॥ అయ్యో ॥

కురులు నలఁగిన నీ కొప్పు చూచి వెరగయ్యీ
శిరసు నీ కె ట్టోరిచెనో కాని
గరిమఁ గూడితి శ్రీవెంకటనాథ నను నిటె
నిరతిఁ గడపరాయ నిను మించఁ గలనా. ॥ అయ్యో ॥ 86

చి. శృ. 15 రే. 4 పా. హిందోళం

పాలు దాగె వెన్న దినె బానల పెరుగు జుత్తి
సోలి కాఁగులనేతులు చూరలాడె నమ్మా ॥ పల్లవి ॥

చిన్నవాని అరడి సేసినట్లు వుండుఁ గాని
యెన్నెన్నిపోకిళ్లఁ బొయ్యీ యీకృష్ణుఁడు
కన్నెలు ముద్దాడఁ బోతే గంటి సేసి మోవు లెల్ల
తన్నుఁ గానట్టున్నాఁడు దయ్యపువాఁడమ్మా ॥ పాలు ॥

తగినపసిబిడ్డనిఁ దతిగొన్న ట్టుండుఁ గాని
యెగసక్కె లెన్ని నేర్చె యీగోవిందుఁడు
మగువ లెత్తుకొంటేను మరి గోళ్లువెట్టి తానె
తగవులు చెప్పెఁ గతలకారోయమ్మా ॥ పాలు ॥

పలుదూరులు బాలునిపైఁ జెప్పి[1]న ట్టుండుఁ గాని
కలికివాఁడమ్మ శ్రీవెంకటనాథుఁడు
చెలులు కాఁగిలించితే సిగ్గు వీడఁ గూడి కూడి
వలపించినాఁడు యెటువంటివా డోయమ్మా. ॥ పాలు ॥ 87

1. "నెట్టు" వ్రాసి "నట్టు" అని తిద్ది యున్నారు.

చి. శృ. 15 రే. 5 పా. పాడి

అంతేపో నాతోడ నౌఁ గా దనఁగ రాదు
పంతమాడి గెలిచితే బంట వయ్యేవా ॥ పల్లవి ॥

కానీ లేరా పొదుపుడుఁగతలు వొదువు మని
ఆనవెట్టి న న్నేల అడ్డగించేవు
పూని నా కతలు నీకుఁ బొందుగాఁ దెలియకుంటే
పానిపట్టి నీవె నా బంట వయ్యేవా ॥ అంతే ॥

చలపటి(ట్టి?) నాతోడ సరిబేసు లాడు మని
బలిమి నా[1]కొం గేల పట్టి తీసేవు
వొలిసి ని న్నిప్పుడె వోడించితే నాతోడఁ
బలుమాఁట లేల నాబంట వయ్యేవా ॥ అంతే ॥

నీవు దలఁచిన సుద్ది నిక్క నన్నుఁ జెప్పు మని
కావించి మందెమురాయ కాఁగిలించేవు
శ్రీవెంకటనాథుఁడవె చెలఁగి నీ వనుచు నీ
భావ మెరిఁగి కూడితి బంట వయ్యేవా. ॥ అంతే ॥ 88

చి. శృ. 15 రే. 6 పా. ముఖారి

ఇది యేమె పీనిగుణ మెటువంటిదే
వదలక నవ్వ నూరవదినెనా నేను ॥ పల్లవి ॥

చక్కనివాఁ డై తేఁ దానె చల్లఁగా నుండుఁ గాక
యిక్కడ నెవ్వరి భ్రమయించ వచ్చీనె
వక్కణలమాఁటలకు వలచి వెంటఁ దిరుగ
తక్కరి రేపల్లె గొల్లదాననా యేమి ॥ ఇది ॥

పాయపువాఁ డై తేను బదుక నీవె యిట్టె
కాయక మై యెవ్వరిపైఁ గన్ను లార్చీనె
పోయగ మై తనమోము చూచి నట్టె మోహించి
పాయకుండ మేనవారిపడుచనా నేను ॥ ఇది

1. "పొంగేల" వ్రాసి "కొంగేల" అని తిద్ది యున్నారు.

నేరుపరి దా నైతె నెమ్మది నుండుఁ గాక
కేరి కేరి యెవ్వరిపైఁ గేలు చాఁచీనె
చేర వచ్చి నెల్లూరి శ్రీవెంకటనాథుఁ డిట్టె[1]
యీరీతినె నను గూడె యిందిర[2]నా నేను ॥ ఇది ॥ 89

చి. శృ. 16 రే. 1 పా. శ్రీరాగం

వల పేమి గంపఁ గమ్మవచ్చునా యెందైన
చెలులాల మాయిద్దరి చిత్తములే యెరుఁగు ॥ పల్లవి ॥

యెనయని కోపమున యేమైనా నంటిఁ గాక
మనసులో మమతలు మానఁ గలనా
ఘనమైన పౌలయలుకలఁ గొసరితిఁ గాక
వినరమ్మె రమణుని వితనాడఁ గలనా ॥ వల ॥

ఆలసించి రాఁగానె అన్నియుఁ దిటి(ట్టి?)తిఁ గాక
మేలుదాన వానిఁ బాసి మించఁ గలనా
ఆలరి యై తిరుగఁగ నమ్మరో దూరితిఁ గాక
బాలకి నైన వానిఁ బాసి వుండఁ గలనా ॥ వల ॥

దగ్గరని కాఁతాళాన తగుఁ దగ దంటిఁ గాక
యెగ్గువట్టి వానితప్పు లెంచఁ గలనా
కగ్గు లేక శ్రీవెంకటనాథుఁడె నన్ను
అగ్గల మై కూడె వానియంద వాయఁ గలనా. ॥ వల ॥ 90

చి. శృ. 16 రే. 2 పా. వరాళి

ఎటువంటి దొర వైతి వేమయ్య నీవు
అటమటముల నీకు నాచార మేది ॥ పల్లవి ॥

---

1. "శ్టై" వ్రాసి "ట్టె" గా తిద్ది యున్నారు.

2. "నే——" వ్రాసినారు. "నానేను" అని తిద్ది యున్నారు. "నే" తర్వాతి రెండక్షరములు గుర్తింప వీలుకాలేదు. చెరిపి వ్రాసినట్లు మాత్రము తెలియుచున్నది.

వెనక నా యడపము వెలఁది మో వానితివి
అనువుగ నేఁ గంటి నద్దములోన
తనియక నాకు నిట్టె తమ్ముల మిఁద వచ్చేవు
యెనసి వూడిగపుదానెంగిలి కోపుదునా ॥ ఎటు ॥

ముచ్చట నా కాళాంజిముదితఁ గాఁగిలించితి
వచ్చుగా నే రత్నపుగోడావలఁ గంటి
యిచ్చకాన నామీఁద నిట్టె చెయి వేసేవు
చెచ్చెర సేవకురాలిచెమట కోపుదునా ॥ ఎటు ॥

వొద్దనె నా కుంచదాని నొగిఁ దోఁటలోఁ గూడఁగా
నిద్దపుఁ గేళారూ(కూ?)ళి నీటిలోఁ గంటి
గద్దరివై నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
అద్దో పరిచారకురాలంటుకు నోపుదునా. ॥ ఎటు ॥ 91

చి. శృ. 16 రే. 3 పా. పాడి

సుసరాన మంచి దాయ సుదతులాల
విసుగక పతిఁ దెస్తే వెద లేమి లేవే ॥ పల్లవి ॥

తమ్మితూఁడు లా(నా?)ళమునఁ దగిన కస్తూరివుంట
వుమ్మడినె మదనుఁడు వూదఁగను
కొమ్మ చనుజక్కవలు గొబ్బున నెగయఁగాను
కమ్మి వతి(లి?)పె పయ్యద గలుగఁగ నిల్చెనే ॥ సుసరాన ॥

మొగలిరే కొడిశంట ముదురుఁగప్రపులప్ప
వెగటున మదనుఁడు వేయఁగను
అగడై యింతి నడపుటంచలు బెదరఁగాను
వొగిఁ బాదపుపెండెము లోపికె నిలిపెనే ॥ సుసరాన ॥

చెఱకుఁదూఁట సింగిణి చెంగలువ మిట్టకోల
వెఱవక మదనుఁడు వేయఁగను
పఱచికురులతేంట్లు పారఁగా నడ్డ మై కాంతఁ
గఱఁగించి కూడీ శ్రీవెంకటనాథుఁ డాఁపెనే. ॥ సుసరాన ॥ 92

చి. శృ. 16 రే. 4 పా. శుద్ధదేశి

కన్నెపడుచుతో నేమి గయ్యాళించేవు
అన్నిటా మచ్చికై తె నిన్నాపె మించ నోపదా ॥ పల్లవి ॥

దివ్వెకు మాసెవోనె పతిమఁ జూచి ముద్దరాలు
యెవ్వతో వున్న దని యిదె కొంకీని
నవ్వు లేమి నవ్వేవు నాలికాఁడ చెయివట్టి
జవ్వనిఁ దియ్యరాదా చలివాయను ॥ కన్నె ॥

పౌదిగి పాదాలు గుద్దే బొమ్మఁ జూచి గోలయై
ఆదెవ్వతో వున్న దని అందు కాచీని
యిదేమి ఫేదుక చూచే వెమ్మెకాఁడ కొంగువట్టి
కదియఁ దియ్యఁగ రాదా కళ రేఁగను ॥ కన్నె ॥

చేయంటి సురటి వీచే చేఁతాళపు రూప్ప(పు?) చూచి
పాయని దెవ్వతో యని బాల లోఁగీని
కాయజకేలిని శ్రీవెంకటనాథ కూడితివి
ఆయెడ న న్నింద నిల్పి యతిమోదమునను. ॥ కన్నె ॥ 93

చి. శృ. 16 రే. 5 పా. భైరవి

ఎంతనేర్చుపరివి ని న్నే మందమే
పంత మాడె యాపె నింత భ్రమయించెఁ జూడరే ॥ పల్లవి ॥

చలపాదియాపె నా సంగడినె వుండఁగాను
వెలఁది రమణుఁ దొక్క విధము సేసె
అల చుక్కల నెంచవె యని దాని నేమరించి
కళ లంటి వను బిగ్గఁ గాఁగిలించెనే ॥ ఎంత ॥

మొక్కళాన యాపె నాతో మొనసి సాటికిరాఁగా
చక్కనిరమణుఁ దొక్క జాడ సేసెనే
అక్కడ దాఁగిలిముచ్చు లాడి దానిఁ గన్ను మూసి
దక్కి నామో వాని నాకుఁ దమ్ములము వెట్టెనే ॥ ఎంత ॥

బట్ట గుత్తై యాపె నేఁడు పాయక పద్ద నుండఁగా
యిట్టె శ్రీవెంకటనాథుఁ డిటు సేసెనే.
గట్టిగా నాపె కన్నులఁ గప్రమునిండాఁ బెట్టి
జట్టిగా నాతోఁ గూడి సమరతి సేసెనే. ॥ ఎంత ॥ 94

చి. శృ. 16 రే. 6 పా. నాదరామక్రియ

ఎత్తూ నోరాఁ గల దిటువంటిది వలపు
యిత్తరిఁ గాఁకల వన్న(న్నె?)యించుకాఁ దియ్యదు ॥ పల్లవి ॥
మచ్చికతోడుతఁ దూఁగు మంచపుఁ దానుమీఁద
నిచ్చ నిండ జవ్వనపు నీవొక్కచో
నిచ్చలపు గుణముల నే నొక్కచో నుండఁగాను
అచ్చముగా సరిఁ దూఁచె నతనుఁడే యిపుడు ॥ ఎత్తూ ॥
మించి చలువరాయనే మెచ్చుల వొరగంటిపై
నించినట్టి వేడుకల నీదేహము
దించని తమకపు నాదేహమూఁ బెనఁగఁగా
పొంచి సరిగా నొరసె పూవిలుతుఁ డిపుడు ॥ ఎత్తూ ॥
కలసె పూఁబానుపు మొగ్గల గొప్పసళాకలు
నిలువున శ్రీవెంకటనాథ నీరతికి
కొలఁది మీరఁగ నేఁ గూడిన సమరతికి
వలె నని వనె(న్నె?) వెట్టీ వలరాయఁ డిపుడు. ॥ ఎత్తూ ॥ 95

చి. శృ. 17 రే. 1 పా. దేసాళం

సిగ్గువడ నేమిటికి చెలువమె యిది నీకు
యెగ్గు లేదు యిట్టె సింగారించుకొనవయ్యా ॥ పల్లవి ॥
కపురపుఁ బలుకుల కంటసరులు నీకు
యిపు డిట్టె చెలి యంపె నిందవయ్యా
చపలపు నీమెడ చంద్రవంకలమీఁద
కపురై వుండు నిట్టె కట్టుకొనవయ్యా ॥ సిగ్గు ॥

నెలకొన్నకస్తూరి నిగరపుఁ బోఁగులు
కలికి నీకు నంపెఁ గైకొనవయ్యా
యెలమిని మేదించినితరవాసనఁ గప్పె
పెలుచ వందురు యిట్టె పెట్టుకొనవయ్యా ॥ సిగ్గు ॥
కోవరపుఁ బచ్చికుంకుమపూవుదండ లంపె
శ్రీవెంకటనాథ యింతిఁ జేకొనవయ్యా
తోవల నీమై నంటిన తొలుతటి పస పెల్లా
వేవేగ నిది గప్పె వేసుకొనవయ్యా. ॥ సిగ్గు ॥ 96

చి. శృ. 17 రే. 2 పా. ముఖారి

దానిసాహసము మేలు తరవాత నీవు మేలు
పూనిన యారడికి ని న్నోడి గట్టించినది ॥ పల్లవి ॥
రవ్వగా మే నెల్లా జీరలుగాఁ జేయించుక
మవ్వపు నాయెదుట నీవు మలసేవు
నవ్వుల కైనాను నామాఁట మీరనినిన్ను
యెవ్వతెరా నిన్ను నింతగాఁ జేసినది ॥ దాని ॥
చిగురు నీమోవి యెల్లా చిల్లులుగాఁ జేయించుక
వెగటుగా నాయెదుట విఱ్ఱవీఁగేవు
తగవుల కైనా జివగాఁటని (జవదాఁటని?) నిన్నుఁ దెచ్చి
జగ నీపై యింత నేసి చలి వాపెను ॥ దాని ॥
చేవ దేర నీతురుము చిక్కువడఁ జేయించుక
శ్రీవెంకటనాథ కడుఁ జెలఁగేవు
యేవేళ నన్నుఁ బాయక యెనసి వుండితి నిన్ను
యీవేళఁ జెనకుచు యెమ్మెలు నేసినది. ॥ దాని ॥ 97

చి. శృ. 17 రే. 3 పా. సాళంగనాట

బొనయ్యా మే లెరిఁగిన ఆణికాఁడవు
కానక మైన నీ దొరతన మెల్లాఁ గంటిమి ॥ పల్లవి ॥

జక్కఁదన మెరఁగనిజాణవా నీ వేమైనా
తక్కరి వై గుజ్జుదానిఁ దగిలితివి
యెక్కువగా నాముందర యెవ్వరినో యెంచఁగాను
చక్కఁగా నామదిలోన చల్లఁ గాక వుండునా ॥ ఔన ॥

కన్నెపాయ మెరఁగని ఘనుఁడవా నీ వేమి
పిన్న వై రేవతిదేవిఁ బెండ్లాడితివి
యెన్నికె నాముందర నీయింతులజవ్వన మెంచె(చి?)
తన్నిటా నామదిలోన నానందించ కుందునా ॥ ఔన ॥

యిట్టె వినయము నీ వెరఁగవా నీ రొమ్ము
మెట్టినయింతికె కడు మేలువాఁడవు
చిట్టకము లెంచేటి శ్రీవెంకటనాథ నన్ను
గటి(ట్టి)గాఁ గూడితివి నేఁ గరఁగక వుండునా.॥ ఔన ॥ 98

చి. శృ. 17 రే. 4 పా. సామంతం

ఇచ్చకమె సేసే వేరా నీవు
యెచ్చోటి చనవరి వేరా నీవు ॥ పల్లవి ॥

మన్నించి నన్ను నిట్టె మరఁదల రమ్మనేవు
యెన్నటి మేనవాఁడ వేరా నీవు
వెన్నుఁడ నన్ను నిట్టె విడెము దె మ్మనేవు
యెన్ని దాఁచఁ బెట్టితివి యేరా నీవు ॥ ఇచ్చ ॥

మెప్పించి నాతోడ మేలము లాడేవు
యెప్పటి నేస్తకాఁడ వేరా నీవు
దుప్పటికొంగు నాపైఁ దొడిఁబడఁ గప్పేవు
యిప్పు డెన్నటిపొందు యేరా నీవు ॥ ఇచ్చ ॥

కానిరా నను నిట్టె కాఁగిలించుకొనేవు
యేనా[1]టి చుట్టమవు యేరా నీవు
కానిపించి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యేనెలవున నేలితి వేరా నీవూ. ॥ ఇచ్చ ॥ 99

1. "తి" వ్రాసి కొట్టి "టి"గా తిద్ది యున్నారు.

చి. శృ. 17 రే. 5 పా.   వర్మతాళం - బౌళి

ఇంక నేలా నాతోఁడ యింత సేయ
అంకెకాఁడ వౌర శేషాద్రినాథా ॥ పల్లవి ॥

చల్ల లమ్మేవారి కేల చందనము
చెల్లు నీవె పూసుకోరా చిన్నవాఁడ
కల్లరి వై నాతో నేల గయ్యాళించ
మల్లాడ నీ వదినెనో మరఁదలనో ॥ ఇంక ॥

జట్టిగా గొల్లెతల కేల చంద్రగావి
గట్టి గాఁగా నీవె దట్టి గట్టుకోరా
గట్టువాయతనమునఁ గదిసి నన్ను
పట్టేవు నీ చుట్టమనో పక్కమనో ॥ ఇంక ॥

మందలోనివారి కేల మల్లెలు
ముందు నీవె కొప్పులోన ముడుచుకోరా
అంది శ్రీవెంకటనాథ అవురా నన్ను
అందముగాఁ గూడితివి అల నటరా. ॥ ఇంక ॥ 100

చి. శృ. 17 రే. 6 పా.   బౌళిరామక్రియ

గుజ్జనఁగూడు వండెనె కోమలి నేఁడు
గొజ్జవెన్నెలబాయిటఁ గొమ్మలుఁ దాను ॥ పల్లవి ॥

గోమున సేవంతిపువ్వు గురుగులలోపల
ఏమరక పూఁదేనె నెసరు వెట్టి
ప్రేమతోఁ బచ్చకప్రపుబియ్యము కొద్దికిఁ బోసి
దోమటిగా మంచి పూవుఁదోఁటవెంట వాలెను ॥ గుజ్జన ॥

మచ్చికఁ బన్నీటను మారెసరుగాఁ బోసి
కచ్చుపెట్టి మల్లెమొగ్గఁ గలయఁ బెట్టి
మెచ్చుల మరువమున మించినట్టి పొం గణఁచి
ముచ్చటఁ బచ్చాకున మూఁకుడు మూసి ॥ గుజ్జన ॥

చెలఁగి వట్టివేళ్ల జిబిలికెను వారిచి
కులికి పుప్పొళ్లనే కూరలు వండి
కలికి చుట్టపు శ్రీవెంకటనాథురతిఁ గూడె
వెలయ నాతనికి విందు వెట్టసూ. ॥ గుజ్జన ॥ 101

చి. శృ. 18 రే. 1 పా. రామక్రియ - అటతాళం

తలఁపుఁ దలఁపు లెస్స తగు లాయను
కలకంటి యిందుకె నిక్కము వలచెనయ్యా ॥ పల్లవి ॥

యేనుగపై నీవు రాఁగా యింతి పయ్యద జారఁగ
పూని మిద్దెమీఁద నుండి పొసఁగఁ జూచె
ఆని కరికుంభములు అంకుశాన నీ వూఁదిన
కానుక నీ చేఁతలకుఁ గడు వలచెనయ్యా ॥ తలఁపు ॥

నీవు గుఱ్ఱముఁ దోలఁగ నెలఁత చిక్కు దీయుచు
తావుల మేడపైనుండి తప్పక చూచె
కావించి నీ సమకట్లలో నల్ల జల్లి
దూవిన నేరుపుల కెదురు వలచెనయ్యా ॥ తలఁపు ॥

తేరుపై నీ వెక్కి రాఁగా తెఱవ మై పులకించి
చేరువ వుప్పరిగెపైఁ జెలఁగి చూచె
గారవించి వచ్చి శ్రీవెంకటనాథ నీవు గూడ
తారుకాణ చేఁతలకుఁ దగ వలచెనయ్యా. ॥ తలఁపు ॥ 102

చి. శృ. 18 రే. 2 పా. బౌళి

అటువంటివారికి నీ వప్పుడే వలతువు
అటు నిటు నిన్నుఁ బా లార్చినా యేమి ॥ పల్లవి ॥

గుట్టున మొగలిరేకు కొమ్మ పయ్యదపై వేయఁ
బుట్టచెండు వుచ్చుకొని పొలఁతి వేసె
అట్టె నీ చేఁతకుఁ జేఁత ఆపె సేసె నావలెనె
దట్టించక నీపై దయ దలఁచీనా యేమి ॥ అటు ॥

మెత్తని తామెరపువ్వు మెలుఁతపై నీవు వేయ
బొత్తుగాఁ బాదపుటందెఁ బొలిఁతి వేసె
మత్తిలి యాపె మారుకు మారు సేసె నావలెనె
బత్తి సేసి నిన్నూరకె పాటించీనా యేమి ॥ అటు ॥

యించుక దగ్గరి నీ వేకతము చెప్పఁ బోతే
లంచముగా నీకుఁ దమ్ములము వెట్టెను
నించి శ్రీవెంకటనాథ నిన్నుఁ గూడె నావలెనె
మంచితనమునఁ గూడి మన్నించీనా యేమి. ॥ అటు ॥ 103

చి. శృ. 18 రే. 3 పా. సామంతం

మందుల మాయలఁ బోదె మంచివలపు
బొందితోఁ బతికాఁగిట భోగింపించుఁ గాని ॥ పల్లవి ॥

కారుచిచ్చయినాఁ దొఱకరివానచే నారు
ఆరదు పన్నీటిజడి నంగతాపము
ఆరదై నీటిచేత ననల మారకుండునా
సారెఁ జెలి కోరిక వెచ్చలు రేఁచెఁ గాక ॥ మందుల ॥

జడివానైనా వెలుచు సంగడి చలికాలాన
యెడయదు చలువల నింతి చెమట
నిడివిఁ బుప్పొడి చల్ల నీరు దియ్యకుండునా
కడుఁ జెలియ మనసు కరఁగించీఁ గాకా ॥ మందుల ॥

వేవేగ నాయిటివోతె విసరదు బెట్టుగాలి
పోవు నిట్టూర్పులు పతిఁ బొందినా నీవె
శ్రీవెంకటనాథుఁ గూడి చెల్లునటె వుసురన
భావజకేలిలోపలి పరిణత గాకా. ॥ మందుల ॥ 104

చి. శృ. 18 రే. 4 పా. వరాళి

వెఱపించితిగా వోయి వేడుకకాఁడ
తెఱవ నీ మాఁట విని దిందుపడెఁ గాని ॥ పల్లవి ॥

పొలఁతి నీమోము చూచి పున్నమచందురుఁ డని
వెల వెలఁ బారి చాలా వెరచెనయ్యా
వలచి నీతామెరలవంటి కన్నులఁ జూడఁగా
కలఁకదేరి మరి కనువిచ్చి చూచెను ॥ వెల ॥

కొమ్మ నీకురులు చూచి గుంపుఁదుమ్మెద లనుచు
వుమ్మలూర మదిలోన నులికెనయ్యా
పమ్మిన పీలిపించపుపాగ చూచి నీ వనుచు
దిమ్మ విడిచి వొయ్యనె తెప్పిరిలె నిపుడు ॥ వెల ॥

నల్లఁగలువ చేఁబట్టి నయముతో నీవు రాఁగా
పల్లదపు మరుఁ డని భామ లోఁగెను
వెల్లవిరై కాఁగిట శ్రీవెంకటనాథ యింతిని
చల్లఁగా నీవు గూడఁగ సమరతి సేసెను. ॥ వెల ॥ 105

చి. శృ. 18 రే. 5 పా కేదారగౌళ

నిండుదొర వౌదు నీగుణము మేలు నిన్ను నమ్మవలెఁబో
పండినమామిడిపై చిలుకవలె పచ్చిదేర నేల తిరిగేవయ్యా ॥ పల్లవి ॥

వనిత కొండంత పలపుతో నీ వరుసకుఁ గాచుకుండఁగా
చిసుకుఁ జీఁకటి పొద్దున నీ వేడ చెలితో నవ్వేవయ్యా
మనసార నీవె నిప్పువంటిబాస మగువకు నిచ్చి వచ్చితి
అనుగు నామనికోవిలవలె నాడా నీడా నేల తిరిగేవయ్యా ॥ నిండు ॥

యింతి సముద్రమువంటి తమకాన యెదు రెదురె చూడఁగా
యింతలోఁ గాఁదారి మాఁదారి పొద్దున నెవ్వతెఁ జూచేవయ్యా
వంతదీరఁ దాఁచుఁబాముువంటి దేవరమీఁద నానవెట్టితి
వంతుకు నీ విట్టె జుంటియీఁగవలె వాడ వాడ నేల తిరిగేవయ్యా ॥నిండు॥

చెలి చుక్క లన్ని కోరికలతోడ చిత్తము నీ కిచ్చు కుండఁగా
పొలసి నుచ్చిమి పొద్దున నెడపూఁబోఁడిఁ బిలిచేవయ్యా
కలికి శ్రీవెంకటనాథ నీవె గారవించి సతిఁ గూడితి
కొలఁకుల నీఁ దేరాయంచవలె కోడెకాఁడ యేల తిరిగేవయ్యా. ॥నిండు॥ 106

చి. శృ. 18 రే. 6 పా.　　　మాళవిగౌళ

నీ వెక్కుడో ఆపె నీకంటె నెక్కుడో
　రావయ్య తిరుపతి రఘురామచంద్ర　　　॥ పల్లవి ॥

తుముటగ దనుజులఁ దోలి తొప్పర లాడి
　అమరఁగ గెలిచితి నందువు (వు?)
　మమతతోడుత నిన్ను మదనయుద్ధమునందు
　రమణి నిన్ను గెలిచె రఘురామచంద్ర　　　॥ నీవె ॥

తవిలి శివుఁడు కాశిఁ దారకబ్రహ్మ ఘని
　యువల ని న్నుపదేశ మియ్యఁగా
　నవ మై శ్రీవెంకటనాథ మరుతంత్రము
　రవళి నీ కీపె యిచ్చె రఘురామచంద్రా.　　　॥ నీవె ॥ 107

చి. శృ. 19 రే. 1 పా.　　　దేసాళం

ఏమి మందు [1]గద్దె యింతులాల ।యీ।
　రామకుఁ దిరుపతి రాముఁడే మందు　　　పల్లవి ॥

వెలసెటివిరహాన వేఁగెటి యింతికి
　చెలియలాల యేమి సేతమే
　చలివేఁడివలపుల చవి గన్న యీపెకు
　వలపించిన తనవరుఁడే మందు　　　॥ ఏమి ॥

పొదిగొన్న తమకానఁ బొరలెటి కాంతకు
　చెదరక మన మేమి సేతమే
　వుదుటుఁ గోరికల నొనరెటి యీపెకు
　మదిలోపలి తనమగఁడే మందు　　　॥ ఏమి ॥

పొల్లవోని యాసఁ బొరలెటి మగువకు
　చెల్లఁబో మన మేమి సేతమే
　కొల్లగా రతి నింతిఁ గూడినాఁ డీపెకు
　నల్ల నిశ్రీవెంకటనాథుఁడే మందు.　　　॥ ఏమి ॥ 108

---

1. "వ" వ్రాసి "గ" గ తిద్ది యున్నారు.

చి. శృ. 19 రే. పా. నాధరామక్రియ

ఇన్నాళ్లు దా యేడ నుండెనమ్మ
వన్నెగాఁ గొఁరవచ్చీ నేఁడు ॥ పల్లవి ॥

వేఁకపువిరహాన వేఁగ లేక నేను
సోఁకఁగ నెదురు చూడఁగా
తాఁకి తలఁచఁడు తరుణులఁ గూడి
యేఁకట నిపుడు నే నిత వైతినా ॥ ఇన్నాళ్లు ॥

కడు నొంటిఁబొద్దు గడపఁగ లేక
వొడికపుటాసల నుండఁగా
తడవఁడు నన్ను దనయిచ్చలనే
అడరి యిప్పుడు నాపై ఆస పుట్టెనా ॥ ఇన్నాళ్లు ॥

గొప్పతమకానఁ గుందుచుండ లేక
అప్పుడె పిలువ నంపఁగా
కప్పి నన్ను శ్రీవెంకటనాథుఁడు గూడె
యిప్పుడు నారతు లింపు వుట్టెనా. ॥ ఇన్నాళ్లు ॥ 109

చి. శృ. 19 రే. 3 పా. దేవగాంధారి

చల్లని చూపులవాని చక్కనివాని । పీలి ।
చొల్లెపుఁ జుట్లవానిఁ జూపరమ్మ చెలులు ॥ పల్లవి ॥

వాడలోని చెలులను వలపించి వచ్చెనే । వాఁడు ।
చేడెల మనసు దొంగ చిన్నికృష్ణుఁడు
యేడుగడయునుఁ దానై యెలయించె నన్నును । వానిఁ ।
జూడక వుండఁగ లేను చూపరమ్మ చెలులు ॥ చల్లని ॥

మందలోని గొల్లెతల మరిగించి వచ్చెనే । వాఁడు ।
సందడిపెండ్లికొడుకు జాణకృష్ణుఁడు
ముందు వెనకా నలమి మోహింపించె నన్నును । వాని ।
పొందులు మానఁగ లేను పోసీకురే చెలు(లు?) ॥ చల్లని ॥

ఇంటింటి యింతుల నెల్లా యెలయించి వచ్చెనే । వాఁడు ।
దంటవాఁడు కవి(లి?) చేఁతలకృష్ణుఁడు
సంటునను శ్రీవెంకటనాథుఁడై నన్నుఁ గూడెనే । వాని ।
వొంటిఁ బాయలే నాపెద్ద సుంచరమ్మ చెలులు. ॥ పల్లవి ॥ 110

చి. కృ. 19 రే. 4 పా. పాడి

బాలుఁ డటవే సా దటవే వీఁడు పల్లదీఁడు గాక
కోలుముం దై తనమాఁటలే గెలువ గొబ్బనఁ దగవు చెప్పీనమ్మా ॥పల్లవి॥
పసులఁ బేయలఁ గూరిచీనమ్మా పాలు నేయి నారగించీనమ్మా
పసిబిడ్డఁ డంటా నెట్టు నమ్మవచ్చు బాలకృష్ణరాయని
కొసరి కన్నులు గీఁటీనమ్మా కొంగువట్టి యొయ్యనె తీసీనమ్మా
యిసుమంతలోనె కన్ను మొరఁగించి యిల్లిల్లు దప్పక తిరిగీనమ్మా ॥బాలు॥
సిరాటి రేవులఁ బొంచీనమ్మా నిక్కి నిక్కి తానె చూచీనమ్మా
వేసవేక యెట్టు దగ్గఱదము గోవిందకృష్ణరాయని
ఆరతితో నొడిచొడికీనమ్మా ఆనలువెట్టుచుఁ బోసీఁడమ్మా
మీఁదిడిమాయల నిందరినిఁ దాను వెంట వెంట నేల తిప్పీనమ్మా ॥బాలు॥
వొంటినె కాఁగిట నించీనమ్మా వొయ్యనె కళలు రేఁచీనమ్మా
వంటున మమ్మెల్లఁ గూడె శ్రీవెంకటనాథ కృష్ణరాయఁడు
జంటవలపులు చల్లీనమ్మా చలమున దక్కఁగొనె నోయమ్మా
బంటుగా నేలి అందరి మన్నించి పరిణామమున నున్నాఁడమ్మా. ॥బాలు॥

చి. కృ. 19 రే. 5 పా. శ్రీరాగం

తామెరయాఁటదియును భువిలో దప్పులఁ బొరలఁగఁ గలదా
కామించిన తన కులపురుషుని కరముల నలమినఁ గాకా ॥పల్లవి॥
ఇందుకళామౌళికి వతనుని కేకాలము వైరము గాదా
కందువతోఁ బున్నమగాఁగా గంతము గదచే
ముందరనెయెవవెటికరముల ముంబారముగదవఁగవసమా
అందముగా వడుములయమ్మలు అసిఁ బోయఁ గాకా ॥తామెర॥

కమలోత్పత్తికి హిమరుతువుకుఁ గలకాలము వైరము గాదా
అమలాంబరమునఁ గూడఁగ నాపద గడచే
అమరంగాఁ జక్రముఁ జాపిన అదియునుఁ గడవఁగ వశమా
క్రమమున హంసాగమమునఁ గడతేరెఁ గాకా ॥ తామెర ॥

నీలాంబుదశిఖికును గాలికి నిక్కముగా వైరము గాదా
మేలిమి మీఁదటి యోగము పేర్మినీబాదలు గడచే
ఆ[1]లించిన నదియ అపూర్వం బైనమఁ గడవఁగ వశమా
తాలిమి శ్రీవెంకటనాథుఁడు తాఁ గూడఁగ బ్రతికెఁ గాకా. ॥తామెర॥

చి. శృ. 19 రే. 6 పా. సాళంగనాట

జాజరవలపు జాణఁడే
వోజ దప్పఁడుగా నోయమ్మా ॥ పల్లవి ॥

వూవి పిలువఁగ నొల్లక పోయిన
మేనవాఁడ ననీ మేలే
మానలేక పోయి మళ్లివస్తి నవి
అనవెట్టీఁ జవు లవునటే ॥ జాజర ॥

పట్టి పెనఁగఁగఁ బరాకు నేసిన
చుట్టమ ననీఁ జూడరే
నెట్టన నాఁటికి నేఁడు వస్తి వవి
దిట్టమాఁట లాడీఁ దెలిసెనా ॥ జాజర ॥

చెయివట్టినాఁ జేరరాకుంటే నా
ప్రియుఁ డనీఁ బ్రేమతో
కయికొని శ్రీవెంకనాథుఁ డిట్టె
పయి పయి నన్నుఁ బాలించెనే. ॥ జాజర ॥ 113

చి. శృ. 20 రే. 1 పా. పాడి

వేళావేళలు లేవా వినోదములమైనాను
యేలా తమకించి వస్తే యిది నీ వెఱఁగవా ॥ పల్లవి ॥

---

1. "వి" వ్రాసి "లి" గా దిద్ది యున్నారు.

అయ్యో సారె నన్ను నలయించే వేరా
వొయ్యారపువాఁడ యింత కోపుదునా
చయ్యాటాన జాజిమొగ్గసానఁ బట్టే వేరా
నెయ్యపు నాతలఁ పిది నీ వెఱఁగవా ॥ వేరా ॥

యిటె(ట్టె?) మాఁటిమాఁటికి యేఁచే విదేమిరా
పట్టిన నీ చలాన నేఁ బడఁగలనా
పుట్టిపడి చిగురాకు పుక్కఁ బెట్టే వేరా
నెట్టన నా వల పిది నీ వెఱఁగవా ॥ వేరా ॥

చాలాఁ దరితీపుల నటలు నేసే వేరా
బాలకి నింతే నిన్నుఁ బాయఁ గలనా
మేలిమి దామెరలోఁ దుమ్మెద గూడినటు నన్ను
యేలి శ్రీవెంకటనాథ యిది నీ వెఱఁగవా. ॥ వేరా ॥ 114

చి. కృ. 20 రే. 2 పా. శంకరాభరణం

ఒగ్గాలివాఁడు గదె. వోయమ్మా
సిగ్గున నా కగపడె చిలుకచందమునా ॥ పల్లవి ॥

తలఁచుకొంటేఁ జాలు తా నాద కేఁగునమ్మా
వొలసి కమ్మగట్టు పావురమువలే
నెలఁత మదిఁ బారితే నిదురే కానఁడమ్మా
చలపాదిరా తిరి[1](గె?)టి జక్కవచందమునా ॥ ఒగ్గాలి ॥

ముదిత యెలుఁగు వింటే మొక్కలాన వాలునమ్మా
బెదరని పెంపుడుఁ బికిలివలే
సుదతి వుండిన యింటిచుట్టూఁ దిరుగునమ్మా
చెదరని మతితోడ జీనువవలెను ॥ ఒగ్గాలి ॥

గోమున నో యని యంటే గొబ్బున నోయను నమ్మా
కోమలపు వసంతపు కోవిలరీతి
కామించి మమ్మును శ్రీవెంకటనాథుఁడు గూడె
రామలలోఁ జాయలేని రాయంచవలెను. ॥ ఒగ్గాలి ॥ 115

1. "రి టి" ల మధ్య కొద్దిస్థలమును వదలి యున్నారు. "తిరిగెటి" యుండవోలు.

చి. శృ. 20 రే. 3 పా. ముఖారి

ఉపదేశ మిచ్చెఁగా వువిద మా కెల్లాను
యిపుడు నీ మన సాపె యెట్లా నెరిఁగెనో ॥ పల్లవి ॥

కలికి నిన్నునుఁ బాదకములానఁ బూజించె
నెలఁతై దేవర వని నేము మొక్కఁగా
పులివచ్చి నవ్వులతో వున్నాఁడ వందుకు నీవు
యెలమి నీ మన సాపె యెటులా నెరిఁగెనో ॥ ఉపదేశ ॥

తరుణి నీకు వుక్కిటితమ్ములాన విందు వెట్టె
వార వని నేము నిన్ను దొడ్డసేయఁగా
సరసాన నవ్వా నట పవి సేసు కున్నాఁడవు
యిరవై నీ మన సాపె యెటులా నెరిఁగెనో ॥ ఉపదేశ ॥

మగువ నిన్ను జూతుమాఁటలఁ గొనియాడె
నిగిడి యేలికె వని నేము గొల్వఁగా
నగుతా శ్రీవెంకటనాథ మమ్ముఁ గూడితివి
యెనువ నీ మన సాపె యెటులా నెరిఁగెనో. ॥ ఉపదేశ ॥ 116

చి. శృ. 20 రే. 4 పా. మాళవిగౌళ

గాలికూటిపేరిగట్టుమీఁదటివాఁడ
నేలపోద్యముపేరినెలఁత యె నిన్ను మెచ్చె ॥ పల్లవి ॥

తెలిమొయిలుపేరిటి తిలకము వెట్టి
వెలయఁ బై రెడిపేరి విరులు ముడిచి
బలిమి మరునిపేరిపండు చేఁ బట్టి
[1]జలజముపేరిటిసతి నిన్నుఁ జూచె ॥ గాలి ॥

1. "జలజముపేరిటి సతినిన్నుఁజూచె ॥౧॥ ంగాము" అని కొంతస్థలము వదలి వెక్కియున్నారు. కొంతస్థలము వదలి యుండుటచేతను, యతి తప్పియుండుటచేతను "శ్రీ" అని అక్షరముమ వేసితివి.

(రే?)ఁగాముపేరిటి రెంటెము గట్టి
భోగిపేరితీగాకు పొసఁగఁ జుట్టుచును
బాగుగాఁ జుక్కపేరి యాభరణాలు వెట్టి
నాగముపేరిటి నాతి నిన్నుఁ బిలిచె ॥ గాలి ॥

సురపతిపేరిట్టి(టి?)పరులు ధరించి
శిరుల మౌనిపేరి జీవముఁ బట్టి
హొరి నీటిపేరిపాన్పున శ్రీవెంకటనాథ
విరిమీఁదిబిడ్డపేరి వెలఁది నిన్నుఁ గూడె. ॥ గాలి ॥ 117

చి. శృ. 20 రే. 5 పా. రామక్రియ

చెప్పకురే వానిసుద్ది చెలులాల
వొప్పులు సేసిన తనవోజలు మానీనా ॥ పల్లవి ॥

తా నేవూరు నే నేవూరు తల మనవే చాలు
మానరాని వావు లేల మాకుఁ జెప్పీని
మోనాన నూరకుండరే మొన్నటివాఁడు గాఁడా
వూని గరివడ్డగింజ వుడుకఁ బొయ్యీనా ॥ చెప్ప ॥

యెక్కడి కెక్కడిపొందు లేలా మొక్కులు మొక్కి
దక్కినట్టి దాస లెల్లఁ దలపించీని
తక్కరించె నిన్నటి తగవరి తానె కాఁడా
మక్కువైనా చిలుక మానీనా గుణము ॥ చెప్ప ॥

యెంత కెంత మందెమేళ మిట్టె సంగడి నుండి
కాంతుఁడు న న్నేమిటికిఁ గాఁగిలించీనె
వింత లేక నన్నును శ్రీవెంకటనాథుఁడు గూడె
యెంత సేసినాఁ జక్కెర యేల తీపు మానును. ॥ చెప్ప ॥ 118

చి. శృ. 20 రే. 6 పా.    సాళంగనాట

అందు కేమి దోసమా ఆయితే నేమి
కందువై లోకములోనఁ గలదే కాదా ॥ పల్లవి ॥

వలచి యిందిరాదేవి వన్నెలుఁ జిక్కఁదనాలు
లఁషలో నేపొద్దూఁ దలపోయఁగా
పలిగెతోడుత నాపె సారూప్య మందినట్టు
నలువై గోవిందుఁడే నారాయణి యాయను ॥ అందు ॥

బాలకి యై లకిమమ్మ పై పై శిగ్గువడఁగా
తేలించి యాపె మనసు తెలియఁ బూని
చాలా వేడుక నాకె సకియై యుండినటు
అలికిఁ గా భువనమోహనరూప యాయను ॥ అందు ॥

యొడయ కింతులలో మే లెల్లాఁ దెలియఁ బూని
కడఁగి యాఁడురూపము గైకొని చూచి
బడినె తనకు నెందూఁ బతిలేనివాఁడు గాన
కడ గోవిందుఁడే శ్రీవెంకటనాథుఁ డాయను. ॥ అందు ॥ 119

# సూచిక ౧

## సంకీర్తన అకారాది సూచిక


| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| అంత మనసరి వని | .... పాడి | .... 60 |
| అంతేపో నాతోడ | ... పాడి | .... 88 |
| అందు కేమి దోసమా | .... సాళంగనాట | .... 119 |
| అటువంటివారికి | .... బౌళి | .... 103 |
| అన్నిటా నీదిద్దుబడె | .... శంకరాభరణం | .... 37 |
| అయ్యో దయ వలదా | .... ఆహిరి | .... 86 |
| అవునె లెస్సతగవు | .... సామంతం | ... 8 |
| ఆటదానఁ గనక | .... సామంతం | .... 63 |
| ఆతఁ డేమి దవ్వగాఁడు | .... పాడి | .... 44 |
| ఆతనినె ధూర్తమ్మ | .... పాడి | .... 49 |
| ఆపె యెరుఁగును నీ | .... వరాళి | .... 47 |
| ఇంక నేలా నాతోడ | .... బౌళి–వర్మతాళం | .... 100 |
| ఇంచుక యస మిచ్చితే | .... మాళవిగౌళ | .... 62 |
| ఇంతలో సందుకొనే | .... ఆహిరి | .... 11 |
| ఇంతిచక్కఁదన | .... శ్రీరాగం | .... 8 |
| ఇంతేసి పారుపత్తే | .... పాడి | .... 34 |
| ఇచ్చితమె నేనే వేరా | .... సామంతం | ... 99 |
| ఇది నీకె సమ్మతైతె | .... శంకరాభరణం | .... 40 |
| ఇది యేమె వీడి[illegible] | .... ముఖారి | .... 89 |
| ఇన్నాళ్ల నేవుగావో | .... సామంతం | ... 30 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య |
|---|---|---|---|---|
| ఇన్నాళ్లదా యేడ | .... | నాదరామక్రియ | .... | 109 |
| ఇన్నియు నేమి సేయునె | .... | ముఖారి | .... | 12 |
| ఇరుమొనసూది వని | .... | కాంబోది | .... | 56 |
| ఈదేర వలచితే | .... | సామంతం | .... | 75 |
| ఉపదేశ మిచ్చెఁగా | .... | ముఖారి | .... | 116 |
| ఎంచి మీచుట్టరికము | .... | శంకరాభరణం | .... | 4 |
| ఎంతనేరుపరివి | .... | భైరవి | .... | 9 |
| ఎంతసేసినాను | .... | పాడి | .... | 1 |
| ఎందరి చూరె యెవ్వరి | .... | కేదారగౌళ | .... | 4 |
| ఎందు కెందుకు గడించీ | .... | ఆహిరి | .... | 3 |
| ఎక్కడి పరాకుసనో | .... | ముఖారి | .... | 7 |
| ఎటువంటి దొర వైతి | .... | వరాళి | .... | 9 |
| ఎటువంటివాఁడె | .... | హిజ్జిజి | .... | 1 |
| ఎట్టకేల కిదేలరా | .... | వరాళి | .... | |
| ఎత్తూ నౌరా గలది | .... | నాదరామక్రియ | .... | 9 |
| ఎన్నఁడయ్యా నీ | .... | దేసాళం | .... | 8 |
| ఏఁటి కిఁక నాకు | .... | శంకరాభరణం | .... | 6 |
| ఏమి మందు గద్దె | .... | దేసాళం | .... | 10 |
| ఏలరా కృష్ణుఁడా | .... | బౌళి | .... | 5 |
| ఒక్కరి నౌ నన నేల | .... | దేసాళం | .... | 7 |
| ఒగాలివాఁడు గదె | .... | శంకరాభరణం | .... | 11 |
| ఒద్దన్నఁ జలము సేసీ | .... | పాడి | .... | |
| ఔనయా మే తెరిఁగిన | .... | సాళంగనాట | .... | 9 |
| కన్నెపడుచుతో నేమి | .... | శుద్ధదేశి | .... | 9 |
| కలితె నానతీవయ్యా | .... | దేసాళం | .... | 5 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| కాంతాళిం చాడినమాఁట | .... రామక్రియ | .... 71 |
| కాంతుఁడు మరవియాజ్ఞ | .... దేసాళం | .... 68 |
| కాదని వేగిరించితే | .... పాడి - అట | .... 53 |
| కొండవంటిదొరవు | .... శుద్ధదేశి | .... 77 |
| గాలికూటి పేరిగట్టుమీఁద | .... మాళవిగౌళ | ... 117 |
| గుజ్జనగూడు వండెనె | .... బౌళిరామక్రియ | ... 101 |
| చల్లని చూపులవాని | .... దేవగాంధారి | .... 110 |
| చాలా మేలుదిరా | .... లలిత | .... 84 |
| చాలుఁ జాలు నే | .... శంకరాభరణం | .... 7 |
| చాలు నాతో నింతేసి | .... కేదారగౌళ | .... 14 |
| చాలు లేరె మీ రేల | .... దేసాళం | .... 72 |
| చిత్తమె చిమ్మ రేఁగితే | .... బౌళి | .... 66 |
| చల్లరవెట్టుఁ జేఁతల | .... మలహరి | .... 20 |
| చెప్పకురే వానిసుద్ది | .... రామక్రియ | .... 118 |
| చెప్పరె మీరైనా | .... తెలుఁగుఁగాంబోది | .... 58 |
| చెల్లె నీవు నేసినట్టి | .... శంకరాభరణం | .... 28 |
| జాజరవలపుజాణఁదే | .... సాళంగనాట | ... 113 |
| తగవో బలిమో | .... సాళంగనాట | .... 38 |
| తగు నీకు నాకును | .... శంకరాభరణం | .... 17 |
| తనువె యిక్కడఁ గాని | .... భైరవి | .... 55 |
| తమకపడ నేఁటికి | .... ముఖారి | .... 32 |
| తలఁపుఁ దలఁపు | .... రామక్రియ-అట | .... 102 |
| తామెరయాఁటదియును | .... శ్రీరాగం | .... 112 |
| తియ్యనిమాఁటల | .... మాళవిగౌళ | .... 24 |
| తెలిప లందరుఁ గూడి | .... రామక్రియ | .... 36 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| తెలిసినమాట | .... వరాళి | .... 46 |
| తేటతెల్ల మిమాఁటల | .... ముఖారి - ఏక | .... 79 |
| దానిసాహసము మేలు | .... ముఖారి | .... 97 |
| దొరవు నిన్నేఁగా దని | .... సాళంగనాట | .... 22 |
| నన్ను నేఁ బొగడుకొన్నా | .... ఆహిరి | .... 33 |
| నా కన్నిచేఁత లెల్ల | .... శంకరాభరణం | .... 61 |
| నాలితనా లేటికోయి | .... కాంబోది | .... 18 |
| నిండుదొర వౌదు | .... కేదారగౌళ | .... 106 |
| నీగుణా లేల మానీని | .... వరాళి | .... 41 |
| నీ వెక్కుడో ఆపె | .... మాళవిగౌళ | .... 107 |
| నీ వేమి సేతు వాపె | .... బౌళి | .... 50 |
| నీ వేమి సేతువు నా | .... హిజ్జిజి | .... 9 |
| నీ వేల వత్తు వయ్యా | .... వరాళి | .... 51 |
| నేఁడు నీచేఁత లెల్లా | .... దేసాళం | .... 25 |
| నేనె యనఁగ నేల | .... కేదారగౌళ | .... 76 |
| పడఁతి నయ్యాననె | .... కేదారగౌళ | .... 16 |
| పాలు దాగె వెన్న దినె | .... హిందోళం | .... 87 |
| పింఛెపుతలజడల | .... రామక్రియ | .... 64 |
| బాలుఁ డటవే సా దటవే | .... పాడి | .... 111 |
| బాలుఁడు నేనెటి | .... కన్నడబంగాళం | .... 81 |
| బెల్లపుమాఁటల చెల్లపిల్ల | .... మాళవిగౌళ | .... 80 |
| మంచితనము ల దెట్టు | .... మాళవిగౌళ | .... 54 |
| ఘుందుల మాయలఁ బోదె | .... సామంతం | .... 104 |
| మచ్చికఁ బందిలి వెట్టే | .... కాంబోది | .... 83 |
| మాటకు మాఁటె యాడి | .... వరాళి | .... 69 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| మానరా నాతో నింక | .... పాడి | .... 4 |
| మిక్కిలి నేరుపరివి | .... ఆహిరి | .... 19 |
| మేర లేనివల పిది | .... గౌళ | .... 78 |
| మేలు మేలె నిన్ను | .... రామక్రియ | .... 26 |
| మేలురా యీనీగుణము | .... పాడి | .... 5 |
| రచ్చ కెక్కితివి | .... సాళంగనాట | .... 27 |
| రారా చిన్నన్నా | .... నాదరామక్రియ | .... 82 |
| రావయ్య వావిలిపాటి | .... పాడి | .... 67 |
| వద్దు నాతో వెచ్చీ | .... రామక్రియ | .... 23 |
| వలపించనేరుతువు | .... కేదారగౌళ | .... 18 |
| వలపులకలగంప | .... శంకరాభరణం | .... 31 |
| వల పేమి గంప | .... శ్రీరాగం | .... 90 |
| వలపేమి దాఁగునా | .... వరాళి | .... 35 |
| విన్నవించవే వోరమణి | .... మధ్యమావతి | .... 2 |
| వెఱపించితిగా వోయి | .... వరాళి | .... 105 |
| వెలఁది నీ చెమటలె | .... సామంతం | .... 45 |
| వేగిరమూ నీవు విభుఁడవు | .... నాదరామక్రియ | .... 57 |
| వేవేలుచేఁతలవాఁడు | .... నాదరామక్రియ | .... 29 |
| వేళావేళలు లేవా | .... పాడి | .... 114 |
| సంగతిగా మాఁటలాడ | .... శ్రీరాగం | .... 42 |
| సవతుల మైనాను | .... ముఖారి | .... 70 |
| సింగారపుమేనిచెలువరి | .... మేసబౌళి | .... 21 |
| సిగ్గువడ నేమిటికి | .... దేసాళం | .... 98 |
| సుసరాన మంచి దాయ | .... పాడి | .... 92 |

## సూచికలు

---

### సంకీర్తనల రాగముల అకారాది సూచిక


| రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఆహిరి | .... | 11, 19, 33, 39, 86. |
| కన్నడబంగాళం | .... | 81. |
| కాంబోది | .... | 18, 56. |
| కేదారగౌళ | .... | 13, 14, 16, 48, 76, 83, 106. |
| గౌళ | .... | 73. |
| తెలుఁగుఁగాంబోది | .... | 58. |
| దేవగాంధారి | .... | 110. |
| దేసాళం | .... | 25, 52, 68, 72, 78, 85, 96, 108. |
| నాదరామక్రియ | .... | 29, 57, 82, 95, 109. |
| పాడి | .... | 4, 5, 6, 10, 34, 44, 49, 53, 60, 67, 88, 92, 111, 114. |
| బౌళి | .... | 50, 59, 66, 100, 103. |
| బౌళిరామక్రియ | .... | 101. |
| భైరవి | .... | 55, 94. |
| మధ్యమావతి | .... | 2. |
| మలహరి | .... | 20. |
| మాళవిగౌళ | .... | 24, 54, 62, 80, 107, 117. |
| ముఖారి | .... | 12, 32, 70, 74, 79, 89, 97, 116. |
| మేచబౌళి | .... | 21. |
| రామక్రియ | .... | 23, 26, 36, 64, 71, 102, 118. |

23/12/26
156



| రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|
| లలిత | .... 84. |
| వరాళి | .... 1, 35, 41, 46, 47, 51, 69, 91, 105. |
| శంకరాభరణం | .... 7, 17, 28, 31, 37, 40, 43, 61, 65, 115. |
| శ్రీరాగం | .... 8, 42, 90, 112. |
| శుద్ధదేశి | .... 77, 93. |
| సామంతం | .... 3, 30, 45, 63, 75, 99, 104. |
| సాళంగనాట | .... 22, 27, 38, 98, 113, 119. |
| హిందోళం | .... 87. |
| హిజ్జిజి | .... 9, 15. |

## సూచిక ౩

### సంకీర్తన తాళముల అకారాది సూచిక

| తాళము | సంకీర్తన | రాగము | సంకీర్తనసంఖ్య. |
|---|---|---|---|
| అటతాళము | కాదని వేగిరించితే | పాడి | 53 |
| అటతాళము | తలఁపుఁ దలఁపు | రామక్రియ | 102 |
| ఏకతాళము | తేటతెల్ల మిమాఁటలు | ముఖారి | 79 |
| వర్మతాళము | ఇంక నేలా నాతోడ | బౌళి | 100 |